అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 6-3 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 67 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

త్రిపురలో సంఘ్ హింస

పలు పట్టణాల్లో వామపక్ష కార్యకర్తలపై దాడులు, విధ్వంసకాండ



దాడుల్లో గాయాలపాలైన సీపీఐ(ఎం) కార్యకర్తలు

అగర్తల: త్రిపుర ఎన్నికల్లో తమకు అనుకూల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని పలు చోట్ల బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంఘ్‌పరివార్ శక్తులు రెచ్చిపోతున్నాయి. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ, ఐపీఎఫ్‌టీ కూటమి మెజారిటీ సీట్లు సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఇంకా అక్కడ బీజేపీ కూటమి నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయకముందే పలు పట్టణాల్లో సంఘ్‌పరివార్ మూకలు దౌర్జన్యకాండకు పాల్పడుతున్నాయి. వామపక్ష కార్యకర్తలపై దాడులు.. సీపీఐ(ఎం)కార్యాలయాలను తగులబెడుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వామపక్ష కార్యకర్తల ఇండ్లపై, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడి విధ్వంసం సృష్టిస్తున్నారని.. తమ కార్యకర్తలపై హింసకు పాల్పడి భయాందోళనలకు గురి చేస్తున్నారని సీపీఐ(ఎం) ఎంపీ శంకర్‌ప్రసాద్ దత్తా తెలిపారు. అగర్తలలోని రామ్‌నగర్, దక్షిణ రామ్‌నగర్ సహా బిషాల్‌ఘర్, అమరేంద్రనగర్, మోహన్‌పూర్, సబ్రూమ్, మేలాఘర్, ఖోవాయి, జిరానియా, ఖోమ్‌లంగ్, బెలోనియా పట్టణాల్లో దాడులు జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

లెనిన్ విగ్రహాన్ని కూల్చేసిన హిందుత్వ మూకలు

త్రిపురలో బీజేపీ-ఐపీఎఫ్‌టీ మూకలు తమ విధ్వంసక, హింసాత్మక దాడులను కొనసాగిస్తూనే ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం అందరూ చూస్తుండగానే దక్షిణ త్రిపుర జిల్లాలోని బెలోనియా కాలేజ్ జోన్‌లో రష్యా విప్లవ నేత లెనిన్ విగ్రహాన్ని బుల్డోజర్లతో కూల్చి వేశారు.



లోక్‌సభలో..



రాజ్యసభలో..



దక్షిణ సెగ

దద్దరిల్లిన పార్లమెంట్

ఉభయసభల్లో టీఆర్ఎస్, టీడీపీ, అన్నాడీఎంకే పోరు

- మోడీ సర్కారుకు ముచ్చెమటలు
- పీఎన్‌బీ స్కాంపై సీపీఐ(ఎం), కాంగ్రెస్ ఆందోళన
- ఉభయసభలూ మంగళవారానికి వాయిదా
- ముస్లిం రిజర్వేషన్‌పై గులాబీ ఎంపీల పోరు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

పార్లమెంట్ ఉభయసభల్లో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు ప్రకంపనలు సృష్టించారు. నెల రోజుల విరామం తరువాత ప్రారంభమైన రెండో విడత బడ్జెట్ సమావేశాల తొలిరోజే నినాదాలతో హోరెత్తింది. పీఎన్‌బీ స్కాం నుంచి మొదలు కావేరీ జల వివాదం వరకు మోడీ సర్కారుకు విపక్షాలు ముచ్చెమటలు పట్టించాయి. తెలంగాణలో రిజర్వేషన్ కోటాను పెంచాలంటూ టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. మరోవైపు ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలంటూ టీడీపీ ఎంపీలు ప్లకార్డులతో నినదించారు. దీంతో స్వల్పకాలిక వ్యవధిలోనే లోక్‌సభ మొదట మధ్యాహ్నం 12 గంటలకు ఆ తరువాత మంగళవారానికి వాయిదా పడింది. ఇటు రాజ్యసభలోనూ కావేరీ నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలంటూ అన్నాడీఎంకే ఎంపీలు పోడియం చుట్టుముట్టారు. అదేసమయంలో విభజన హామీలపై టీడీపీ, కాంగ్రెస్ తమ పోరును 9లో



జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెసేతర రాజకీయ కూటమి ఏర్పాటుకై కంకణం కట్టుకున్న కేసీఆర్.

12 నుంచి అసెంబ్లీ

- బడ్జెట్ సమావేశాలు షురూ
- నోటిఫికేషన్ జారీ, ఏప్రిల్ మొదటివారంలో ముగింపు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటల నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ మొదటివారం వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ఎల్పీ సమావేశం ఎనిమిది లేదా పదో తేదీల్లో జరగనుంది. కాంగ్రెస్‌పార్టీఎల్పీ కూడా బస్సు యాత్ర అనంతరం భేటీ కానుంది.

వ్యవసాయానికి ప్రత్యేకం లేదు

- సేద్యరంగ బడ్జెట్ విరమించుకున్న రాష్ట్ర ప్రభుత్వం



ఫైల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఆర్థిక సంవత్సరంలో సాధారణ బడ్జెట్‌తోపాటు వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా బడ్జెట్ ప్రవేశపెట్టాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. 2018-19 రాష్ట్ర బడ్జెట్‌తో పాటు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టే అంశాలపై సోమవారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్ పై విధంగా నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ఈ సారి బడ్జెట్‌లో వ్యవసాయదారుల కోసం మరిన్ని కార్యక్రమాలు, పథకాల కోసం నిధులు కేటాయిస్తున్నదని సీఎం చెప్పారు. వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నందున వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చెప్పారు. దీనికి గల సాధ్యాసాధ్యాలపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రభుత్వానికి ఒకే బడ్జెట్ ఉండాలని, శాఖల వారీగా ప్రత్యేక బడ్జెట్లు ప్రవేశపెట్టడానికి రాజ్యాంగ నిబంధనలు అంగీకరించవని అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు. అసెంబ్లీ నియమావళిలోని రూల్ నెంబరు 150 ప్రకారం ఆదాయ, వ్యయాలు మాత్రమే బడ్జెట్ కిందికి వస్తాయని 9లో

రైతన్న కన్నెర్ర

- అచ్చంపేటలో వేరుశనగకు నిప్పు
- జగిత్యాల మార్కెట్‌కు తాళం



వివరాలు 9లో

బాలికపై సామూహిక లైంగిక దాడి

- బాధితురాలికి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స
- నలుగురు నిందితుల అరెస్టు
- సంగారెడ్డి జిల్లాలో మహిళా కూలీపై...
- ప్రతిఘటించడంతో బండరాయితో దాడి
- అపస్మారక స్థితిలో బాధితురాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్/అమీన్‌పూర్

బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లారు. మద్యం తాగించి నలుగురు వ్యక్తులు సామూహిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరగ్గా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి వాగ్మూలం ప్రకారం నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలో పని ఇస్తానని తీసుకెళ్లి మహిళా కూలీపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. మహిళ ప్రతిఘటించడంతో బండరాయితో 9లో

హస్తం వైపే కోదండరామ్!

టీజేఎస్ పొత్తుపై దాదాపు ఖరారు

- 85 సీట్లలో కాంగ్రెస్‌పార్టీ పోటీ
- 15 లేదా 20 సీట్లలో టీజేఎస్
- 1 లేదా 2 స్థానాల్లో ఇంటిపార్టీ
- ఇతరులకు 3 లేదా 5 స్థానాలు



ఫైల్

వివరాలు 9లో

వామపక్షాలు బలంగా ఉండాలి

- మోడీ నేతృత్వంలో బ్యాంకులు లూటీ
- కేసీఆర్ నాయకత్వంలో జాతీయస్థాయి ప్రత్యామ్నాయం: కడియం శ్రీహరి


వివరాలు 3లో

ఎంజీఆర్ తరహా పాలన అందిస్తా

- జయలలిత నిజమైన నాయకురాలు: రజనీకాంత్




వివరాలు 6లో



ది షేప్ ఆఫ్ వాటర్‌కు ఆస్కార్ అవార్డుల పంట

- వేడుకల్లో శ్రీదేవి శశికపూర్‌కు నివాళి


వివరాలు 8లో



మన ప్రభుత్వాలు కూడా వినికిడి సమస్యతో బాధపడుతునట్టున్నాయి రా.. మొత్తుకున్నా వినిపించుకోవడం లేదు

ఆధార్‌కు పెద్దలు నో

రైతు పాసుపుస్తకాల జారీ కోసం ఆధార్ నెంబర్లను సీడింగ్ చేయడానికి బడానేతలు, వ్యాపారవేత్తలు, ఉన్నతస్థాయి వ్యక్తులు, ధనిక రైతులు ముందుకు రావడం లేదు. బినామీ ఆస్తులు బయటపడతాయనే భయమే ఇందుకు కారణమని తెలిసింది. ముఖ్యమంత్రి ఇటీవల ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారుల భేటిలో రైతు పాసుపుస్తకాలకు ఆధార్ నెంబరు లింక్ చేయాలని, తద్వారా బినామీ ఆస్థులు సైతం బయటపడతాయని చెప్పిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో పెద్దలు, బడా కాంట్రాక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మల్టీప్లెక్స్‌ల యజమానులు, జీఎస్టీ పన్ను ఎగ్గొట్టిన ఉన్నతస్థాయి వ్యాపారులు, బాబాలు, స్వాములు ఆధార్ నెంబరును ఇవ్వడం లేదని తెలిసింది.



- ముందస్తు జాగ్రత్త..
- బినామీ ఆస్తులు బయటపడతాయనే !?
- సీఎం ప్రకటనే కారణమా ?
- 75 శాతం అనుసంధానం

బి. బసవపున్నయ్య

ఆధార్ నెంబరును రైతు పాసుపుస్తకంపై ముద్రించాలని ఇప్పటికే సర్కారు నిర్ణయించింది. అంతేగాక ఆధార్ నెంబరు ఇచ్చిన వారికి మాత్రమే ఎలక్ట్రానిక్ టైటిల్ కమ్ పట్టాదారు పాసు పుస్తకాలను జారీచేస్తామని కూడా చెప్పింది. ఇదిలావుండగా పాసు పుస్తకం ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వం అమలుచేయనున్న ఏడాదికి రూ. 4000 రైతు పెట్టుబడి పథకం వర్తిస్తుంది. రెండు పంటల సాగు పెట్టుబడి కింద రూ. 8000 ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ప్రధాన భూపరిపాలన కమిషనర్ ఆధ్వర్యంలో రైతు పాసుపుస్తకాలకు ఆధార్ నెంబరును లింక్ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఎలక్ట్రానిక్ పాసు పుస్తకం కోసం ఇప్పటివరకు రాష్ట్రంలోని 31 జిల్లాల్లో చురుగ్గా పని సాగుతున్నది. ఇటీవల అది మందగించినట్టు సమాచారం. దాదాపు 72,11, 511 రైతు ఖాతాలకుగాను 53,34,769 ఖాతాలను ఆధార్ నెంబరును అనుసంధాన ప్రక్రియ 9లో

కోరిక తీర్చలేదని కిరోసిన్‌పోసి...

దళిత మహిళను సజీవదహనం చేసిన భూస్వామి

రాజస్థాన్‌లో ఘటన

జైపూర్ : లైంగికదాడిని ప్రతిఘటించిన దళిత వివాహితపై ఓ భూస్వామి కిరోసిన్‌పోసి నిప్పంటించాడు. తీవ్ర కాలిన గాయాలైన ఆ బాధితురాలు మృత్యువుతో పోరాడి... అదేరోజు కన్నుమూసింది. రాజస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... బాధితురాలు రీనా కోలి(35) కుటుంబం రాజస్థాన్‌లోని చెపాబరోడ్ పట్టణంలోని కోలీమొహల్లా ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాకు చెందిన భూస్వామి రాంభరన్ యాదవ్ పొలాన్ని వీరు కౌలు చేస్తున్నారు. కాగా, శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్ళిన రాంభరన్ యాదవ్ బాధితురాలు రీనా కోలిని తన గదికి పిలిపించుకుని ఆమెపై లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో... అక్కడే ఉన్న కిరోసిన్‌ను ఆమెపై పోసి నిప్పటించాడు. తీవ్ర కాలిన గాయాలైన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు వాంగ్మూలం ఆధారంగా నిందితుడిపై ఐపీసీ 302 సెక్షన్, ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. అతడిని కవాయ్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

వికలాంగుల హక్కుల సాధకుడు..

జావేద్ అబీదీ కన్నుమూత



న్యూఢిల్లీ: వికలాంగుల హక్కుల కోసం పోరాడిన సామాజిక కార్యకర్త జావేద్ అబీదీ(53) ఆదివారం మధ్యాహ్నం 1-30 గంటలకు గుండెపోటుతో మరణించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికల ద్వారా వికలాంగుల సమాన హక్కుల కోసం గొంతు విప్పిన సామాజికవేత్తగా అబీదీకి పేరున్నది. నేషనల్ సెంటర్ ఫర్ ప్రొమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిసేబుల్డ్ పీపుల్(ఎన్‌సీపీఈడీపీ) డైరెక్టర్‌గా, డిసేబుల్డ్ పీపుల్ ఇంటర్నేషనల్ చైర్‌పర్సన్‌గా ఆయన వ్యవహరించారు. ఆయన కుటుంబానికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో అబీదీ జన్మించారు. 1995లో వికలాంగుల హక్కుల కోసం అబీదీ నేతృత్వంలో జరిగిన ఉద్యమం వల్లే పీడబ్ల్యూడీ చట్టానికి అదే ఏడాది కేంద్రం రూపకల్పన చేసింది. విద్య, ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు, సమాన అవకాశాలు కల్పించడంలో ఈ చట్టం ఎంతో ఉపయోగపడింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రం వికలాంగులకు తగిన సౌకర్యాలు కల్పించేలా ఒప్పించడంలో అబీదీ కీలక పాత్ర పోషించారు. అబీదీ మరణించిన రోజు తమకు విషాద దినమని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ద డీఫ్ తమ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నది. ఒక మంచి హృదయం స్పందించడం ఆగిపోయింది, జావేద్ అబీదీతో ఒక శకం ముగిసిందని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఢిల్లీ) అసోసియేట్ ప్రొఫెసర్ సత్యేంద్రసింగ్ అన్నారు.

13వ రోజుకు చేరిన 'టిస్' విద్యార్థుల నిరసన దీక్ష



ముంబయి, న్యూఢిల్లీ : ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ.. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమం 13వరోజుకు చేరింది. కళాశాల యాజమాన్యం, ప్రభుత్వం సంయుక్తంగా తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు కొన్ని రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం పోస్ట్‌కార్డుల క్యాంపైన్‌ను చేపట్టారు. స్థానికులకు ఖాళీ పోస్ట్ కార్డులను పంచి వాటిపై తమ సమస్యలు తెలిసేలా కేంద్ర మానవ వనరుల మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు రాసి పంపించాలని కోరారు. ఆర్థిక సాయాన్ని నిలిపివేయకూడదని 2015-16 విద్యా సంవత్సరం నుంచే డిమాండ్ చేస్తున్నామని, దీనివల్ల విద్యార్థులు సెమిస్టర్‌కు రూ.80వేలను కోల్పోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.


ఐద్వా మద్దతు

దేశంలో వివిధ ప్రాంతాల్లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (టిఐఎస్ఎస్) ప్రాంగణాల్లో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐద్వా) సంఘీభావం ప్రకటించింది. భారత ప్రభుత్వ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ స్టూడెంట్లు (జీఓఐ-పీఎంఎస్)తో సహా విద్యార్థులందరూ ఫీజులు తప్పనిసరిగా చెల్లించాలని టిఐఎస్ఎస్ పరిపాలన విభాగం ఏకపక్షంగా, హఠాత్తుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించింది.

మందిరం కట్టకపోతే మరో సిరియాగా భారత్

- ఆ నరమేధం నుంచి ముస్లింలు పాఠాలు నేర్చుకోవాలి : శ్రీశ్రీ రవిశంకర్

లక్నో : అయోధ్య రామ మందిరం-బాబ్రీ మసీదు వివాదంపై ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడం ఉత్తమమని, లేనిపక్షంలో భారత్ మరో సిరియాగా మారుతుందని హెచ్చరించారు. సిరియాలో జరుగుతున్న బాంబుదాడుల్లో అమాయక ప్రజలు, చిన్నారులు మృతిచెందుతున్న విషయం తెలిసిందే. రామమందిరం-బాబ్రీ మసీదు వివాదం నేపథ్యంలో భారత్‌లోనే సిరియాను చూడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని అన్నారు. ఓ జాతీయ వార్తా చానెల్‌కు సోమవారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. సిరియా నరమేధం నుంచి ముస్లింలు కొన్ని విషయాలు నేర్చుకుని, అయోధ్య వివాదంపై ఆశలు వదులుకుని వెనక్కి తగ్గడమే ఉత్తమమని అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) బహిష్కృత సభ్యుడు సయ్యద్ సల్మాన్ హుస్సేన్ నద్వీని తాను ప్రలోభపెట్టినట్టు వచ్చిన వార్తలను రవిశంకర్ తప్పుపట్టారు. షరియా చట్టం ప్రకారం మసీదును వేరే చోటుకి తరలించడం సాధ్యమేనని నద్వీ గతంలో చేసిన ప్రకటన తీవ్ర విమర్శలకు దారితీసింది. 'అయోధ్య అనేది ముస్లింలకు సంబంధించిన అంశం కాదని వారు గర్తించాలి. వివాదాస్పద స్థలంలో ప్రార్థనలు చేయడాన్ని ఇస్లాం అనుమతించదు. శ్రీరాముడిని అయోధ్యలో కాకుండా వేరే ప్రాంతంలో జన్మించేలా మేం చేయలేం. హిందువులు, ముస్లింల పరస్పర ఆమోదంతో రామమందిర నిర్మాణం జరగాలని కోరుకుంటున్నాం. అయోధ్య అంశంలో ప్రతి ఒక్కరూ కోర్టు తీర్పును అంగీకరించే పరిస్థితులు లేవు' అన్నారు. ముస్లింలకు ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని, వారు ఆ స్థలంలో మసీదు నిర్మించుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. వివాదాస్పద స్థలంలో రామ మందిరం నిర్మించేందుకు ముస్లింలు పూర్తి మద్ధతు తెలపాలని పిలుపునిచ్చారు.



'ప్రత్యేక తిప్రాలాండ్'

వేరుకుంపటి రాజేస్తున్న బీజేపీ మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ

- గిరిజనుడిని ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్

అగర్తల : త్రిపుర అసెంబ్లీలో బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి మెజార్టీ సాధించిన రెండు రోజుల్లోనే గిరిజన వేర్పాటువాదం గొంతు విప్పుతోంది. బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసిన ది ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) అధినేత నరేష్‌చంద్రదేవ్ వర్మ సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న ప్రత్యేక తిప్రాలాండ్ ఏర్పాటు డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. త్రిపుర తదుపరి ముఖ్యమంత్రిగా గిరిజనుడిని చేయాలని ఆయన డిమాండ్ చేశారు. త్రిపురను విభజించి గిరిజనులకు ప్రత్యేక తిప్రాలాండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఐపీఎఫ్‌టీ దీర్ఘకాలంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ఈ డిమాండ్ సాధనకోసం తరచు హింసాత్మక ఉద్యమాలతో రోడ్డెక్కుతున్న ఐపీఎఫ్‌టీ తమ రాష్ట్రంలోని బెంగాలీలను టార్గెట్ చేస్తోంది. ఈ పార్టీకి సరిహద్దు అవతలి నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న వేర్పాటు వాద సంస్థలతో సంబంధాలున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఈ పార్టీతో బాహాటంగానే పొత్తు కుదుర్చుకోవటం గమనార్హం. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో గత ఏడాది జులైలో త్రిపురను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే జాతీయ రహదారిని దిగ్బంధించిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. తరువాత కేంద్రం ఐపీఎఫ్‌టీ నేతలను ఢిల్లీ ఆహ్వానించటంతో వారు అక్కడి పెద్దలతో భేటీ అయ్యారు. కేంద్రం నుండి హామీలు లభించటంతో వర్మ తమ జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమాన్ని ఉపసంహరించుకున్నారు. ఇప్పుడు జాతీయ వాదం, దేశభక్తి అంటూ నినాదాలు చేస్తున్న బీజేపీ ఈ వేర్పాటు వాద సంస్థతో కుమ్మక్కయి గత ఏడాది చివరి నాటికి ఎన్నికల దోస్తీ ఖరారు చేసుకుంది. ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్న ఈ సంస్థకు జాతి వ్యతిరేక శక్తులయిన వేర్పాటు వాద సంస్థలతో సంబంధాలున్నాయి. గిరిజనుల సమస్యలను పరిశీలించేందుకు ఉన్నతాధికార కమిటీని ఏర్పాటు చేస్తామని ఐటీఎఫ్‌టీ నేతలకు బీజేపీ భరోసా ఇచ్చింది. ఇటీవలి త్రిపుర ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం బీజేపీ ఈ విషయాన్ని ప్రస్తావించింది. కాగా ఐపీఎఫ్‌టీ మాత్రం ఈ అంశాన్ని ఎన్నికల అనంతరం పరిశీలిస్తామని కేంద్రం తమకు హామీ ఇచ్చినట్టు చెబుతోంది. ఈ డిమాండ్‌పైనే ఐపీఎఫ్‌టీ తన మొత్తం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. 'మాకున్నది ఒకే ఒక్క డిమాండ్. ప్రచార ఎజెండా కూడా అదే, ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్నదే ఆ డిమాండ్. ప్రభుత్వంలో భాగంగా వున్నప్పటికీ మేం ఈ డిమాండ్‌ను కొనసాగిస్తాం. వాస్తవానికి మా పోరును ఉధృతం చేస్తాం' అని ఈ నెల 3న ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో దేవ్‌వర్మ స్పష్టం చేశారు. కాగా బీజేపీ మాత్రం తన మిత్రపక్షం డిమాండ్‌ను ఏ మాత్రం ప్రస్తావించకుండానే తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. తమ మిత్రపక్షం కేవలం వేర్పాటు వాద డిమాండ్‌పైనే ఓట్లు అడుగుతోందన్న విషయం తెలిసినప్పటికీ కమలదళం తాము రాష్ట్ర విభజనకు అనుకూలం కాదన్న సంకేతాలను వెలువరించింది. ఇప్పుడు ప్రచారపర్వంతో పాటు ఎన్నికల పర్వం కూడా ముగిసి కూటమి విజయం సాధించి గద్దెనెక్కేందుకు సిద్ధమైంది. ప్రభుత్వంలో ఐపీఎఫ్‌టీ భాగస్వామ్యం అన్నది ప్రత్యేక త్విప్రాలాండ్ డిమాండ్‌ను కొనసాగించటంపైనే ఆధారపడి వుంటుంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలలో కొందరు మంత్రులు కూడా కావచ్చు. అధికార గద్దెపైకి ఎక్కనున్న ఈ సంస్థ తన డిమాండ్‌కోసం ఈ అవకాశాన్ని ఏ మాత్రం ఉపయోగించుకుంటుందన్న విషయం ఆసక్తికరంగా మారుతోంది. ఈ డిమాండ్‌కే ప్రభుత్వ ప్రాధాన్యతనిస్తే అది ఆదివాసీ వర్గాలకు బెంగాలీలకు మధ్య చిచ్చు పెట్టటం ఖాయం. దీనితో పాటు వివిధ వేర్పాటు వాద గ్రూపులు కూడా క్రియాశీలకంగా మారేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. దీనిని వ్యతిరేకిస్తున్న వారు ప్రధానంగా త్రిపురలో వామపక్షాలపై హింసకు పాల్పడేందుకు ఈ వేర్పాటు వాదులకు అధికారం మరింత అండగా నిలుస్తుందనటంలో సందేహం అవసరం లేదు. ఇప్పటికే వామపక్ష కార్యాలయాలు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయన్న వార్తలు వెలువడుతున్నాయి. ఇక భవిష్యత్తంతా హింసాత్మకమైన చీకటి రోజుల మయమేనని చెప్పక తప్పదు.

ధనబలం, మీడియా నిరంతర దాడి

త్రిపురలో ఓటమిపై మాణిక్ సర్కార్



అగర్తల : అనూహ్యమైన ధనబలం, మీడియాలో నిరంతర దాడి ఫలితమే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి కారణమైందని త్రిపుర ఆపధర్మ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అన్నారు. ఈ ఫలితాన్ని తాము ఊహించలేదని, రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ ఎలాంటి కుట్రలు పన్నిందో త్రిపుర ప్రజలే కాదు, దేశప్రజలు కూడా గమనించారని చెప్పారు. పశ్చిమ బెంగాల్ సీపీఐ(ఎం) అధికారపత్రిక గణశక్తికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎంఎన్ఆర్ఈజీపీ, హౌసింగ్, తదితర పథకాలకుగాను రాష్ట్రానికి కేంద్ర కేటాయింపుల్లో భారీ కోత విధించడం ద్వారా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేలా చేసిందని విమర్శించారు. 'ఈ ఎన్నికల్లో వామపక్షపార్టీలు తమ శక్తివంచనలేకుండా పోరాడాయి.. అనూహ్యమైన ధన బలం, మీడియా యొక్క నిరంతర దాడికి వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడారు' అన్నారు. 'త్రిపుర ఎన్నికల్లో ఓటమిని సమీక్షించుకుంటాం. అన్ని ప్రాంతాల నుంచి పూర్తి వివరాలను సేకరించి విశ్లేషిస్తాం' అని మాణిక్ సర్కార్ చెప్పారు. 'వామపక్ష వ్యతిరేక శక్తులను బీజేపీ-ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) కూటమి తమ వైపు తిప్పుకోగలిగింది. వామపక్షాలకు 45 శాతం ఓట్లు వచ్చాయి. ఇంతకుముందు మేం సంపాదించిన ఓట్లలో కొంత భాగం కూడా బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమికి అనుకూలంగా పడ్డాయన్నది నిజమే. ఇలా ఎందుకు జరిగిందో మేం సమీక్షించుకుంటాం' అని సర్కార్ చెప్పారు. విచ్ఛిన్నకర ఎజెండాకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పోరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'ఫలితాల అనంతరం వామపక్ష కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, పార్టీ కార్యాలయాలను తగులబెట్టడం ప్రారంభమైంది. బీజేపీకి ఓటు వేసిన ప్రజలు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఇటువంటి వాతావరణాన్ని కోరుకోలేదు' అన్నారు. 'ఇప్పుడైనా ఇలాంటి దాడులను నిలిపివేయాలి. బిజెపి-ఐపీఎఫ్‌టీ పార్టీ నాయకత్వం ఈ దాడులను ఆపేలా సానుకూల చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం" అని మాణిక్ సర్కార్ చెప్పారు. త్రిపురకు నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన దేశంలోనే పేద సీఎంగా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే.

తేడా 0.7 శాతమే

మొత్తం 60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీలో బీజేపీ, ఐపీఎఫ్‌టీ (ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర) కూటమి 43 సీట్లను గెలుచుకుంది. సీపీఎం 16 స్థానాలను గెలుచుకుంది. బీజేపీకి 43 శాతం ఓట్లురాగా, సీపీఐ(ఎం)కు 42.3 శాతం వచ్చాయి. గెలుపు ఓటముల మధ్య తేడా కేవలం 0.7 శాతం ఓట్లు మాత్రమే కావడం గమనార్హం.


స్వతంత్ర పనితీరుతో పట్టుసాధిద్దాం...

- సీపీఐ(ఎం) బెంగాల్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం



కోల్‌కతా: సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర 25వ మహాసభలు సోమవారం నాడు ఇక్కడి ఆ పార్టీ ప్రధాన కార్యాలయం పీడీజీ భవన్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి అరుణ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం వుంచి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బిమన్ బసు, ప్రకాశ్ కరత్, రాష్ట్రకమిటీ కార్యదర్శి డా.సూర్యకాంత మిశ్రా, ఎంఎ బేబి, బృందాకరత్ తదితరులు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మహాసభలను ప్రారంభించిన ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ పార్టీ స్వతంత్ర పనితీరుతో మరింత బలోపేతమవుతుందని, జాతీయ స్థాయిలో పోరాట సామర్థ్యాన్ని పెంచుకుంటున్నదని చెప్పారు. అరుణపతాకచ్ఛాయలోనే సామాజిక మార్పు సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. నయా సరళీకరణ విధానాలు, మతోన్మాద శక్తులు దూకుడుతో పెరుగుతున్న దాడులు పార్లమెంటునే కాక సామాన్యులకు సంక్రమించిన రాజ్యాంగ హక్కులను సైతం కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికా తొత్తుగా మారుతూ ప్రజల జీవితాలను ప్రమాదపుటంచులకు నెడుతున్నదన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు, ప్రస్తుత అణచివేత ప్రభుత్వాన్ని మార్చేందుకు పార్టీ ఉద్యమిస్తుందన్నారు. కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో వున్న ఎన్డీయే ప్రభుత్వం నయా సరళీకరణ విధానాలను దూకుడుగా అమలు చేస్తూ పెద్ద నోట్ల రద్దు వంటి ప్రమాదకరమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు చర్య అటు శ్రామిక వర్గంతో పాటు ఇటు బడుగు వర్గాలను కూడా ఇక్కట్ల పాలు చేసిందన్నారు. గుజరాత్‌లో చట్టసభలను నిర్లక్ష్యం చేసి ప్రజా వ్యతిరేక పాలన సాగించిన మోడీ ప్రస్తుతం అదే తరహాలో పార్లమెంట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని ఏచూరి విమర్శించారు. భారతీయ తత్వశాస్త్రం స్థానంలో హిందూ మత సిద్ధాంతాలు, పురాణాలు ప్రాచుర్యం పొందుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం ఈ అసంబద్ధమైన విధానాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ సారధ్యంలోని బెంగాల్ ప్రభుత్వం పోటీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో లౌకిక వాతావరణాన్ని భగ్నం చేస్తోందని, మైనార్టీ ఛాందసవాద శక్తులను బుజ్జగించే విధానంతో రాష్ట్రంలో మతోన్మాదానికి ఆజ్యం పోస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పార్టీ మహాసభలు రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవాన్ని సాధించేందుకు దోహదపడతాయని భావిస్తున్నామని, ప్రజాబలంతో పార్టీని సంపూర్ణ విప్లవ పార్టీకి తీర్చిదిద్దుతామని ఏచూరి చెప్పారు. ఈ మహాసభల నేపథ్యంలో పార్టీ శ్రేణులు అనేక కార్యక్రమాలు చేపట్టాయి. రాష్ట్ర మహాసభలకు నగరం మూడు ప్రాంతాలనుండి భారీ ర్యాలీలలో కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్లలో ఏచూరితోపాటు ప్రకాశ్‌కరత్, బృందాకరత్ తదితర అగ్రనేతలు ప్రసంగించారు.

'వామపక్ష ఉద్యమాలు మరింత బలపడాలి'



తిరువనంతపురం : దేశంలో వామపక్ష ఉద్యమాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని సీనియర్ కాంగ్రెస్ నేత జయరాం రమేష్ పేర్కొన్నారు. కేరళలోని ఆర్కిటెక్చర్ లూరీ బేకర్ శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వామపక్షాలు బలహీనపడటం దేశానికి హానికరమని తెలిపారు. తాము రాజకీయ ప్రత్యర్థులమైనప్పటికీ, వామపక్షాల ప్రభావం తగ్గడాన్ని ఆమోదించలేకపోతున్నామని తెలిపారు. దీనిపై వామపక్షాలు తమ విధానాలను మార్చుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. త్రిపురలో వామపక్షాల ఓటమి అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీని ఓడించడానికి మరొక ప్రత్నామ్నాయ కూటమిని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్, వామపక్షాలు భావాలు కలిగిన వారి మధ్య ఇటీవల చర్చలు జరిగిన నేపథ్యంలో జైరాం రమేష్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఊడనున్న అధ్యాపక ఉద్యోగాలు

1.78 లక్షల మందిపై వేలాడుతోన్న కత్తి

- సిబ్బంది, విద్యార్థుల నిష్పత్తి పెంచడమే కారణం
- ప్రమాదంలో ప్రొఫెషనల్ విద్య
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన అధ్యాపకులు



న్యూఢిల్లీ : దేశంలో ప్రొఫెషనల్ విద్య నీరు గారనున్నదా? ఇంజినీరింగ్, ఎంబీఏ, తదితర కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గుముఖం పట్టనున్నదా? ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే ఇది నిజం కాబోతుందనడంలో ఎలాంటి సందేహమూ తలెత్తదు. దాంతో పాటు దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్ కాలేజీల్లో పని చేస్తున్న 1.78 లక్షల మంది ఉద్యోగాలు ఊడే పరిస్థితి దాపురించింది. దీనంతటికీ కారణం అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల నిష్పత్తిని పెంచడమే. ఇంజినీరింగ్, ఎంబీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో టీచర్ స్టూడెంట్ నిష్పత్తిని 1:15 నుంచి 1:20కి పెంచుతూ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) నిర్ణయం తీసుకున్నది. బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులున్న ప్రయివేటు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కాలేజీలకు ఈ నిబంధన వర్తించనున్నది. దీంతో పాటు డిప్లొమాలో 1:20గా ఉన్న అధ్యాపక విద్యార్థి నిష్పత్తిని 1:25కి పెంచారు. కాగా.. ఏఐసీటీఈ తాజా నిర్ణయంపై స్టే విధించాలని కోరుతూ అధ్యాపకులు భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రయివేటు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(పీఈఐఈఏ) తమిళనాడు, మరికొందరు సెల్ఫ్ ఫైనాన్సింగ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై ఈనెల 9న విచారించే కోర్టు ధర్మాసనం అవకాశమున్నట్టు తెలుస్తున్నది.

అధ్యాపకుల్లో మొదలైన భయాందోళన

ఏఐసీటీఈ తాజా నిర్ణయం అధ్యాపకులను కలవరపెడుతున్నది. పెంచిన నిష్పత్తి విధానాన్ని అమలు చేస్తే దేశంలో పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, ప్రొఫెసర్లు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. దాదాపు 1.78 లక్షల మంది సిబ్బందిని కాలేజీలు వదిలించుకునే అవకాశమున్నది. వీరిలో లక్ష మంది ఇంజినీరింగ్ కాలేజీల నుంచే ఉండటం గమనార్హం. తాజా పరిణామంతో ఉద్యోగుల భవిష్యత్తే కాదు.. దేశంలో ప్రొఫెషనల్ కోర్సుల మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందని పీఈఐఈఏ అధ్యక్షుడు కేఎం కార్తీక్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నిష్పత్తిని అమలు చేస్తే కాలేజీల్లో అధ్యాపక సిబ్బంది సంఖ్య భారీగా తగ్గిపోతుందని, ఈ కారణంగా భవిష్యత్తులో ఇంజినీరింగ్, ఇతర టెక్నికల్ కోర్సులను ఎంచుకోవడానికి విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని తెలిపారు. దేశంలో ఇప్పటికే ఇంజినీరింగ్ కాలేజీలు పెద్ద ఎత్తున మూత పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాక, అధ్యాపక సిబ్బంది ఎక్కువగా మిగిలిపోయే అవకాశముండటంతో తక్కువ వేతనానికే పని చేయాలని కాలేజీల యాజమాన్యాలు వారిని ఒత్తిడి చేసే ప్రమాదమూ లేకపోలేదన్నారు. ఉద్యోగం వదులుకునే కంటే తక్కువ జీతంతో పని చేయడానికి అంగీకరించాల్సిన గత్యంతరం బోధనా సిబ్బందికి ఏర్పడుతుందని కార్తీక్ వివరించారు.

ముంబయిలో మరో స్కాం..

447 కంపెనీలు..రూ.3200 కోట్ల టీడీఎస్(పన్ను) ఎగవేత

- ఐటీ శాఖ దర్యాప్తులో వెల్లడి

ముంబయి: ఒక్క ఏడాది కాలంలోనే ముంబయికి చెందిన 447 కంపెనీలు రూ.3200 కోట్ల పన్నును ఎగవేసినట్టు ఆదాయం పన్నుశాఖ గుర్తించింది. ప్రతినెలా టీడీఎస్(ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) పేరుతో కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలకు కోత పెట్టి ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే,ఉద్యోగుల నుంచి వసూలు చేసిన ఈ పన్నును ఆయా కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించకుండా తమ వ్యాపారాలకు ఉపయోగించినట్టు తెలుస్తోంది. టీడీఎస్ విభాగం ఇప్పటికే పన్నులు చెల్లించని కంపెనీలపై చర్యలు ప్రారంభించినట్టు ఓ అధికారి తెలిపారు. పన్నులు ఎగ్గొట్టినవారిలో ఎక్కువగా బిల్డర్లు ఉన్నట్టు తెలుస్తోంది. వారిలో ఒకరు రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తి అని, రూ.100 కోట్లమేర ఉద్యోగుల నుంచి వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించకుండా తన వ్యాపారానికి ఉపయోగించారని తెలుస్తోంది. ఎగవేతకు పాల్పడినవారిలో సినీ నిర్మాణ సంస్థలు, మౌలిక వసతుల కల్పనా సంస్థలు, స్టార్టప్ కంపెనీలు ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం. ఓడరేవు అభివృద్ధి సంస్థలో భాగమైన ఓ కంపెనీ రూ.14 కోట్లు, ఐటీ సొల్యూషన్స్‌కు చెందిన మరో కంపెనీ రూ.11 కోట్లమేర ఎగవేతకు పాల్పడ్డాయి. ఇప్పటికే కొందరికి వారెంట్లు జారీ అయ్యాయని అధికారులు తెలిపారు. ఆదాయం పన్ను చట్టంలోని సెక్షన్ 276-బీ ప్రకారం ఇలాంటి నేరాలకు పాల్పడినవారికి మూడు నెలల నుంచి ఏడేండ్ల వరకూ శిక్షలు పడే అవకాశమున్నది. అటు ఉద్యోగులనూ ఇటు ప్రభుత్వాన్ని మోసగించిన ఈ కేసులన్నీ 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్య కాలంలో జరిగినవని అధికారులు తెలిపారు.

అన్నార్తుల ఆకలి తీర్చే 'ప్రజా భోజనశాల'

అలప్పుజ: అన్నార్తుల ఆకలి తీర్చడం కోసం కేరళలోని అలప్పుజ జిల్లాలో 'ప్రజాభోజనశాల'(జనకీయ భక్షనశాల) ఏర్పాటైంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి, స్థానిక ఎమ్మెల్యే థామస్ ఇస్సాక్ సహకారంతో నడిచే స్నేహజాలకం అనే స్వచ్ఛంద సంస్థ ఈ భోజనశాలను ఏర్పాటు చేసింది. ఆకలి తీర్చుకోవడానికి బియ్యాన్ని దొంగిలించాడనే ఆరోపణతో కేరళలో మధు అనే ఓ గిరిజన యువకుడిని స్థానికులు కొట్టి చంపిన విషయం తెలిసిందే. దాంతో ఆకలి లేని రాష్ట్రంగా తీర్చడానికి అలప్పుజ జిల్లా ప్రజలు నిర్ణయించుకున్నారు. ఇందుకు స్నేహజాలకం స్వచ్ఛంద సంస్థ 'ప్రజా భోజనశాల' ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. దీనిని రాష్ట్ర ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్ గత శనివారం ప్రారంభించారు. దాతల నుంచి వచ్చే విరాళాల సహాయంతో నడిచే ఈ హోటల్.. అన్నార్తులకు ఉచితంగా భోజనాన్ని సమకూరుస్తోంది. రెండెంతస్థులుండే ఈ హోటల్.. ప్రతిరోజూ రెండు వేల మంది ఆకలిని తీరుస్తోంది. సీఎస్ఆర్, కేరళ స్టేట్ ఫైనాన్సియల్ కార్పొరేషన్(కేఎస్ఎఫ్) అందజేసిన రూ. 11.25 లక్షల సహాయంతో దీనిని ఏర్పాటుచేశారు. హోటల్ వెనకాల రెండున్నరెకరాల్లో సేంద్రీయ వ్యవసాయం కూడా ఉంది. సీపీఐ(ఎం) భాగస్వామ్యంతో స్నేహజాలకం స్వచ్ఛంద సంస్థ దాతల నుంచి వచ్చే విరాళాల సహాయంతో ప్రజా హోటల్‌ను నడుపుతున్నది. ఈ స్వచ్ఛంద సంస్థ ఇప్పటి వరకు విరాళాల ద్వారా సంస్థ రూ. 20 లక్షలకు పైగా సేకరించింది.

సామాజిక న్యాయం ప్రాతిపదికనే పోటీ

బీజేపీకి ప్రత్యామ్నాయం టీఆర్‌ఎస్ కాజాలదు : తమ్మినేని


మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ-ఖమ్మం

సామాజిక న్యాయం ప్రాతిపదికనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలకు బీఎల్‌ఎఫ్ పోటీ చేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శివర్గ సభ్యుల సంయుక్త సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని అయిలయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ వామపక్ష బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఇప్పటికే అనేక సామాజిక సంఘాలతో చర్చలు జరుపుతున్నదని, వాటిని ఐక్యం చేసి బీఎల్‌ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. బీజేపీకి ప్రత్యామ్నాయం టీఆర్‌ఎస్ కాజాలదని, రాష్ట్రంలో టీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఎల్‌ఎఫ్ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో 119 స్థానాల్లో బీఎల్‌ఎఫ్ పోటీ చేస్తుందన్నారు. ఏపీకి, తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా ఇప్పటి వరకూ కేంద్రంపై కేసీఆర్, చంద్రబాబు నోరు మెదపలేదన్నారు. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు ఆర్థిక కుంభకోణాలు జరుగుతున్నా వారు వంతపాడారని విమర్శించారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఐక వారసత్వ రాజకీయాలకు ప్రజలు తిలోదకాలు ఇస్తారన్నారు.

రాష్ట్రంలో బీఎల్‌ఎఫ్ జిల్లాల సమావేశాలకు ప్రజలు విస్తృతంగా హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్వరలో బీఎల్‌ఎఫ్ జిల్లాల నిర్మాణ సమావేశాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సున్నం రాజయ్య, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, ఏజే.రమేష్, మచ్చా వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వరరావు, రెండు జిల్లాల కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.



కమ్యూనిస్టులు బలపడితేనే పేదల బతుకులు మారుతాయి..

- నల్లధనం బయటకు తీసుకురాలేదెందుకు ?
- నయీమ్ బాధితుల పక్షాన పోరాటం :

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ- కొల్లాపూర్

కమ్యూనిస్టులు బలపడితేనే పేద ప్రజల బతుకులు మారతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సీపీఐ నాగర్‌కర్నూల్ జిల్లా మహాసభ సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో 550 సంస్థానాల్లో పోరాటం చేసింది కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు ప్రజల పక్షాన పోరాటం చేస్తారని వివరించారు. దేశంలో దోపిడీ రాజ్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.72లక్షల కోట్ల నల్లధనాన్ని బీజేపీ ప్రభుత్వం ఎందుకు బయటికి తీసుకురాలేదని ప్రశ్నించారు. బడా కార్పొరేట్ సంస్థల చేతుల్లో 90శాతం దేశ సంపద ఉందన్నారు. దేశంలో కుంభకోణాలు, అవినీతి పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు కమిటీల్లో భూములు లేని రైతులు ఉన్నారన్నారు. నయీమ్ బాధితుల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు.

వామపక్షాలు బలంగా ఉండాలి

- మోడీ నేతృత్వంలో బ్యాంకులు లూటీ
- కేసీఆర్ నాయకత్వంలో జాతీయస్థాయి ప్రత్యామ్నాయం : డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



నవతెలంగాణ-వరంగల్

దేశంలో వామపక్షాలు బలంగా ఉండాలని, ప్రశ్నించే గొంతుకగా ఉండాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశంలో బ్యాంకులు లూటీ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఆర్థిక నేరగాళ్లను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. బ్యాంకుల లూటీ వెనుక కేంద్ర ప్రభుత్వ హస్తం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో దేశ ప్రజలు విసుగు చెందా రన్నారు. ప్రత్యామ్నాయం లేకనే దేశ ప్రజలు ఇప్పటి వరకు ఈ రెండు పార్టీలను ఆదరిస్తూ వచ్చారని చెప్పారు. ప్రజల ఆశలు నెరవేరాలంటే ప్రత్యామ్నాయం అవసరమన్నారు. అందుకే కేసీఆర్ జాతీయస్థాయిలో ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుకు ఆలోచిస్తు న్నారన్నారు. దీనికి వామపక్షాలు మద్దతివ్వాలని కోరారు. వామపక్షాలు బలంగా ఉండాలని, ప్రజలకనుగుణంగా సిద్ధాంతాలను మార్చుకో లేకపోవడం వల్లే వామపక్షాలు బలహీనపడ్డాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. వామపక్షాలు అభిప్రాయ భేదాలను పక్కన పెట్టి ఏకతాటిపైకి రావాలని కోరారు. సమావేశంలో మంత్రి చందూ లాల్, జెడ్‌పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, వరంగల్ ఎంపీ దయాకర్, మేయర్ నన్నపనేని నరేందర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఉన్నారు.

సమ్మక్క-సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించలేం...

- తెలంగాణకు కేంద్రం మరోసారి మొండిచేయి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపింది. దక్షిణాసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ఖ్యాతి గడించిన సమ్మక్క-సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించలేమని కేంద్రం స్పష్టం చేసింది. ఏపీ ఎంపీ అవంతి శ్రీనివాస్ అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి జశ్వంత్‌సింగ్ భాభోర్ సోమవారం ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. సమ్మక్క-సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర గిరిజన, పర్యాటక తదితర శాఖల నుంచి తమకు ప్రతిపాదనలు అందాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసినట్టుగా ఇది మూడు రోజుల జాతరని, ఈ పండుగకు తెలంగాణలోని పలు ప్రాంతాలతో పాటు పక్కనున్న రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని వివరించారు. అయితే పండుగ ప్రాముఖ్యతను గుర్తించి.. జాతరను విజయవంతం నిర్వహించేందుకు కేంద్ర గిరిజన శాఖ రూ. రెండు కోట్ల సాయం అందజేసిందని పేర్కొన్నారు. 'ప్రస్తుతం, ఏ కార్యక్రమాన్ని జాతీయ పండుగగా గుర్తించే పథకం కానీ లేదా మార్గదర్శకాలు కానీ లేవు' అని మంత్రి తన సమాధానంలో తెలియజేశారు.

'టెక్స్‌టైల్' వేగం పెంచాలి

- స్థలం కేటాయిస్తే పార్కులో కంపెనీల ఏర్పాటు: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-గీసుకొండ

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించడానికి టెండర్లు త్వరగా పూర్తిచేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఐటీశాఖ మంత్రి తారకరామారావు ఆదేశించారు. వరంగల్‌రూరల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలోని రాయినికుంట వద్ద టెక్స్‌టైల్ పార్కు స్థలంలో పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యంగా నీటి వసతి, విద్యుత్, రహదారుల సౌకర్యం కల్పించి కంపెనీలకు స్లాట్స్ కేటాయిస్తే ఆయా కంపెనీలు పనులు ప్రారంభిస్తాయన్నారు. పార్కులో పరిశ్రమలకు అవసరమైన నీటిని ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి కాకుండా సంగెం మండలంలోని ఎల్గూరురంగంపేట నుంచి తీసుకుంటే తక్కువ ఖర్చు, సులభంగా ఉంటుందని సూచించారు. దేవాదుల నీటిని ఎల్గూరురంగంపేట చెరువుకు లింక్ చేస్తే మంచిదని డిప్యూటీ సీఎం చెప్పగా, ధర్మసాగర్ రిజర్వాయర్ లేదా ఎల్గూరురంగరంపేట చెరువు నీటిలో ఏది సులభంగా, ఖర్చు తక్కువగా ఉంటే దాన్నే ఖరారు చేయాలని అధికారులకు మంత్రి కేటీఆర్ సూచించారు. రాళ్లమాటు చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి కాకతీయ కాలువ నుంచి నీటిని తీసుకుంటే సమ్మర్ స్టోరేజ్ కింద ఉపయోగించుకునే అవకాశముందని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. పరిశ్రమల కోసం వాడే నీటిని తిరిగి వినియోగించుకునేలా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో నీటి అవసరం పెద్దగా ఉండకుండా సమస్య తీరుతుందన్నారు. పార్కు చుట్టు నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణం జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. పైలాన్ వద్ద అడ్మినిస్ట్రేటీవ్ బ్లాక్, ఇతర కట్టడాల విషయంలో టెండర్లు త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఇంతపెద్ద ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి పార్కు కోసం ప్రత్యేకంగా ప్రాజెక్టు ఆఫీసర్ కావాలని మంత్రి కేటీఆర్‌ను డిప్యూటీ సీఎం కోరారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, తాటికొండ రాజయ్య, వరంగల్ నగర మేయర్ నన్నపనేని నరేందర్, టీఎస్ఐఐసీ జీఎం శ్యామ్‌సుందర్, ఇన్‌చార్జి జెడ్‌ఎం భిక్షం, బీజీవీఎం రాజగోపాల్, మేనేజర్ రాందాస్, వరంగల్ రూరల్ డివిజన్ ఆర్డీవో మహేందర్‌జీ, గీసుకొండ తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ కొంగర చంద్రమౌళి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు టి.రవీందర్‌రావు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాలయాపన

కేంద్రం తీరుపై ఐద్వా ఆగ్రహం

- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్
- విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలి
- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు రాస్తారోకోలు

హైదరాబాద్‌లో..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు టీ.జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూపీఏ హయాంలో ఇదే అంశంపై నాటి ఎన్‌డీఏ మద్దతు ప్రకటించిందని.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చి మూడున్నరేండ్లు గడిచినా ఎందుకు స్పందించడంలేదని మండిపడ్డారు. స్వతహాగా అధికారంలో ఉన్న బీజేపీ వెంటనే బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఐద్వా కేంద్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లో '33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు'పై ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తాలో పెద్దన రాస్తారోకో..నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఐద్వా కార్యకర్తలు తరలిరావడంతో భారీగా ట్రాఫిక్ జాం అయింది. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేఎన్ ఆశాలత, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి, చల్లా లీలావతి, వినోద, విమల, పద్మ, పీ.లక్ష్మీ, సుగుణ తదితరులను అరెస్టు చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అంతకుముందు ఎం.లక్ష్మీ, టీ.జ్యోతి విలేకరులతో మాట్లాడారు. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లు లోక్‌సభలో ఎందుకు ప్రవేశపెట్టడంలేదని ప్రశ్నించారు. బిల్లు కోసం నాడు కేంద్రంలోని కాంగ్రెస్‌పై ఒత్తిడి తీసుకొచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏకాభిప్రాయం పేరుతో కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. మహిళా సాధికారతకు పెద్ద పీటవేస్తున్నామని చెబుతున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారిని అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రువాండా, క్యూబా, వియాత్నం, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ వంటి దేశాలు మహిళాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుంటే.. మన దేశ పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మోడీ సర్కార్ స్పందించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని లేకపోతే ప్రణాళిక ప్రకారం దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు స్వర్ణలతతోపాటు వందలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల..

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

- 13,671 కోట్ల సబ్‌ప్లాన్ నిధుల దారి మళ్లింపు
- కర్నాటక తరహాలో అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న జూలకంటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సబ్‌ప్లాన్ నిధుల వ్యయంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని గిరిజన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఈ నాలుగేండ్లలో రూ.23,932 కోట్లు కేటాయిస్తే అందులో నుంచి రూ.13,671 కోట్ల నిధులను దారి మళ్లించారని ఆందోళన వ్యక్తం చేశారు. నిధుల వ్యయంపై సర్కారు ఎలాంటి సమీక్షలు నిర్వహించడం లేదని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధుల వ్యయంపై కర్నాటక తరహాలో అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ అధ్యక్షతన "గిరిజన అభివృద్ధి నిధి- రాష్ట్ర బడ్జెట్" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ (ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్, డీబీఎఫ్ నాయకులు శంకర్‌తో పాటు శోభన్ నాయక్, భూపాల్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

నిధులు దారి మళ్లింపు

దళిత, గిరిజన సంక్షేమం కోసం సబ్‌ప్లాన్‌లో కేటాయించిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే తమ ఎజెండా అని చెప్పిన సీఎం కేసీఆర్ పేదల కోసం కేటాయించిన నిధులను పెద్దల కోసం దారి మళ్లించారని విమర్శించారు. గిరిజన సంక్షేమం కోసం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన ఏ ఒక్క అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. పోడు భూములు, కాందీశీకులు సాగు చేస్తున్న భూములకు కూడా ఎకరానికి రూ. 4వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి గిరిజన కుటుంబానికి మూడెకరాల భూమి ఇవ్వకపోగా సాగు చేస్తున్న పోడు భూములను కూడా సర్కారు స్వాధీనం చేసుకుని వారిని నిర్వాసితులను చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ నిధుల కేటాయింపు.. ఖర్చుపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని జూలకంటి పిలుపునిచ్చారు.

శాఖాధిపతులపై కేసులు నమోదు చేయాలి

జాన్ వెస్లీ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయని శాఖాధిపతులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులను పకడ్బందీగా అమలు చేసేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. దారి మళ్లించిన ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గిరిజన తండాల్లో పూర్తి స్థాయిలో మౌలికసదుపాయాలు కల్పించొచ్చని తెలిపారు. శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న చట్టం నిర్వీర్యమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని కోరలు లేకుండా చేసేందుకే సబ్‌ప్లాన్ చట్టం పేరును మార్చారని విమర్శించారు. శంకర్ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం నిధుల వ్యయంపై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2017-18 వార్షిక బడ్జెట్‌లో ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.8,160 కోట్లు కేటాయిస్తే ఇప్పటి వరకు రూ.3,460 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. కొన్ని శాఖలు సబ్‌ప్లాన్‌కు పైసా కూడా విడుదల చేయలేదన్నారు. ధర్మానాయక్ మాట్లాడుతూ గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఆర్ వెంకట్‌రాములు మాట్లాడుతూ అన్నిటిల్లోను గిరిజనులకు అత్యంత అన్యాయం జరుగుతున్నదన్నారు. గిరిజనాభివృద్ధికి కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు.

సీఎం గారు.. ముందు మా జీవితాలను మార్చండి..

ఆ తర్వాత దేశం గురించి ఆలోచించండి :
ఏపీ సచివాలయం ముందు తెలంగాణ ఉద్యోగుల ఆందోళన



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

దేశ రాజకీయాలను కాదు.. ముందు మా జీవితాలను మార్చండి.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మమ్మల్ని మీరు విస్మరించడం సరికాదంటూ ఏపీలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇదే డిమాండ్‌తో సోమవారం ఏపీలో పని చేస్తున్న 233 మంది తెలంగాణ నాలుగోతరగతి ఉద్యోగులు ఏపీ సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. తమను ఏపీకి కేటాయించి నాలుగేండ్లు అవుతున్నా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. భార్య, పిల్లలు, తల్లిదండ్రులను వదిలి అమరావతిలో ఉండలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమను రిలీవ్ చేయడానికి ఏపీ ప్రభుత్వం సుముఖంగా ఉన్నా, సీఎం కేసీఆర్ జోక్యం చేసుకోవడం లేదని విమర్శించారు. ముందు రాష్ట్ర సమస్యలను పరిష్కరించిన తర్వాతనే దేశ సమస్యల మీద దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎగిసిపడిన జలం

నవతెలంగాణ-పాలకుర్తి



పంట పొలాలకు, పశువులు తాగేందుకు నీటి కోసం రైతులు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం మారేడుపల్లి వద్ద ఆదివారం అర్ధరాత్రి ఎల్లంపల్లి పైప్‌లైన్ గేట్‌వాల్వ్‌ను తొలగించారు. దీంతో పెద్దఎత్తున నీరు ఎగసిపడింది. బస్వరాణి చెరువు నుంచి ఒడిశెలపేట, మారేడుపల్లి, ముంజంపల్లి నుంచి వాగులోకి వెళ్లాయి. విషయం తెలుసుకున్న ఎస్ఈ శివకుమార్, డీఈ సత్యనారాయణలు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైతులూ భారీగా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. తమ నీళ్లు తమకు ఇచ్చాకే వేరే ప్రాంతాలకు సరఫరా చేయాలని రైతులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కన్నం అంజయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొమ్ము రాంబాబు, దేవేందర్‌రెడ్డి అధికారులతో మాట్లాడారు. పంటపొలాలు ఎండుతున్నాయని, పశువులు తాగేందుకూ నీరు లేదని అన్నారు. చివరికి ఎస్ఈ స్పందించి ఎల్లంపల్లి నుంచి మేడారం వెళ్లే రెండు పైపులైన్లలో ఒక పైపులైన్ నుంచి నీటిని వదులుతామని హామీ ఇచ్చారు.


త్రిపుర ఫలితాలు

సంపాదకీయం

ఈశాన్య రాష్ట్రాల ఫలితాల్లో కాషాయ దళాలన్నీ అమితోత్సాహంతో మునిగి తేలుతున్నాయి. ముఖ్యంగా త్రిపురను గెలుచుకోవడం తనకు అంతులేని ఆనందాన్నిచ్చిందని ప్రధాని మోడీ ఉబ్బితబ్బిబ్బై పోతున్నారు... కానీ ఈ గెలుపు కోసం వారు అనుసరించిన వ్యూహాలు, అనైతిక పోకడలే ఆందోళనకరం. ఎవరు అవునన్నా కాదన్నా త్రిపురలో గెలిచిందెవరయినా ఓడింది మాత్రం ప్రజలు. ప్రజాస్వామ్య విలువలే...! తమకు ఏ మాత్రం సంస్థాగత పునాదిలేని నేలమీద, దేశంలోనే అతిచిన్న రాష్ట్రంలో అధికారం సాధించడాన్ని బీజేపీ ఎందుకింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది...? దాన్ని సాధించడానికి ఏది కోల్పోవడానికైనా ఎందుకు తెగించింది....!! ఎందుకంటే అక్కడ తమకు నిజమైన ప్రత్యామ్నాయం ఉంది. దానిని నిర్మూలించాలి. అందుకే ఇంతటి బరితెగింపు...! అందుకే ఫలితాలు వచ్చిన మరుక్షణం దాడులు, విధ్వంసాలకు పాల్పడ్డారు. ఇంకా దాడులు కొనసాగుతున్నాయి. మాణిక్‌సర్కార్ రాష్ట్రం విడిచి వెళ్లాలన్నంత వ్యాఖ్యలకు బీజేపీ నేతలు తెగబడ్డారు.

పదవులను ఎరవేసి, అంతిమంగా ప్రజలను ఏమార్చి త్రిపురను తమ వలలో వేసుకున్నారు. అందుకే ఈ గెలుపు ప్రజలిచ్చిన గెలుపని భావించలేము... ప్రజలను మరింత చైతన్యవంతులను చేయవలసిన ప్రాధాన్యతను ఈ ఘటన ముందుకు తెచ్చింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో పాల్గొనడం తప్పుకాదు. గెలవాలని కోరుకోవడమూ తప్పుకాదు. అది ప్రతి రాజకీయపార్టీ హక్కు. కానీ తమను ప్రజలు ఎందుకు గెలిపించాలో, తమకు అధికారమిస్తే ఎలా అభివృద్ధి చేస్తారో, అందుకు ఏ విధానాలను అవలంబిస్తారో, రాష్ట్రంలోని సమస్యలేమిటో, వాటి పరిష్కారానికి తమ ప్రణాళికలేమిటో కూడా ప్రజలకు వివరించాలి. తమ మానిఫెస్టోని ప్రకటించాలి. కానీ బీజేపీ త్రిపురలో మానిఫెస్టోయే లేకుండా ఎన్నికలకు దిగడం గమనార్హం...! కేవలం అధికారమే లక్ష్యంగా విలువలను వదిలేసింది. గత శాసనసభ ఎన్నికల్లో త్రిపురలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలువకపోగా అన్నిచోట్లా డిపాజిట్లు కోల్పోయి కేవలం 1.54 శాతం ఓట్లతోనే సరిపెట్టుకుంది. అలాంటిది ఇప్పుడు ఏకంగా 43 శాతం ఓట్లతో అధికారాన్ని ఎలా సాధించింది...? నిజానికి వామపక్షాల ఓటు బ్యాంక్ చెదిరిందేమీ లేదు. కేవలం 45శాతం నుండి 42.7 శాతానికి తగ్గింది. కానీ గత ఎన్నికల్లో 35శాతం ఉన్న కాంగ్రెస్ ఓటుబ్యాంకు తుడిచిపెట్టుకుపోయింది. కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలంతా ఇప్పుడు బీజేపీ అభ్యర్థులుగా పోటీకి దిగారు. అంటే తమ అధికార, ఆర్థిక బలంతో కాంగ్రెస్‌తో పాటు ఇతర వామపక్షేతర పార్టీల నేతల్ని, శ్రేణుల్ని టోకున కొనేశారని అర్థమవుతూనే ఉంది. ఇంతకంటే దివాళాకోరుతనం ఏముంటుంది...?



ఇక బీజేపీకి కలిసొచ్చిన మరో అంశం అనైతిక పొత్తులూ అవకాశవాద రాజకీయాలూ. నోరు విప్పితే దేశభక్తి, జాతీయ సమైక్యత, ఉగ్రవాద నిర్మూలన గురించీ మాట్లాడే బీజేపీ త్రిపురలో గెలుపు కోసం వాటన్నిటికీ తిలోదకాలిచ్చింది. ఇందుకోసం పలు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న వేర్పాటువాద సంస్థ ఐపీఎఫ్‌టీతో జతకట్టింది. లెఫ్ట్ వ్యతిరేక ఓటును సమీకరించడానికి ఎంతటి అనైతికతకూ, అవకాశవాదానికైనా దిగజారడానికి సిద్ధపడింది. ఒకవైపు త్రిపురలో ప్రత్యేక గిరిజన రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్న వివాదాస్పద ఐపీఎఫ్‌టీతో పొత్తు కొనసాగిస్తూనే మరోవైపు రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న బెంగాలీల ఓట్లను కోల్పోకుండా ఉండడానికి ప్రత్యేక రాష్ట్రానికి మేం మద్దతివ్వం అని చెప్పింది. బీజేపీ ద్వంద్వ నీతికి, త్రిపురలో అది అనుసరించిన అనైతిక, అవకాశవాద రాజకీయాలకు ఇంతకన్నా నిదర్శనం ఇంకా ఏం కావాలి....!?

గత 25 ఏండ్లుగా కేంద్ర ప్రభుత్వాల ఆదరణ లేకపోయినా, అభివృద్ధికి అవసరమైన కనీస నిధులను కూడా ఇవ్వకుండా అవి కక్షగట్టినా, వామపక్ష ప్రభుత్వం తమ నీతివంతమైన పాలనతో, ప్రజానుకూల విధానాలతో, అకుంఠితమైన త్యాగాలతో త్రిపురను తీర్చిదిద్దింది. ప్రత్యామ్నాయ విధానాలతో, త్రిపురను తీర్చిదిద్దింది. దేశానికే ప్రత్యామ్నాయ విధానాలతో కూడిన ఒక రాజకీయ విధానాన్ని అందించాయి. దీనిని రూపుమాపేందుకు గత మూడేండ్లుగా బీజేపీ సంఘ్‌పరివార్‌లు తమ కుయుక్తులు సాగిస్తూనే ఉన్నాయి. తెరవెనుక ఆరెఎస్సెస్ తెరముందు బీజేపీలు ఈ వామపక్ష కోటను బద్దలు కొట్టడానికి పన్నాగాలు పన్నుతూనే ఉన్నాయి. గడిచిన మూడేండ్లుగా పోలింగ్ కేంద్రాల స్థాయిలో ఓటరు జాబితాలోని ప్రతి 60 మందికి ఒక పన్నా ప్రముఖ్‌ను నియమించి క్షేత్రస్థాయిలో మత ప్రాతిపదికన ఓటర్లను కేంద్ర మంత్రాంగమంతా పదే పదే త్రిపురలో పర్యటిస్తూ తమ అవకాశవాద రాజకీయాలకు పాదులువేస్తూ వచ్చారు. ఈ మూడేండ్లలో 52మంది మంత్రులు త్రిపురలోనే తిరు గాడటం గమనార్హం. ఇక ఈ ఎన్నికల్లో వ్యూహకర్తల నుంచి కార్యకర్తల దాకా దేశం మొత్తం నుంచి తమ శక్తి యుక్తులన్నిటినీ సమీకరించి త్రిపురలో మోహరించారు. ఎన్నికల సందర్భంగా 25మంది కేంద్రమంత్రులు, వందమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు త్రిపురలో తిష్టవేశారు. ప్రధాని మోడీ నుండి అధ్యక్షుడు అమిత్‌షా వరకూ పార్టీ, ప్రభుత్వ నేతలందరూ ఇంత చిన్న రాష్ట్రంలో అన్ని సభలు నిర్వహించడం అనూహ్యం. మితిమీరిన అధికార దుర్వినియోగం, అంతులేని ఆర్థిక, అంగబలాల్ని ఉపయోగించి ఇతర పార్టీల వారినీ తమలో కలిపేసి, వారికి పదవులను ఎరవేసి, అంతిమంగా ప్రజలను ఏమార్చి త్రిపురను తమ వలలో వేసుకున్నారు. అందుకే ఈ గెలుపు ప్రజలిచ్చిన గెలుపని భావించలేము... ప్రజలను మరింత చైతన్యవంతులను చేయవలసిన ప్రాధాన్యతను ఈ ఘటన ముందుకు తెచ్చింది.

తక్షణ - వ్యూహాత్మక అవసరాలను అనుసంధానం చేసే

సీపీఐ(ఎం) రాజకీయ ఎత్తుగడల విధానం



బి.వి రాఘవులు

హైదరాబాద్‌లో జరుగనున్న సీపీఐ(ఎం) 22వ కాంగ్రెస్ చర్చ కోసం ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని కేంద్రకమిటీ ఆమోదించి విడుదల చేసింది. వచ్చే మహాసభ వరకు పార్టీకి మార్గదర్శకంగా వుండేది కాబట్టి సహజంగానే మిత్రులకు, ప్రత్యర్థులకు తీర్మానం మార్గనిర్దేశంపై ఆసక్తి వుంటుంది. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా తీర్మానంపై మీడియాలో రకరకాల వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. అయితే వీటిలో కమ్యూనిస్టు పార్టీకి రాజకీయ తీర్మానం

వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలహీనపడుతుండటం మూలంగా రాజకీయ ఎత్తుగడల విధానంలో భాగమైన తక్షణ ఎన్నికల కర్తవ్యాలను నెరవేర్చే శక్తి కూడా వామపక్షాలకు తగ్గిపోయే పరిస్థితి వచ్చింది. సరళీకరణ విధానాలపై, మతోన్మాదంపై నిరంకుశత్వం, సామ్రాజ్యవాదంపై పోరాడే పోరాటశక్తులకు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. తక్షణం ఈ పరిస్థితిని అధిగమించకపోతే పార్టీకే కాక దేశానికి కూడా నష్టం జరుగుతుంది.

అవసరం ఏమిటో తెలియక గానీ, తెలిసినా బుద్ధిపూర్వకంగా వక్రీకరించాలని గానీ, లేక తమ రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా లేదన్న దుగ్ధతో గానీ చేసేవి ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాఖ్యానాల మంచిచెడులను అర్థం చేసుకోవాలంటే రెండు విషయాలను గమనంలో ఉంచుకోవాలి. ఒకటి రాజకీయ విధానం లక్ష్యం, రెండు : మార్క్సిస్టు పార్టీ గతంలో అనుసరించిన రాజకీయ ఎత్తుగడల విధానాన్ని సమీక్షించి 21వ పార్టీ మహాసభ పొందుపరిచిన నిర్ధారణలు. ఈ రెండు అంశాల గురించి ముందుగా క్లుప్తంగా ప్రస్తావిస్తాను.

రాజకీయ ఎత్తుగడల విధాన లక్ష్యం

వ్యూహాత్మక కర్తవ్యం వైపు పురోగమించేందుకు అనుసరించే తక్షణ ఎత్తుగడలనే రాజకీయ ఎత్తుగడల విధానం అంటాము. అంటే రాజకీయ ఎత్తుగడల విధానం ఎన్నికలు తదితర తక్షణ అవసరాలను తీర్చడంతో పాటు, పార్టీ స్వతంత్ర శక్తిని, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చడానికి తోడ్పడాలి. తక్షణ అవసరాలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి రెండవ అంశాన్ని అశ్రద్ధ చేస్తే మొదటి అంశాన్ని సాధించే శక్తి కూడా పార్టీకి తగ్గిపోతుంది.

రాజకీయ ఎత్తుగడల విధానాల అనుభవాలు

విశాఖలో జరిగిన 21వ మహాసభ గత 25 సంవత్సరాలలో వివిధ మహాసభలలో రూపొందించి అమలుచేసిన రాజకీయ ఎత్తుగడల విధానాన్ని సమీక్షించింది. తక్షణ పరిస్థితులలో జోక్యం చేసుకునేందుకు, తక్షణ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ఎత్తుగడలను, మానోవర్స్‌ను రూపొందించుకునేందుకు ఉపయోగపడినా, రాజకీయ ఎత్తుగడల విధానంలోని లోపాలు పార్టీ స్వతంత్ర శక్తి పెరగక పోవడానికి, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో పురోగమనం లేకపోవడానికి కారణమయ్యాయని నిర్ధారించింది. అన్ని మహాసభల రాజకీయ ఎత్తుగడల విధానాలు పార్టీ స్వతంత్రశక్తిని పెంచుకోవాలని నిర్దేశిస్తున్నప్పటికీ, ఈ విషయంలో మనం పురోగమనం సాధించలేకపోయాం. ఓటింగ్ రూపంలో అయితే బలహీనపడ్డాం. అసమానాభివృద్ధి కొనసాగుతూనే ఉంది.

పార్టీ నిర్ణయించుకున్న తక్షణ రాజకీయ ఎన్నికల కర్తవ్యాన్ని సాధించే పనిలో మునిగిపోయి, రాజకీయ ఎత్తుగడల విధానంలోని మిగిలిన కీలక కర్తవ్యాలను తగినంతగా పట్టించుకోలేకపోయాం. సరళీకరణ విధానాల మూలంగా నష్టపోతున్న వివిధ తరగతుల ప్రజానీకాన్ని నిరంతర పోరాటాలలోకి సమీకరించి, ఐక్య ఉద్యమాలను బలంగా నిర్మించలేకపోయాం. మతోన్మాదంపై క్షేత్రస్థాయి నుండి ఒక సమగ్ర రూపంలో పోరాటం చేయలేకపోయాం.

ఈ లోపాలు పునరావృతం కాకుండా రాజకీయ ఎత్తుగడల విధానంలో ఉండాల్సిన కీలక అంశాల గురించి విశాఖ రాజకీయ ఎత్తుగడల సమీక్ష పేర్కొన్న విషయాలను క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

సరైన రాజకీయ ఎత్తుగడల విధానంలో కీలక అంశాలు ఏమిటి?


1) సరళీకరణ విధానాలపై పోరాటం

రాజకీయ ఎత్తుగడల విధానం సరళీకరణ విధానాల పట్ల మెతకగా వ్యవహరించేందుకు గాని, ప్రాధాన్యతను తగ్గించేందుకు గాని అవకాశమిచ్చేదిగా ఉండరాదు. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు తోడ్పడేదిగా ఉండాలి. సరళీకరణ విధానాల మూలంగా ప్రజలపై మోపుతున్న పెనుభారాలకు వ్యతిరేకంగా, కాలరాస్తున్న హక్కులను రక్షించుకోవడానికి, దిగజారుతున్న జీవన ప్రమాణాలను నిలబెట్టుకోవడానికి, పోరాటాలను ముమ్మరంగా నిర్వహించటం ద్వారా ప్రజలను ఐక్యం చేయగలగాలి. అప్పుడే ప్రజల్లో పెరిగిన అభద్రతను, చీలికలను, అనైక్యతను అధిగమించి ఆత్మవిశ్వాసాన్ని పెంచగలం. అన్నిరకాల విభజనలు, అస్తిత్వాలకు అతీతంగా వర్గ ఐక్యత సాధించగలం.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయకుండా వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమీకరణ సాధ్యం కాదు. పార్టీ స్వతంత్ర శక్తి కూడా పెరగదు. వాస్తవంలో ప్రజా ఉద్యమాలు బలహీనపడతాయి.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయకపోతే ఆ విధానాల వల్ల పెరుగుతున్న అసంతృప్తిని మెజారిటీ, మైనారిటీ మతోన్మాద శక్తులు వినియోగించుకుని చీలికలు సృష్టించి పాలకవర్గాల కొమ్ముకాస్తాయి. ఎక్కడ సరళీకరణ విధానాలపై జరగాల్సిన పోరాటాన్ని అశ్రద్ధ చేస్తే అక్కడ అభివృద్ధి నిరోధకశక్తులు బలం పుంజుకుంటాయనేది అంతర్జాతీయ అనుభవం, మన అనుభవం కూడా. మన దేశంలో సరళీకరణ విధానాల కాలంలో మతోన్మాదం కూడా పెరుగుతూ వచ్చింది. హిందూత్వ మతోన్మాద ప్రతినిధి అయిన బీజేపీ కేంద్రంలో అధికారంలోకి కూడా వచ్చింది.

దేశంలో బూర్జువా, భూస్వామ్య పార్టీలన్నీ దాదాపు సరళీకరణ విధానాలను ఆమోదించి అనుసరిస్తున్నాయి. కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు సరళీకరణ విధానాలను అనుసరించాయి. బీజేపీ, కాంగ్రెస్



పార్టీలు బడాబూర్జువా పార్టీలుగా వాటిని ఛాంపియన్ చేస్తున్నాయి. ప్రాంతీయ బూర్జువా పార్టీలు సైతం సరళీకరణ విధానాలకు సానుకూలంగా వున్నాయి. ఈ పార్టీలు అనుసరించే సరళీకరణ విధానాల పట్ల మతోన్మాదాన్ని వ్యతిరేకించడం పేరుతో మెతకగా వ్యవహరించినా, అది మతోన్మాదులను దెబ్బతీయడానికి తోడ్పడకపోగా, బలపడటానికి అవకాశం ఇచ్చినట్లవుతుంది.

గతంలో ఎక్కువ సందర్భాలలో మతోన్మాదంపై పోరాటం పేరుతో, ఎన్నికల ఎత్తుగడల పేరుతో సరళీకరణ విధానాల ప్రమాదానికి మనం తక్కువ ప్రాధాన్యతనిచ్చాం. సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రధానంగా పోరాటం చేయాల్సిన కర్తవ్యాన్ని, మతోన్మాదంపై పోరాటానికి లోబర్చుతూ వచ్చాం. అందుకే మతోన్మాద వ్యతిరేక పోరాటంలో సరళీకరణ విధాన వ్యతిరేక పోరాటానికున్న ప్రాధాన్యతను, ఎన్నికల ఎత్తుగడలకు లోబర్చకుండా, ఎటువంటి మెతకదనానికి ఆస్కారం లేకుండా ముసాయిదా రాజకీయ తీర్మానం ప్రతిపాదించింది.

2) మతోన్మాదంపై పోరాటం

బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తులకు వ్యతిరేకంగా చేయాల్సిన పోరాటాన్ని ఎన్నికల ఎత్తుగడలకు పరిమితం చేయకుండా ఒక సమగ్రమైన నిరంతర ప్రయత్నంగా సాగించాలి. ఎన్నికల ఎత్తుగడలు, మానోవర్స్ ద్వారా మతోన్మాద శక్తులను తాత్కాలికంగా అధికారానికి దూరంగా పెట్టగల్గినా, దాన్ని బలహీనం చేయడానికి సరిపోలేదని అనుభవం చెబుతున్నది. బీజేపీ మతోన్మాద శక్తులను ఓడించడానికి, బలహీనపర్చడానికి పార్టీ రాజకీయ ఎత్తుగడల విధానం లక్ష్యంగా కృషి చేస్తున్నా, ఈ శక్తులు బలం పుంజుకోవడాన్ని నిరోధించలేక పోయింది. బీజేపీ కొన్నిసార్లు తాత్కాలికంగా ఓడిపోయినా తిరిగి అంతకన్నా ఎక్కువగా బలపడి ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చింది. మొదట 13 రోజులున్నా తర్వాత 13 నెలలు, ఆ తర్వాత పూర్తికాలం సంకీర్ణ ప్రభుత్వాలను నడిపింది. ఇప్పుడు ఏకంగా సంపూర్ణ మెజారిటీని సాధించి కేంద్రంలో అధికారంపై పట్టు పెంచుకుంది. హిందూత్వ మతోన్మాదాన్ని ఓడించడానికి, బలహీనం చేయడానికి ఎన్నికలలో ఓడించాలనే ప్రయత్నాలు సరిపోవనీ, ఒక సమగ్రమైన ప్రయత్నం కావాలని ఈ అనుభవం స్పష్టం చేస్తున్నది.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు అవినాభావ సంబంధం ఉంది. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని అశ్రద్ధ చేసే ఏ రాజకీయ ఎత్తుగడలైనా మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని కూడా బలహీనం చేస్తాయి. సరళీకరణ విధానాల దుష్ప్రభావంపై పోరాటాలను, మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మిళితం చేసి సాగించడం ద్వారానే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమిపై జరిగే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళగలం.

వామపక్ష ప్రజాతంత్రశక్తుల బలం, క్రియాశీలతపై కూడా మతోన్మాదంపై పోరాట ఫలితం ఆధారపడి వుంటుంది. ఎందుకంటే ఈ శక్తులే మతోన్మాదంపై నికరంగా పోరాడేవి. మన రాజకీయ ఎత్తుగడలు పార్టీ స్వతంత్ర శక్తిని, వామపక్ష శక్తుల బలాన్ని పెంచేందుకు తోడ్పడకపోతే, తాత్కాలికంగా ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు ఎదురుదెబ్బ తగిలినా, మతోన్మాదాన్ని శాశ్వతంగా బలహీనం చేయడంలో వెనకబడిపోతాము.

సరళీకరణ విధానంపై పోరాటాన్ని గాని, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణాన్ని గాని నిర్లక్ష్యం చేసే ఎత్తుగడలు మతోన్మాదంపై పోరాటాన్ని కూడా బలహీనపరుస్తాయి. కుల వ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థల్లో హిందూత్వ సిద్ధాంతం పాతుకుపోయి ఉంది. దోపిడీ, అణచివేతలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుంది. హిందూత్వం పేరుతో, సాంస్కృతిక జాతీయవాదం పేరుతో తిరోగమన, సంకుచిత, దురభిమాన భావజాలాన్ని ప్రచారం చేస్తోంది. కులవ్యవస్థ, పితృస్వామిక ధోరణులకు వ్యతిరేకంగా జరిగే సామాజిక పోరాటాలు, హేతువాద ఉద్యమాలు హిందూత్వ మతోన్మాద వ్యతిరేక పోరాటంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం.

హిందూత్వ మతోన్మాదులు మొత్తం సమాజంలోని అన్ని పార్శ్వాల్లోకి ప్రజాజీవన రంగాలన్నింటిలోకి రకరకాల మార్గాలు, కార్యకలాపాలు, సంస్థల ద్వారా చొచ్చుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. సాంస్కృతిక, సేవా, విద్యారంగాలను వాడుకుంటున్నారు. మత విద్వేషాలను, చీలికలను రెచ్చగొడుతున్నారు. మతతత్వాన్ని ఒక కామన్‌సెన్స్‌గా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందుకు పౌర సమాజంలోని అన్ని రంగాలలో మనం జోక్యం చేసుకోకుండా మతోన్మాదాన్ని బలహీనం చేయడం సాధ్యం కాదు. ఈ పోరాటాలన్నింటినీ మేళవించినప్పుడే మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా మద్దతును కూడగట్టగలము.

3) వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం

రాజకీయ ఎత్తుగడల విధానం వర్గ శక్తుల బలాబలాల్లో సానుకూల మార్పు సాధించటానికి తోడ్పడాలి. పార్టీ స్వతంత్రశక్తి పెరగడం, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సంఘటన నిర్మాణం పురోగమించడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది. కానీ పార్టీ గతంలో అనుసరించిన రాజకీయ ఎత్తుగడల విధానంలోని లోపాల మూలంగా ఈ కర్తవ్యాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం ఒక ప్రచార నినాదంగా మార్చివేయబడిందని, తక్షణం ప్రయత్నం చేయాల్సిన కర్తవ్యంగా పరిగణించకుండా వదిలివేయబడిందని 21వ మహాసభ సమీక్ష వెల్లడించింది.

వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలహీనపడుతుండటం మూలంగా రాజకీయ ఎత్తుగడల విధానంలో భాగమైన తక్షణ ఎన్నికల కర్తవ్యాలను నెరవేర్చే శక్తి కూడా వామపక్షాలకు తగ్గిపోయే పరిస్థితి వచ్చింది. సరళీకరణ విధానాలపై, మతోన్మాదంపై నిరంకుశత్వం, సామ్రాజ్యవాదంపై పోరాడే పోరాటశక్తులకు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. తక్షణం ఈ పరిస్థితిని అధిగమించకపోతే పార్టీకే కాక దేశానికి కూడా నష్టం జరుగుతుంది. అందుకే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం అనే కర్తవ్యాన్ని తక్షణ కర్తవ్యాల్లో ముఖ్యమైనదిగా పునరుద్ధరించాలని సమీక్ష నిర్దేశించింది. ఇటువంటి కృషికి ఆటంకమయ్యే బలహీనతలను రాజకీయ ఎత్తుగడల విధానంలో పునరావృతం కాకూడదని చెప్పింది.

అన్ని బూర్జువా పార్టీలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే బూర్జువా వర్గాల పరిపాలనకు ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని ప్రజల ముందుంచగలము.

పైన వివరించిన అనుభవాలను, గుణపాఠాలను దృష్టిలో ఉంచుకుని 21వ మహాసభ సరైన రాజకీయ విధానాన్ని రూపొందించినప్పటికీ పశ్చిమబెంగాల్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహనకు వచ్చింది. దానివలన పార్టీ ప్రయోజనం పొందకపోగా కాంగ్రెస్ లాభపడింది. కాంగ్రెస్‌తో అవగాహనకు రావడం పార్టీ అవగాహనకు అనుగుణంగా లేదని కేంద్ర కమిటీ నిర్ధారించింది.

(తరువాయి రేపటి సంచికలో)

త్రిపుర అనుభవం నేర్పుతున్న పాఠాలు



వి. శ్రీనివాసరావు

వామపక్షాలు బలహీనపడేకొద్దీ బీజేపీ మతోన్మాద వ్యతిరేక పోరాటమూ బలహీనపడుతుంది. అందువల్ల భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల్ని కూడగట్టడం ద్వారానే బీజేపీ మతోన్మాదాన్ని, దాని ప్రమాదకర విస్తరణను ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. ఈ లోగా ఏవైనా కొత్త లౌకిక, ప్రజాతంత్ర శక్తులు పుట్టుకొచ్చినా అవి వామపక్షాలతో కలవాలన్నా వామపక్షాల బలం పెరిగితేనే అలాంటి నూతన శక్తుల్ని సైతం రాబట్టుకోడానికి, ప్రభావితం చేయడానికి అవకాశం ఉంటుంది.

మార్చి 3వ తేదీ జాతీయస్థాయిలో రెండు ముఖ్యమైన పరిణామాలు జరిగాయి. ఒకటి: త్రిపురలో 25 ఏండ్ల వామపక్ష పాలనకు గండి పడటం. అక్కడ బీజేపీ అధికారంలోకి రావడం. రెండు: జాతీయస్థాయిలో కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ పిలుపు. ఇవి రెండూ ఒకదానికొకటి సంబంధం ఉన్నవే. మీడియాలో వీటిపై విస్తృతంగా చర్చలు సాగుతున్నాయి.

సీపీఐ(ఎం) ఎందుకు ఓడిపోయింది? ముందుగా ఊహించిందేనా? బీజేపీ ఎలా బలపడింది? ఒక్క శాతం ఓట్ల నుండి 43 శాతానికి ఒక్కసారిగా ఎలా ఎదిగింది? ఇత్యాది ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సీపీఐ(ఎం) ఓటమికి కారణాలను త్రిపుర రాష్ట్ర కమిటీ లోతుగా పరిశీలించాకే ఒక నిర్ధారణకు రావడం సాధ్యమవుతుంది. 25 ఏండ్లు అధికారంలో ఉన్నాక కొత్తతరంలో కొంత అసంతృప్తి వచ్చింది. ఈ కాలంలో త్రిపుర వామపక్ష ప్రభుత్వం గిరిజనుల్లో పెద్ద ఎత్తున విద్యావ్యాప్తి కార్యక్రమం చేపట్టింది. ఉన్నత విద్యకు ఎదిగిన గిరిజన యువత సంఖ్య పెరిగింది. కాని ఉపాధి అవకాశాలు అంతగా పెరగలేదు. విద్యావంతులందరికీ ఉద్యోగ కల్పన ఇంత చిన్న రాష్ట్రానికి అందునా ఈ వ్యవస్థ పరిధిలో కేంద్ర సహకారం లేకుండా అంత సులభం కాదు. పైగా కేంద్రంలోని మోడీ సర్కార్ సహాయ నిరాకరణ చేసింది. సర్వశిక్ష అభియాన్ కింద పదివేల మంది కాంట్రాక్టు టీచర్లు రెగ్యులర్ కాకుండా ఉద్యోగాలు కోల్పోయారు. ఉపాధిహామీపథకం నిధులపై కోత విధించింది. రాష్ట్రానికి రావాల్సిన నిధుల్ని తొక్కి పెట్టింది. ఫలితంగా యువతరంలో వచ్చిన అసంతృప్తిని ఐపీటీఎఫ్ అనే తీవ్రవాద సంస్థ రెచ్చగొట్టి రాజకీయంగా సొమ్ము చేసుకుంది. ఇలాంటి జాతి వ్యతిరేక పార్టీతో పొత్తు పెట్టుకొని బీజేపీ లాభపడింది. సరిహద్దు రాష్ట్రంలో తీవ్రవాద పార్టీలతో పొత్తు పెట్టుకొన్న బీజేపీ దేశభక్తి ఎలాంటిదో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. అయినా చాలా వరకు సీపీఐ(ఎం) తన బలాన్ని నిలుపు కుంది. ఆదర్శవంతమైన ముఖ్య మంత్రిగా మాణిక్‌సర్కార్‌కు పేరుంది. గత ఎన్నికలతో పోల్చుకుంటే 5శాతం ఓట్లు కోల్పోయింది. బీజేపీకి వచ్చిన 50శాతం ఓట్లలో దాని అసలు బలం 2శాతం పోను 34 శాతం కాంగ్రెస్ ఓట్లు బదలాయింపు జరిగింది. 9 శాతం ఇతరుల నుండి వచ్చాయి. కొత్త ఓటర్లలో సీపీఐ(ఎం)కు తక్కువే పోలయ్యాయి. ఈ తరానికి వామపక్ష పాలన తప్ప ఇంకే పార్టీ గురించి ప్రత్యక్ష అనుభవం లేదు. మార్పు కావాలన్న వారి వాంఛ వామపక్ష వ్యతిరేకతకు కారణమై ఉంటుంది.

త్రిపురలో బీజేపీ ఎలా వేళ్లూనుకోగలిగిందన్నది ప్రశ్న. వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షంగా రెండేండ్ల క్రితం వరకు కాంగ్రెసు ఉండేది. ఆ స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. మొత్తం కాంగ్రెస్ క్యాంపంతా దాదాపు బీజేపీగా రూపాంతరం చెందింది. దానికి కారణం కాంగ్రెస్ కన్నా బీజేపీ అయితేనే సీపీఐ(ఎం)ను ఎదుర్కోగలదన్న భావన. జాతీయ స్థాయిలో సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు సర్దుబాటు చేసుకుంటాయన్న ప్రచారం, దానికి తావిచ్చిన చర్చల వల్ల త్రిపురలో సీపీఐ(ఎం)ను ఎదుర్కోవడం కాంగ్రెస్‌కు సాధ్యం కాదన్న భావనకు వారు రావడానికి తోడ్పడింది. కాంగ్రెస్ పట్ల సీపీఐ(ఎం), సీపీఐ(ఎం) పట్ల కాంగ్రెస్ మెతక వైఖరి కలిగి ఉన్నాయన్న అభిప్రాయం బెంగాల్ ఎన్నికల తర్వాత బలపడింది. బెంగాల్‌లో సైతం బీజేపీ బలపడటానికి ఇదొక కారణం. ఈ రకంగా బీజేపీ విస్తరణకు కాంగ్రెస్ ప్రత్యక్షంగా కారణం కాగా, మీడియాలో విస్తృతంగా జరుగుతున్న చర్చ పరోక్షంగా తోడ్పడింది. కాంగ్రెస్‌ను ఎదుర్కోకుండా బీజేపీ విస్తరణను ఎదుర్కోవడం సాధ్యం కాదని ఈ అనుభవం తెలియచేస్తున్నది.

కాంగ్రెస్ ఆర్థిక విధానాల వల్లే బీజేపీ బలపడిందని విశాఖలో జరిగిన సీపీఐ(ఎం) మహాసభ నిర్ధారణకొచ్చింది. అది సరైందని అనుభవం తెలియ చేస్తున్నది. బీజేపీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయడం వల్ల బీజేపీ బలపడిందా? అన్న అనుమానం కొందరిలో ఉంది. సీపీఐ(ఎం) ఎన్నడూ బీజేపీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయలేదు. దాన్ని ఎలా ఎదుర్కోవాలన్న దానిపైనే చర్చ. బీజేపీ బలం దాని మతోన్మాదంలో ఉండగా, బలహీనత ఆర్థిక విధానాల్లో ఉంది. ఆర్థిక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించి రాజకీయంగా బలపడటానికి మతోన్మాదాన్ని ఒక ఆయుధంగా బీజేపీ వాడుకుంటోంది. మతోన్మాదాన్ని దెబ్బతీయాలంటే దాని బలహీనతపై దెబ్బకొట్టాలి. అవి దాని ఆర్థిక విధానాలు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు, బీజేపీకీ తేడా లేదు. కాంగ్రెస్‌తో అవగాహనకు రావడం ద్వారా బీజేపీని ఎదుర్కోలేం. పైగా అలాంటి అవగాహన బీజేపీ మరింతగా బలపడటానికే దోహదపడుతుందని త్రిపుర, బెంగాల్ అనుభవాలు తెలియచేస్తున్నాయి.


రెండో అంశం, కేసీఆర్ చెప్తున్నట్టు కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఏర్పాటు. ఆయన కొన్ని అంశాలను సరిగ్గానే లేవనెత్తారు. కేంద్రంలో గుణాత్మకంగా భిన్నమైన ప్రభుత్వం కావాలి. కేంద్ర పెత్తందారీ పోకడలకు వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కుల కోసం పోరాడాలి. ఈ రెండు అంశాలూ సరైనవే. అయితే గుణాత్మకంగా భిన్నమైన ప్రభుత్వం కేవలం పార్టీలు మారినంత మాత్రాన రాదు. ఆ పార్టీలు అనుసరించే విధానాలు ముఖ్యం. రాష్ట్రాలకు రావాల్సిన వనరులు తగ్గిపోవడం, అధికార నిరంకుశత్వంతో కక్షకట్టి వ్యవహరించడం వల్ల ఆంధ్ర, తెలంగాణా వంటి అనేక రాష్ట్రాలు నష్టపోతున్నాయి. ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసింది. తమ హక్కుల కోసం ఒంటరిగా పోరాడితే సాధ్యం కాదని గుర్తించడం వరకు బాగానే ఉంది. అందరూ ఉమ్మడిగా కేంద్రంపై పోరాడాలన్న భావం కూడా సరైందే. అయితే ఈవిషయంలో నిలకడ ఉండాలి. కాని టీఆర్ఎస్, టీడీపీ వంటి పార్టీలు ఊగిసలాడుతున్నాయి. చంద్రబాబు ఇప్పటికీ కేంద్రంతో దోబూచులాడుతూనే ఉన్నారు. బీహార్‌లో నితీశ్ ప్రజాతీర్పుకు ద్రోహం చేసి ఏకంగా బీజేపీకి లొంగిపోయారు. ఇలాంటి వారు తక్షణ రాజకీయ స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజాప్రయోజనాలను తాకట్టు పెడుతుంటారు. వారి దగ్గర ప్రజానుకూల ప్రత్యామ్నాయం లేదు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ వ్యవసాయ సంక్షోభం పెరిగి అసంతృప్తి పెరుగుతోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వాటి పరిష్కారానికి కృషి చేయడానికి బదులు బాధ్యత నుండి తప్పుకొని ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అవకాశాలను ఉపయోగించు కుంటున్నారు. కేంద్రంపై పోరాడి నిధులు రాబడితేనే సరిపోదు. రాష్ట్రాలకు, ప్రజలకు నష్టం చేసే దాని విధానాలు కూడా మార్చాలి. అది జరగాలంటే ముందు తమ విధానాలు మార్చుకోవాలి. టీడీపీ టీఆర్ఎస్‌ల ధోరణి ఆ దిశగా లేదు. అది జరక్కుండా వారనుకునే మూడో ఫ్రంట్ సఫలం కాదు.

1993–2004 మధ్య కూడా ఇలాంటి అనుభవమే ఉంది. నాడు బీజేపీని నిరోధించడానికి మూడో ఫ్రంట్ నినాదం ముందుకు వచ్చింది. ఈ కాలంలో బీజేపీని నిరోధించాలనుకునే కొద్దీ అది ఇంకా బలపడుతూనే వచ్చింది. ప్రజలు అనుభవంలో చూశాకే 2004లో ఓడించారు. 2004లో యుపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు బయట నుండి మద్దతునిచ్చాయి. కాని ఆ తర్వాత నుండి వామపక్షాల బలం తగ్గిపోతూ వచ్చింది. ప్రజలు వామపక్షాలను ఇతర పార్టీల నుండి వేరుగా చూడకపోవడమే ఇందుకు కారణం. వామపక్షాలు స్వతంత్ర గుర్తింపును, దాని పునాదిని కాపాడుకుంటేనే బీజేపీని ఎదుర్కోగలవు. వామపక్షాలు బలహీనపడేకొద్దీ బీజేపీని ఎదుర్కోవడమే అసాధ్యంగా మారుతుంది. స్వతంత్ర బలం పెరక్కుండా ఇతర శక్తులను కలుపుకోవడం కూడా కష్టమవుతుందని 2014 ఎన్నికల అనుభవం కూడా రుజువు చేస్తోంది.

మొత్తం మీద తాజా పరిణామాల్లో మూడు అంశాలు ముందుకొచ్చాయి. ఒకటి, బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ఒక్కటై ఓడించడం, రెండోది, కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్‌ను తెరమీదకి తేవడం. మూడు, ఇలాంటి ఫ్రంట్‌లలో సీపీఐ(ఎం), వామపక్షాలు చేరే అంశం గురించి. మొదటిది రాజకీయంగానే నష్టకరమైనది. రెండోది సాధ్యాసాధ్యాలకు సంబంధించింది. అనుభవంలో విధానాల ప్రత్యామ్నాయంలో స్థిరత్వం రాకుండా సాధ్యం కాదని నిరూపించబడింది. మూడోది, ఈ రెండింటికి భిన్నంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి కూటమిని నిర్మించడం. ఆలస్యమైనా దేశానికి మేలుచేసే ప్రత్యామ్నాయవిది.

మూడోఫ్రంట్ లాంటి నినాదాలు విఫలమైన తర్వాతే గత మహాసభలో వామపక్షాలు స్వతంత్రంగా ఎదగాలన్న విధానం వైపు సీపీఐ(ఎం) మొగ్గింది. ప్రత్యామ్నాయంగా వామపక్ష, ప్రజాతంత్ర కూటమిని ప్రతిపాదించింది. దాన్ని నిర్మించాలంటే వివిధ వర్గాల, తరగతుల ప్రజల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలి. తద్వారా ప్రజానుకూల ప్రత్యామ్నాయం నిర్మాణమవుతుంది. అలాంటి ఫ్రంట్ మాత్రమే ఎన్నికలను సైతం ఎదుర్కోగలుగుతుంది. అంతేకానీ, కేవలం అవకాశవాద ఎన్నికల పొత్తులతో బీజేపీని ఓడించడం సాధ్యమూ కాదు. ఓడించినా ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. పైగా అవకాశవాద పార్టీలతో కలసిన అపవాదు వామపక్షాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం లేకుండా పోతుంది. తిరిగి విశాఖ మహాసభ రూపొందించిన వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం అనే అంశాన్ని పక్కకు పెట్టాల్సి వస్తుంది. అది ఏ విధంగానూ కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి తోడ్పడదు. పైగా మరింతగా బలహీనపడటానికే దోహదపడుతుంది. వామపక్షాలు బలహీనపడేకొద్దీ బీజేపీ మతోన్మాద వ్యతిరేక పోరాటమూ బలహీనపడుతుంది. అందువల్ల భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల్ని కూడగట్టడం ద్వారానే బీజేపీ మతోన్మాదాన్ని, దాని ప్రమాదకర విస్తరణను ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. ఈలోగా ఏవైనా కొత్త లౌకిక, ప్రజాతంత్ర శక్తులు పుట్టుకొచ్చినా అవి వామపక్షాలతో కలవాలన్నా వామపక్షాల బలం పెరిగితేనే అలాంటి నూతన శక్తుల్ని సైతం రాబట్టుకోడానికి, ప్రభావితం చేయడానికి అవకాశం ఉంటుంది. ■





మహిళా సాధికారత... సమానత్వం...వివక్ష లేని సమాజం వినడానికి ఎంత బాగుంటాయో. అంతర్జాతీయ మహిళా దినోత్సం నాడు ప్రతి వారి నోటి వెంట వచ్చే ఊత పదాలు ఇవి. ఆ తర్వాత... వాటి ఊసే ఉండదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్నా పోరాటం తప్పడం లేదు. ఓటు కోసం పోరాటం, కడుపు నిండా తిండి కోసం పోరాటం... చివరకు జీవించే హక్కు కోసం పోరాటం. ఇలా మహిళ జీవితమే ఓ పోరాటం. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న చట్టాలు కై. ఆ మహిళకు అండగా నిలవడం లేదు. అందుకే ప్రతి రోజు ఓ గండంగా బతుకు వెళ్లదీస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు స్కీమ్ వర్కర్లు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏం చెబుతున్నారో చదవండీ...

తప్పని బతుకు పోరాటం

సంబరాలు జరపడం కాదు



అధికారులు మహిళా దినోత్సవం వచ్చినప్పుడు గొప్పగా సంబరాలు జరుపుతున్నారు. ఆ తర్వాత మా సమస్య గురించే మర్చిపోతారు. నేను మా గ్రామంలో పొదుపు సంఘాలపై పని చేస్తాను. పది లక్షల రుణాలు ఇస్తున్నాం, పావలా వడ్డీ అంటూ ప్రచారాలు చేస్తున్నారు. మహిళలను అన్ని రకాలుగా ముందుకు తీసుకుపోతాం అంటారు. ఇవన్నీ కేవలం మాటలకే పరిమితం. మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదు. ఇప్పటి వరకు ఒక్క సంఘానికి కూడా పావలా వడ్డీకి రుణాలు ఇవ్వలేదు. ఇక కాంగ్రెస్ పాలనలో వచ్చిన అభయహస్తం పరిస్థితి ఘోరంగా ఉంది. రెన్యువల్ చేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ చేస్తున్నాం అని కేవలం చెప్పుకుంటున్నారు. కాని ఇప్పటి వరకు ఏమీ చేయలేదు. మహిళా దినోత్సవాన్ని మీటింగుల రూపంలో కాదు నిజంగా మహిళా అభివృద్ధికి ఉపయోగపడాలి. నిజంగా మహిళలపై అంత అభిమానమే ఉంటే వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి. అభయ హస్తం స్కీమ్‌ను మహిళలందరికీ వర్తింపజేయాలి. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా మా హక్కుల కోసం ప్రభుత్వాన్ని పొదుపు సంఘాల అధ్వర్యంలో నిలదీద్దాం అనుకుంటున్నాం.

- నవీన, దుబ్బాక మండలం, సిద్దిపేట జిల్లా
ఐకేపి, విలేజ్ ఆర్గనైజ్ అసిస్టెంట్

మనో ధైర్యాన్ని నింపాలి



ఈ మహిళా దినోత్సవం అనేది కేవలం పెద్ద పెద్ద నగరాలు, పట్టణాలకే పరిమితమైపోయింది. అది కూడా సంబరాలుగా జరుపుకుంటారు. కానీ నిజమైన మహిళా దినోత్సం అంటే గ్రామ స్థాయి వరకు మహిళల్లో చైతన్యం తీసుకురావడం. కాని ఇప్పటి వరకు పల్లెల్లో నివసించే మహిళలకు ఇలాంటి రోజు ఒకటి ఉంటుందనే తెలియదు. గ్రామాల్లో పరిస్థితి ఘోరంగా ఉంటుంది. మేము బయటకు వెళ్ళిపనులు చేస్తుంటే సూటిపోటి మాటలు అంటారు. ఇటు ఇంట్లో భర్త, అత్తమామల వేధింపులు. ఇవన్నీ తట్టుకొని పనిచేయాలి. ఎన్నో ఏండ్ల నుంచి ఇలాంటి ఉత్సవాలు జరుపుకుంటున్నా, స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్నా గ్రామాల్లో మహిళల పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదు. చాలా మంది మహిళలు సమస్యలను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటు ఇంటా అటు బయట వేధింపులు తప్పడం లేదు. ఎన్ని కష్టాలు వచ్చినా బయటకు చెప్పుకోకుండా పరువు పరువూ అంటూ నోరు నొక్కుకొని బతుకుతున్నారు. అందుకే మహిళల్లో మనోధైర్యాన్ని నింపాలి. కేవలం ఇంటికే పరిమితం కాకుండా బయట ప్రపంచం గురించి, రాజకీయాల గురించి తెలుసుకునే విధంగా అవకాశాలు కల్పించాలి. అప్పుడే నిజమైన మహిళా దినోత్సవం.

- బుజ్జి, ఆశావర్కర్, రంగారెడ్డి జిల్లా

అభద్రత నుంచి బయటపడినప్పుడే



ప్రతి ఏడాది మహిళా దినోత్సవం బాగానే జరుపుతున్నారు. అయితే మేం అంగన్‌వాడీ వర్కర్లుగా మహిళల, పిల్లల ఆరోగ్యం కోసమే పని చేస్తాం. కానీ మా ఆరోగ్యానికి మాత్రం రక్షణ లేదు. జీతాలు పెంచామనే పేరుతో మాపై ఒత్తిడి పెంచారు. గర్భిణీలు, బాలింతల స్కీమ్స్ మిగిలిన వారందరికీ వర్తిస్తుంది. అవి మాకు మాత్రం వర్తించవు. మమ్మల్ని ఉద్యోగులుగానే గుర్తించడం లేదు. కార్యకర్తలనే అంటారు. బయటకు వచ్చి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా ఈ సమాజంలో ఆడపిల్ల అంటే చిన్నచూపు. పసి పిల్లల నుంచి 70 ఏండ్ల అమ్మమ్మ వరకు రక్షణే లేదు. ఉద్యోగాలు చేసే మహిళల పరిస్థితి మరీ ఘోరం. అభద్రతా భావంలో బతుకుతున్నాం. మహిళలు ఇలాంటి అభద్రతా భావం నుంచి బయట పడి ధైర్యంగా బతికినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం.

- విజయ, అంగన్‌వాడీ వర్కర్, హైదరాబాద్.

మార్పు రావాలి...



మహిళా దినోత్సవం అంటే మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం. ఈ లక్ష్యం నెరవేరాలంటే కేవలం ప్రభుత్వం తలచుకుంటేనే అవుతుంది. స్త్రీ శక్తిసామర్థ్యాలు బయటకు తెచ్చేలా పాలకులు కృషి చేయాలి. మహిళలకు రక్షణ కల్పించాలి. పని చేసే చోట వేధింపులు, అసమానతలు అరికట్టే విధంగా చట్టాలు రావాలి. మహిళను చిన్న చూపు చూస్తూ జీతాలు తక్కువ ఇస్తున్నారు. ఈ ఎక్కువ తక్కువ అనేవి పక్కన పెట్టాలి. నిజం చెప్పాలంటే మహిళలు పురుషులకంటే కూడా నిబద్ధతతో పని చేస్తారు. కానీ గుర్తింపు మాత్రం లేదు. విద్యలో సమాన అవకాశాలు లేవు. అలాగే కుటుంబ వ్యవస్థలో కూడా మార్పు రావాలి. అమ్మాయిలు ఆర్థికంగా తమ కాళ్ళపై తాము నిలబడే స్థాయికి తీసుకురావాలి. ఎక్కడైనా అన్యాయం జరిగినప్పుడు దానివల్ల ఇబ్బందిపడేది మొదట మహిళ. అన్యాయానికి గురైన మహిళకు న్యాయం జరగడం లేదు. సత్వరమే శిక్షలు పడేలా, న్యాయం జరిగే విధంగా న్యాయ వ్యవస్థలో మార్పురావాలి. మహిళలకు రకరకాల చట్టాలు, హక్కులు ఉన్నాయి. అవన్నీ పోరాడి సాధించుకున్నవే. అయితే అవి ఎంత వరకు మహిళలకు అండగా నిలుస్తున్నాయనేది పెద్ద ప్రశ్న. అందుకే ఎవరో వస్తారని ఏమో చేస్తారని ఎదురు చూస్తూ కూర్చోకుండా మహిళలు పోరాడి హక్కులు సాధించుకోవాలి.

- వరలక్ష్మి, సూర్యాపేట,
మధ్యాహ్నభోజన కార్మికురాలు

సలీమ

వేసవి తాపానికి...

కీరదోస కాయ ముక్కలు ఆరోగ్యానికి చక్కటి ఔషధం. సౌందర్యానికి ప్రియ నేస్తం. అలాగే వేసవి దాహం, తాపం తీర్చే మంచి నీటి బండాగారం. ప్రధానంగా కీరను సలాడ్స్‌లో ఎక్కువగా తీసుకుంటారు. కీరలో విటమిన్లు, నీటి శాతం, మినరల్స్, పోటాషియం, మెగ్నీషియం, జింక్, పాస్పరస్, ఐరన్, కాల్షియంలు పుష్కలంగా ఉంటాయి, ప్రతిరోజూ కీర ముక్కలు తీసుకోవడం వల్ల శరీరం డిటాక్సిఫికేషన్ కావడంతో పాటు ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల పొట్ట శుభ్రపడుతుంది. క్రమం తప్పకుండా కీర ముక్కలను తినడం వల్ల కలిగే ప్రయోజనాలెంటో తెలుసుకుందాం!

- కీర ముఖ్యంగా కిడ్నిలోని బ్లడర్‌ను శుభ్రపరడంలో, మలీనలను బయటకు పంపించడంలో, కిడ్ని లోని రాళ్లను కరిగించడం లో కీర బాగా పని చేస్తుంది.
- కీర దోసను క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరం నుంచి ఎక్సెస్ యూరిక్ ఆసిడ్ పూర్తిగా బయటకు తొలగిస్తుంది. దాంతో కిడ్ని సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.
- కీరలో ఉండే ఔషధగుణాల వల్ల రొమ్ము క్యాన్సర్, ప్రొస్టెట్ క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ముఖ్యంగా కీరలో ఉండే పాలిఫినాల్స్, ఫైటో న్యూట్రియన్స్ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతాయి.
- ప్రతిరోజూ రెండు గ్లాసుల కీర జ్యూసును తాగితే కడుపు నొప్పి, అల్సర్స్ వంటి సమస్యలు దూరం అవుతాయి. అలాగే కీరలో ఉండే పోటాషియం, ఫైబర్, మెగ్నీషియం పుష్కలంగా ఉన్నాయి. ఇవి అధిక రక్తపోటును అదుపులో ఉంచుతాయి.
- వేసవి వేడి నుంచి శరీరాన్ని కాపాడంతో పాటు శరీరాన్ని డిహైడ్రేట్ చేస్తుంది. కీరలో 95 శాతం నీరు ఉండటం వల్ల వేడి వాతావరణంలో శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. కాబట్టి సమ్మర్‌లో కీర ముక్కలు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది.
- తలనొప్పితో బాధపడేవారు కీరదోసను రెగ్యులర్ డైట్‌లో చేర్చుకుంటే మంచిది. దీంటో ఉంటే విటమిన్ 'బి', నీటి శాతం, ఎలక్ట్రోలైట్స్ కారణంగా తలనొప్పి నివారణకు చాలా ఉపయోగపడుతుంది. ❄

గుడ్డు పొట్టు వల్ల ఉపయోగాలు...



మట్టిని సారవంతం చేయడానికి: గుడ్డు పొట్టు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. పెరట్లో గుడ్డు పొట్టును వేయడం వల్ల మట్టి మరింత సారవంతంగా మారుతుంది. గుడ్డు పొట్టును పొడి పొడిగా చేసి మట్టిలో స్ప్రెడ్ చేయాలి. ఇలా చేయడం వల్ల గుడ్డు పొట్టులో ఉన్న క్యాల్షియం మట్టిలో కంపోస్ట్ మారుతుంది.

విత్తనాలు మెలకెత్తడానికి: చిన్న చిన్న మొక్కలను మొలకెత్తించడానికి గుడ్డు పెంకు బాగా సహాయపడుతుంది. విత్తనాలు మొలకెత్తడానికి గుడ్డు పొట్టుకు చిన్నగా, సన్నటి రంధ్రాన్ని పెట్టాలి. ఇలా చేయడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.

పెట్ ఫుడ్: గుడ్డులో క్యాల్షియం, ఐరన్, మినిరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇంట్లో ఉండే పెంపుడు కుక్కలకు కొన్ని న్యూట్రీషియన్ ఫుడ్‌ను అందించాల్సి ఉంటుంది. కాబట్టి గుడ్డు పొట్టు ను పౌడర్ చేసి వాటికిచ్చే ఆహారంలో కలిపి ఇస్తే మంచిది.

సేంద్రియ పురుగుల మందు: గుడ్డు పొట్టును బాగా మెత్తగా పొడి చేసి మొక్కల చుట్టూ చల్లాలి. స్లగ్స్, పురుగులు, ఈగలు ఉన్న చోట చల్లితే మంచి ఫలితం ఉంటుంది. ఇందులో సేంద్రియ లక్షణాలు కలిగి ఉండటం వల్ల మొక్కలకు ఎలాంటి హానీ కలగదు.

క్లీనింగ్: గుడ్డు పొట్టును పొడి చేసి వెనిగర్‌తో కలిపి వంటగదిలోని మరకలు పడ్డ సామాన్లను శుభ్రం చేయవచ్చు. ఇది మరకలు పడ్డ పాత్రలను శుభ్రం చేయడంలో స్క్రబ్ లా పని చేస్తుంది. ❄

ఫిట్నెస్ కోసం...



ఫిట్నెస్ అనేది శరీర దృఢత్వానికి, అందానికి సంబంధించినది. ఇది ప్రతి ఒక్కరికి అవసరమే. కానీ ఫిట్నెస్ కోసం వేలకు వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని చెబుతున్నారు నిపుణులు. శరీర ఆకృతిలో, పరిమాణంలో మార్పు రావాలంటే వ్యాయామంతో పాటు కొన్ని చిన్న చిన్న నియమాలు తప్పని సరిగా పాటించాల్సిందే! అయితే వెంటనే మార్పు కనిపించకపోయినా ఫలితం మాత్రం కచ్చితంగా ఉంటుంది. దాని కోసం నెల రోజులు కావొచ్చు, మూడు వారాలు కావొచ్చు. ఫిట్నెస్ కోసం వ్యాయామంతో పాటు జీవన శైలిలో కొన్ని అలవాట్లను మార్చుకుంటే సరిపోతుంది.

- ఉదయాన్నే కాఫీ లేదా టీ వంటివి తీసుకోకూడదు. వాటికి బదులుగా పండ్ల రసాలు, ఒకటి అరటి పండు తీసుకుంటే మంచిది.
- అలాగే ఉదయం టిఫిన్‌లో, మధ్యాహ్నం భోజనంలో, రాత్రి డిన్నర్‌లో కాని ఒక చెంచా బెల్లం ఉండేలా చూసుకోవాలి. బెల్లం తీసుకోవడం వల్ల పీసీఓడీ, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్త పోటు, ఊబకాయం, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు దూరం అవుతాయి.
- ఐప్యాడ్, ఫోన్, టీవీ, కంప్యూటర్ వంటి వాటికి దూరంగా ఉండాలి. వాటికి బదులుగా ఒక పుస్తకం తీసుకొని చదువుకోవడం మంచిది. అలాగే వేళకు నిద్ర పోవడం, విశ్రాంతి తీసుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.
- కొవ్వు పదార్థాలకు, మసాలా దినుసులకు, వేపుడు పదార్థాలకు కాస్త దూరంగా ఉండాలి. ఈ పదార్థాలు తినకుండా ఉండలేమన్న వారు మాత్రం వారానికి ఒకసారి తినాలి.
- మానసికంగా ప్రశాంతంగా ఉండాలి. తగిన మోతాదులో వ్యాయామం చేయాలి. పోషకాహారం తీసుకోవాలి. వయసుకు మించి పెద్ద పెద్ద వ్యాయామాలు చేయడం మంచిది కాదు. ఒకవేళ చేయాలనుకుంటే నిపుణుల సలహాలు తీసుకోవాలి. ❄



మనం ఇట్లా ఉన్నామంటే మనకంటే ముందు చాలా మంది మనకోసం కష్టపడ్డారని గుర్తుపెట్టుకోవాలి. మన తర్వాత రానున్న వాళ్ళకోసం మనలను మనం బాధ్యతతో సంసిద్ధపరుచుకోవాలి. మనకోసం ఇంతకు ముందే చాలామంది త్యాగం చేశారు. నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు, పచ్చని, ఎర్రని, చామఛాయ వాళ్ళు – మీ చర్మం రంగు ఏదైనా ప్రతి ఒక్కరికి మన ముందు వాళ్లకు రుణపడి ఉన్నాం. వాళ్ళు త్యాగాలు చేయకపోతే మనం ఇక్కడ ఉండే వాళ్ళం కాదు. మన తర్వాత రానున్న వాళ్ళకోసం మనం కూడా అలాగే త్యాగం చేయాల్సి ఉంది. అది మన బాధ్యత.

– మాయా ఏంజిలో

సరైన పోషణ అందితే చాలు!



కాలుష్యం, మానసిక ఒత్తిళ్లు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల జుట్టు ఎక్కువగా ఊడిపోతుంది. ఈ సమస్యలను అదుపులో ఉంచాలంటే కొన్నిచిట్కాలు పాటించాల్సిందే!

- జుట్టును ఆకర్షణీయంగా, ప్రకాశవంతంగా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నది విటమిన్ 'ఎ'. ఇది వెంట్రుకలు పొడిగా మారకుండా కాపాడుతుంది.

విటమిన్ 'ఎ' సమృద్ధిగా ఉండే ఆహారపదార్థం చేపలు. క్యారెట్స్, గుడ్లు, పాలు, పాలకూర వంటి పదార్థాల్లో కూడా విటమిన్ 'ఎ' పుష్కలంగా ఉంటుంది. ఇవి క్రమం తప్పకుండా తీసుకుంటే కురులకు తగిన పోషణ అందుతుంది.

- జుట్టు పెరుగుదలకు బయోటిన్, విటమిన్ 'ఇ' ఎంతగానో సహాయపడతాయి. ఈ పదార్థాలు ఎక్కువగా గుడ్లు, పీనట్ బటర్, అరటి పండ్లు, బాదం పప్పులలో సమృద్ధిగా లభిస్తుంది.
- వెంట్రుకలు దృఢంగా, ఒత్తుగా, పొడవుగా పెరగడానికి విటమిన్ 'బి12' సహాయపడుతుంది. ఇది కోడి గుడ్లు, మంసం, వెన్న, పాలు వంటి పదార్థాల్లో లభిస్తుంది.
- వెంట్రుకలు పొడిగా మారడం, తెల్లబడటం వంటి సమస్యలు ఉంటే విటమిన్ 'సి' ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. ఇవి ఎక్కువగా సిట్రస్ జాతి పండ్లలో ఎక్కువగా లభిస్తుంది.
- జుట్టు పెరుగుదలకు ఫోలిక్ ఆసిడ్ ఎంతగానో దోహదపడుతుంది. ఇది ధాన్యపు గింజల్లో ఎక్కువగా ఉంటుంది.

❄

మావోయిస్టుల మృతదేహాల అప్పగింత

నవతెలంగాణ-భద్రాచలం

ఛత్తీస్‌గఢ్‌లోని పూజారీకాంకేర్ అడవుల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు సోమవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 10మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్ కానిస్టేబుల్ మృతిచెందిన విషయం విదితమే. కాగా మృతదేహాలను ఘటనా స్థలం నుంచి భద్రాచలం తరలించేందుకే రెండురోజులు పట్టింది. ఆ తర్వాత మరో మూడు రోజుల పాటు ఏరియా ఆస్పత్రిలోనే భద్రపర్చారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు భద్రాచలం వచ్చి వారి తాలుకా మృతదేహాలను తీసుకెళ్లారు. కాగా సుకుమా ప్రాంతంలో మావోయిస్టులు ఒకరిని హతమార్చారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉంది. మరో వైపు పలు వాహనాలకు మావోయిస్టులు నిప్పుపెట్టినట్టు తెలిసింది.

తెలంగాణ కరదీపికను ఆవిష్కరించిన కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ నేత పిఎల్ శ్రీ నివాస్ సంకలనం చేసిన తెలంగాణ కరదీపికను ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం హైదరా బాద్‌లోని ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. నాలుగేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ రంగాల్లో సాధించిన విజయాలను సంకలనం చేశామని శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థిక, సాగునీటి రంగాలు, వ్యవసాయం, సంక్షేమం మొదలైన వాటిలో తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు ఈ కరదీపికను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

వెయిటేజీ మార్కుల పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ

హైదరాబాద్: ట్రాన్స్‌కో, మెడికల్ శాఖల్లో వివిధ పోస్టుల భర్తీ సమయంలో తాత్కాలిక, ఒప్పంద కార్మికులకు ప్రాధాన్యత ఇస్తూ వెయిటేజీ మార్కులు ఇవ్వడాన్ని సవాల్ చేసిన పలు రిట్ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. సమయం సరిపోకపోవడంతో కేసు ప్రాధాన్యత దృష్ట్యా బుధవారం సమగ్రంగా విచారణ కొనసాగిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికపై ఉద్యోగాలు చేసే వారికి వెయిటేజీ మార్కులు ఇస్తే పోటీపరీక్షల్లో ప్రతిభ చూపేవారికి తీరని అన్యాయం జరుగుతుందన్నది పిటిషనర్ల తరఫు లాయర్ వాదించారు. సుప్రీంకోర్టు కూడా పోటీపరీక్షల్లో అందర్నీ సమానంగానే చూడాలని, వెయిటేజీ మార్కులు ఇవ్వడం చెల్లదని చెప్పిందని ఆయన చెప్పారు. విచారణ 7వ తేదీకి వాయిదా పడింది.

శ్రీనివాసన్ వ్యాజ్యంపై తీర్పు వాయిదా

హైదరాబాద్: ఇండియా సిమెంట్స్‌కు గనుల లీజు, నీటి కేటాయింపులపై ఈడీ నమోదు చేసిన కేసు విచారణకు స్వయంగా కోర్టు విచారణకు హాజరుకావాలన్న ఉత్తర్వుల్ని రద్దు చేయాలని కోరుతూ ఆ కంపెనీ చైర్మెన్ శ్రీనివాసన్ దాఖలు చేసుకున్న వ్యాజ్యంపై హైకోర్టు తీర్పు వాయిదా పడింది. శ్రీనివాసన్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదప్రతివాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని న్యాయమూర్తి షమీమ్ అక్తర్ వెల్లడించారు. వయసు మీదపడినందున, ఇప్పటికే ఇదే తరహా ఆరోపణలపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టేసినందున ఈకేసులో కూడా తనకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని శ్రీనివాసన్ లాయర్ వాదించారు. కోర్టుకు హాజరయ్యేందుకు శ్రీనివాసన్‌కు ఎందుకు అభ్యంతరమో అర్థం కావడం లేదని, అంత వయసులో అనేక వ్యాపారాలు ఎలా చేయగలుగుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ తరపు లాయర్ ప్రతివాదన చేశారు. అనంతరం హైకోర్టు తీర్పు వాయిదా పడింది.

దళిత చట్టాలను అమలు చేయకపోతే కఠిన చర్యలు

ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు

- ఎస్సీ ఆర్పీఎస్ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళితుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన చట్టాలను అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు కె రాములు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ ఆర్పీఎస్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఎస్సీ ఆర్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేకల ముత్తన్న మాట్లాడుతూ గత 17 ఏండ్ల నుంచి డైరీని రూపొందిస్తున్నామని, అలాగే దళితుల సంక్షేమ పథకాలతో పాటు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రచురించామని తెలిపారు.

సుశీల మృతి పట్ల సంతాపం

పార్లమెంట్ మాజీ సభ్యురాలు బంగారు సుశీల మృతి పట్ల ఎస్సీ ఆర్పీఎస్ సంతాపం తెలిపింది. దళిత జాతి అభివృద్ధికి ఆమె ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఆర్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె బాలకృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్ రాజు వస్తాద్, కార్యదర్శులు ఆర్ నాగేశ్వరరావు, బి హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు పచ్చ శ్రీనివాస్, ఎస్ వెంకటేశ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బి సుదర్శన్ బాబు, ప్రధాన కార్యదర్శి డి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

13న బంద్‌కు టీజీపీఏ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ఆమోదింపచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల13న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన ఎమ్మార్పీఎస్‌కు తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి యాదయ్య, గుడ్ల శ్రీనివాస్ మహరాజ్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవర్ధన్ సోమవారం వేర్వేరు ప్రకటనలో మద్దతు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పుతో నిలిచిపోయిన ఈ న్యాయమైన ప్రజాస్వామిక ప్రక్రియను పార్లమెంటులో ప్రత్యేక బిల్లుగా ఆమోదించడంతో తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయని తెలిపారు. జాతీయ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తానని చెబుతున్న సీఎం కేసీఆర్ వర్గీకరణ బిల్లు పెట్టించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు.

బీసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణను ప్రకటించాలి

- బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణను ప్రకటించాలని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ కె మురళీ మనోహర్, ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా బీసీ జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరపలేదని విమర్శించారు. బీసీలు ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చక్కని ప్రణాళిక రూపొందించాలన్నారు.

నేడు సదస్సు : "బీసీ సమగ్రాభివృద్ధి ప్రణాళిక" అనే అంశంపై రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో మేధావుల ఫోరమ్ చైర్మెన్ ప్రొఫెసర్ తిరుమళి, కన్వీనర్ పీఎల్ విశ్వేశ్వరరావు, డాక్టర్ రామనర్సయ్య తదితర సామాజికవేత్తలు పాల్గొంటారు.

నాడు ప్యాకేజీ.. నేడు హోదా



అమరావతి: రాష్ట్ర ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, విభజన హామీ ప్రకారం రాష్ట్రానికి హోదా ఇవ్వాల్సిందేనని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసిం హన్ పేర్కొన్నారు. ఆ బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. గతేడాది బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీకి చేసిన కృషి ఫలించింది అన్న ఆయన సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో హోదా కావాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. విభజన కారణంగా రాష్ట్రం ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయిందని, రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయంతో కష్టాలు మరింత పెరిగాయని, ఈ తరుణంలో రాష్ట్రానికి హోదా ఇస్తే తప్ప ప్రజల కష్టాలు తప్పవని గవర్నర్ పేర్కొనడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మనసులోని మాటనే గవర్నర్ అసెంబ్లీలో తన నోట వినిపించారని పరిశీలకులు భావిస్తున్నారు. విభజన చట్టంలోని హామీలన్నీ కేంద్రం అమలు చేయాల్సి ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని గవర్నర్ వివరించారు. దీంతో ఈ అంశం అసెంబ్లీలోనూ, లాబీల్లోనూ ప్యాకేజీ, హోదా అంశాలు సర్వత్రా చర్చనీయంగా మారాయి. గత బడ్జెట్ ప్రసంగాన్ని ప్రస్తుత ప్రసంగాన్ని పరిశీలిస్తే గవర్నర్ మాటల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి హోదా కావాలని ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం రావడం, గత నెల 8న రాష్ట్రంలో వామపక్షాలు తలపెట్టిన బంద్ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ హోదా వైపు మొగ్గుతోంది. రాష్ట్రానికి హోదా ఇవ్వలేమని, ప్యాకేజీ ఇస్తామని కేంద్రం ప్రకటించడం, తర్వాత దానిని కూడా అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో ఆందోళన మొదలైంది. కేంద్ర తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తలెత్తింది. ఈ దశలోనే చంద్రబాబు ఆలోచనను గవర్నర్ సోమవారం ప్రకటించారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

11.3 శాతం వృద్ధి రేటు

విభజనతో నష్టం వాటిల్లినప్పటికీ ఆంధ్రప్రదేశ్ వేగంగా దూసుకుపోతోందని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. 11.3 శాతం వృద్ధి రేటుతో రాష్ట్రం పరుగులు పెడుతోందన్నారు. అది జాతీయ సగటు 6.97 కంటే ఎక్కువగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభంకాగా, గవర్నర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్నారని, రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. విభజనతో రాష్ట్రం ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయిందని తెలిపారు. రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయంతో కష్టాలు మరింత పెరిగాయన్నారు. విభజన చట్టంలో హామీలన్నీ కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందన్నారు.

ఏపీ భవన్‌లో మీడియాపై ఆంక్షలు

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మీడియా పై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ఆందోళన చేసేందుకు రాష్ట్రం నుంచి వచ్చిన రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతల నుంచి బైట్లను తీసుకోరాదని నిబంధనలు విధించింది. ఏపీ భవన్ గోడలకు ఆదేశాల ప్రతులను అతికించింది. మీడియా ప్రతినిధులు రాజకీయ నేతల బైట్లు తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం గమనార్హం. ఈ ఆంక్షలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర విభజన సందర్భంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు ఏపీ భవన్‌లో ఆందోళన కూడా చేశారని, అదే చంద్రబాబు ఇప్పుడు ఢిల్లీ వచ్చే ప్రతిపక్ష నేతల మాటలను ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వెల్లకూడదనే అక్కసుతో మీడియాపై ఆంక్షలు విధించడం అప్రజాస్వామ్యకమని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

8న బడ్జెట్

28 వరకూ సమావేశాలు

అమరావతి: బడ్జెట్ సమావేశాల్లో హోదా, విభజన హామీలు తదితర అంశాలకు ప్రాధాన్యమి వ్వాలని నిర్ణయిం చారు. బిజినెస్ ఎడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాల ప్రకారం ఈ నెల 28వ తేదీ వరకూ అసెంబ్లీ సమావేశాలు నిర్వ హించనున్నారు. ఎనిమిదో తేదీన ఉదయం 11.30 గంటలకు బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. అనంతరం మూడు రోజులపాటు సెలవులు రానున్నాయి. ఇటీవల మరణించిన ముద్దుకృష్ణమ నాయుడికి మంగళవారం సంతాపం తర్వాత సభను వాయిదా వేయనున్నారు.

ప్రత్యామ్నాయ కూటమికి నెల రోజులుగా కేసీఆర్ కసరత్తు?

హస్తినలోనే చర్చలు ప్రారంభించిన సీఎం

- దంత సమస్యపై గత నెలలో ఢిల్లీకి రాక
- ప్రత్యామ్నాయ కూటమిపై పలువురితో మంతనాలు
- సీతారాం ఏచూరికీ ఫోన్!

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా జాతీయ రాజకీయాల్లోకి వస్తానంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. కేసీఆర్ రాకను ప్రాంతీయ పార్టీల నేతలు స్వాగతిస్తుంటే కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ కూటమిపై కేసీఆర్ ఈ నెల మూడో తేదీన ప్రకటన చేసినప్పటికీ... నెల రోజుల ముందునుంచే కసరత్తు ప్రారంభించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసం వేదికగా మలుచుకున్నారు. గత నెల తొమ్మిదో తేదీన కేసీఆర్ ఢిల్లీకి వచ్చారు. దంత సమస్యపై చికిత్స అని ప్రకటించినప్పటికీ... ప్రత్యామ్నాయ కూటమి ప్రధాన ఎజెండాగా వచ్చిన్నట్టు సమాచారం. పది రోజుల పాటు ఢిల్లీలో ఉన్న కేసీఆర్.. ఈ సమయంలోనే టీఎంసీ నేత మమతాబెనర్జీతో, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్‌సోరేన్‌తో, మహారాష్ట్ర ఎంపీలతో మాట్లాడినట్టు తెలిసింది. ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటులో రహస్యం ఏమీలేదని కేసీఆర్ ప్రకటించినప్పటికీ.. కొంత గోప్యత పాటించారు. తన ప్రతిపాదనకు వివిధ పార్టీల నుంచి ఆశించిన స్పందన రావడంతో అధికారికంగా ప్రకటించారని తెలిసింది. ప్రత్యామ్నాయ కూటమి లక్ష్యంగా కేసీఆర్ గత నెలలో హస్తిన బాట పట్టారు. ఢిల్లీలోని తుగ్లక్‌రోడ్డు -23 వేదికగా వివిధ పార్టీల నేతలతో చర్చించారు. ప్రధానంగా బీజేపీ సర్కారుపై అసంతృప్తిగా ఉన్న నేతలతో చర్చలు జరిపారు. జాతీయస్థాయిలో మోడీ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. అదే సమయంలో బీజేపీకి కేంద్రస్థాయిలో బలమైన ప్రతిపక్షం లేదు. ప్రధాన కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా వివిధ ఎన్నికల్లో ఓటమి పాలవుతూ వస్తోంది. పైగా ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రాహుల్‌గాంధీ.. మోడీని ఢీకొట్టే స్థితిలో లేరు. మోడీని నిలువరించే వాగ్ధాటి, ప్రజల్లో చొచ్చుకుని వెళ్లే స్వభావం రాహుల్‌గాంధీకి లేవు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునే స్థితి ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌కు లేదన్న ఆలోచన ముఖ్యమంత్రికి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ కూటమికి శ్రీకారం చుట్టారని సమాచారం. అదే సమయంలో విభజన హామీలపై కానీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంలో కానీ, ప్రాజెక్టులకు ఆర్థికసాయం చేయడంలో కానీ మోడీ సర్కారు తీవ్ర అలసత్వం ప్రదర్శించింది. వీటన్నింటి నేపథ్యంలో అవసరమైతే తానే ప్రత్యామ్నాయ కూటమికి నేతృత్వం వహించేందుకు కేసీఆర్ సిద్ధమయ్యారు. తెలంగాణలో అధికారం విషయంలో ఢోకా ఉండబోదన్న అంచనా వేశారు. దేశ రాజకీయాల వైపు కేసీఆర్ తన చూపు తిప్పారు. 2019 ఎన్నికల్లో మోడీ 'హవా' ఉండబోదని మొదటి నుంచి చెబుతూ వస్తున్న కేసీఆర్... బీజేపీతో పొత్తులు, ఎన్నికలపై ఆరా తీయగా దాటవేస్తూ వచ్చారు. గతంలో ఢిల్లీలో విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడిన సమయంలోనూ.. 'సమయమే అన్నింటికి సమాధానం చెబుతుంది' అని అన్నారు. మోడీ సర్కారుపై ప్రజా వ్యతిరేకత బట్టి.. మూడో ఫ్రంటా మరోటా అనేది తెలుస్తుందని అన్నారు.



(ఫైల్)

సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికీ కేసీఆర్ ఫోన్!

ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటులో భాగంగా సీపీఐ (ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి సైతం కేసీఆర్ ఫోన్ చేసినట్టు తెలంగాణ భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఫిబ్రవరి 11వ తేదీన ఢిల్లీలోని కేసీఆర్ నివాసం నుంచి ఏచూరికి ఫోన్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఏచూరి ఏపీలో ఉన్నారు. ఆ రాష్ట్ర పార్టీ మహాసభలకు హాజరయ్యేందుకు భీమవరం వెళ్లారు. ఏచూరికి ఫోన్ చేసిన కేసీఆర్ 'ముఖ్యమైన అంశంపై మాట్లాడాలి' అని చెప్పినట్టు సమాచారం. అయితే తాను ప్రస్తుతం ఏపీలో ఉన్నానని, ఢిల్లీకి వచ్చిన తరువాత కలుస్తానని చెప్పినట్టు తెలిసింది. 13వ తేదీన ఏచూరి ఢిల్లీ వచ్చినప్పటికీ ఆ మరుసటి రోజు మధ్యాహ్నమే మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ తదితర ఐదు రాష్ట్రాల పార్టీ మహాసభలకు బయల్దేరి వెళ్లారు. కేసీఆర్ ఫోన్ విషయంపై ఏచూరిని ఆరా తీయగా.. కేసీఆర్ నుంచి ఫోన్ వచ్చినట్టు చెప్పారు. అయితే ఏచూరి దక్షిణాది రాష్ట్రాల పార్టీ మహాసభల్లో బిజీబిజీగా గడపటంతో ఇరువురి మధ్య సమావేశం కుదరలేదని తెలిసింది.

జాతీయ ఫ్రంట్‌కు కేసీఆర్ ప్రణాళిక

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం జాతీయ స్థాయిలో రాజకీయ కూటమి ఏర్పాటు చేస్తానని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన సంఘాలు, సంస్థలు, ప్రముఖులతో వరుస సమావేశాలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయిం చారు. మొదట ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ తదితర విశ్రాంత అఖిల భారత స్థాయి అధికారులతో సమావేశం కాబోతున్నారు. జాతీయస్థాయిలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ ఏండ్ల తరబడి ప్రభుత్వంలో పనిచేసిన అనుభవం, అనేక రాజకీయ పరిణామాలను చూసిన అనుభ వం ఉన్న అధికారులతో సమావేశం ద్వారా దేశానికి అవసర మైన ఎజెండాను రూపొందించేందుకు దోహదపడుతుందన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నారు. దీనికి సంబంధించి సోమ వారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇంకా సైనిక, వాయు, వైమానిక శాఖల్లో పనిచేసిన విశ్రాంత రక్షణాధికారులు, ఇతర ఉద్యోగులతోనూ కేసీఆర్ సమావేశం అవుతారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ నిపుణులు, ప్రముఖ న్యాయవాదులు, అఖిల భారత రైతు సంఘాలు, వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న రైతు సంఘాల ప్రతినిధులతో కూడా చర్చించనున్నారు. కేంద్ర ప్రభుత్వంలోనూ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ పనిచేసిన ఆర్థిక శాఖ కార్యదర్శులు, విశ్రాంత అధికారులు, ఆర్థిక వేత్తలతోనూ కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమవుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగ సంఘాలు, మీడియా సంస్థలు, జర్నలిస్టులు, పారిశ్రామిక వేత్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ సమావేశమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, కలకత్తా, ముంబై, చెన్నై, బెంగళూరు లాంటి నగరాల్లో ఈ సమావేశాలు జరపనున్నారు. ఆయా వర్గాలను సంప్రదించడంతో పాటు సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా సమన్వయకర్తలను కేసీఆర్ నియమించారు. దేశం బాగుపడాలని, దేశ ప్రజలు బాగుండాలని ఆలోచించే ప్రతి ఒక్క వర్గంతో మాట్లాడడం ద్వారా ఈ దేశానికి అవసరమైన ఎజెండాను రూపొందించవచ్చని కేసీఆర్ ఆలోచనగా ఉంది. కేసీఆర్ సారధ్యంలో కూటమి ఏర్పాటుపై జాతీయ స్థాయిలో చర్చ ప్రారంభంకావడంతో దీనికి అనుకూలంగా మలుచుకుంటామని టీఆర్ఎస్ నేతలు గంటాపథంగా చెబుతున్నారు.

అజిత్‌జోగి సంపూర్ణ మద్దతు

దేశంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్న సీఎం కేసీఆర్‌కు ఛత్తీస్‌గఢ్ జనతా కాంగ్రెస్ నేత అజిత్ జోగి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు జోగి ఫోన్ చేశారు. సీఎం కేసీఆర్ కొత్త ఫ్రంట్ ఏర్పాటు చేస్తే దానిలో తాను భాగస్వామి అవుతానని జోగి తెలిపారు. భావ సారూప్యత ఉన్న జాతీయ స్థాయి నేతలతో సంప్రదింపులు జరిపి ఫ్రంట్ ఏర్పాటులో తనదైన పాత్ర పోషిస్తానని జోగి చెప్పారు.

పదిన టీఆర్ఎస్ రాజ్యసభ పేర్లు ఖరారు

నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. కాంగ్రెస్ ఎంపి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గతేడాది జూన్ 9న అనారోగ్యం కారణంగా మరణించగా... రాపోలు ఆనంద భాస్కర్, సీఎం రమేష్ పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. దీంతో రాష్ట్రానికి చెందిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ఈ నెల 12న చివరితేదీ కాగా, 13న పరిశీలన, 15న నామినేషన్లను ఉప సంహరణ ఉంటుంది. 23న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ఉంటుంది. అయితే మూడు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. అధికార టీఆర్ఎస్‌పార్టీకే పూర్తి మెజారిటీ ఉండడంతో మరో పార్టీకి పోటీ చేసే అవకాశం లేదు. దీంతో ఈనెల పదో తేదీన టీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థులను సీఎం కేసీఆర్ వెల్లడిస్తారని ఆ పార్టీ వర్గీయులు తెలిపారు. ఎనిమిదిన టీఆర్ఎస్ఎల్పీ సమావేశం జరిగితే అదే రోజు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. పేర్లపై ఉత్కంఠ నెలకొంది. సంతోష్‌కుమార్, రాజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మందా జగన్నాథం, నాయిని నర్సింహారెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య పేరు కూడా వినిపిస్తున్నది.



నాంపల్లి దర్గాకు సంతోష్ కుమార్

కాంగ్రెస్‌ది తుస్సుయాత్ర : ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

బస్సుయాత్ర పేరుతో కాంగ్రెస్ పార్టీ తుస్సు యాత్ర చేస్తున్నదని టిఆర్ఎస్ ఎమ్మెల్యే శీనివాస్‌గౌడ్ వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ఎల్పిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బస్సుయాత్ర ఎక్కడికెళ్లినా.. జనం ఆదరించడం లేదన్నారు. తమకేదో బలముందని చెప్పుకుంటున్న కాంగ్రెస్‌కు దమ్ముంటే.. ఒక ఎమ్మెల్యేతో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో గెలవాలని సవాల్ విసిరారు.

ఈ సందర్భంగా బీజేపీ నేతలపై విమర్శలు గుప్పించారు. త్రిపురలో గెలిస్తే.. ఇక్కడ సంబరాలు చేసుకోవడమే మిటని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసి ఎన్నికల్లో గెలవలేని బీజేపీ, రాష్ట్రంలో అధికారంలోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. వాపును చూసి ఆ పార్టీ నేతలు బలుపు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

ఎంజీఆర్ తరహా పాలన అందిస్తా

- జయలలిత నిజమైన నాయకురాలు : రజనీకాంత్



చెన్నై: తమిళనాడులో సరైన నాయకుడు లేరని, ఆ లోటును తాను భర్తీ చేస్తానని రజనీకాంత్ అన్నారు. ఎంజీఆర్, జయలలిత సినిమా నుంచే రాజకీయాల్లోకి వచ్చారని, ఎంజీఆర్ తరహా పాలన అందించాలని ఉన్నదని తెలిపారు. జయలలిత నిజమైన నాయకురాలని కొనియాడారు.

తనకెవరూ మద్దతిస్తారనేది పట్టించుకోనని అన్నారు.జయలలిత మరణంతో రాజకీయ శూన్యత ఏర్పడిందని చెప్పారు. ఆ దేవుడు తనవైపు ఉన్నాడని, అధికారంలోకి వస్తే పారదర్శక పాలన అందిస్తామని రజనీ వ్యాఖ్యానించారు. తమిళనాడులో ఏ ఒక్క రాజకీయ నేత కూడా సరిగ్గా పని చేయడంలేదని, ప్రజల కోసం అసలు ఏమీ చేయడంలేదని రజనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలంటే అంత ఈజీ కాదన్న విషయం తనకు తెలుసున్నారు.మేకప్ తీసేసి రాజకీయాల్లోకి రావడం ఎందుకని తనను ప్రభుత్వ నేతలతో పాటు కొందరు రాజకీయ నేతలు అడుగుతున్నారని తెలిపారు. వెలప్పన్వాడీలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఎంజీ రామచంద్రన్ విగ్రహాన్ని రజనీకాంత్ ఆవిష్కరించారు. రాజకీయ ప్రవేశం తర్వాత తొలిసారి రజనీ మాట్లాడిన అంశాలు తమిళనాట రాజకీయాల్లో కలకలంరేపుతున్నాయి.

ఆన్‌లైన్ వ్యవస్థను పటిష్టం చేయండి

- అవినీతిని సహించేది లేదు
- బండ్లగూడ ఘటనలో నలుగురు అధికారుల సస్పెన్షన్ : రవాణాశాఖ సమీక్షలో మంత్రి మహేందర్‌రెడ్డి




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణాశాఖలో ఆన్‌లైన్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా ఆ శాఖలో దళారీవ్యవస్థను, అవినీతిని అరికట్టలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సచివాలయంలో సోమవారంనాడాయన రవాణాశాఖ పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, జేటీసీ రమేష్, రాష్ట్ర ఐటీ కార్యదర్శి రమాదేవి, డీటీసీలు ప్రవీణ్‌రావు, మమతాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో పాత వాహనాల వయసును తగ్గించి రిజిస్ట్రేషన్లు, ఆర్సీలు జారీ చేసిన అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడి, రవాణాశాఖకు రూ.1.20 కోట్లు నష్టం కలిగించిన నలుగురు అధికారుల్ని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అక్కడి ఆర్టీఓ పురుషోత్తంను ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేయాలని చెప్పారు. నష్టపోయిన సొమ్మును వారినుంచే రికవరీ చేయాలని ఆదేశించారు. వాహన రేటులో కృత్రిమ డిస్కౌంట్స్ సృష్టించి పన్ను ఎగవేతను అరికట్టేందుకు కంప్యూటర్ సిస్టమ్స్‌లో ఎక్స్ షోరూం ధరను కాలమ్‌ను కూడా చేర్చాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి సెకండ్‌హ్యాండ్ మీద కొనుగోలు చేసే వాహనాలను డాటాఎంట్రీ చేసే సమయంలో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఎన్ఐసీ నుంచి వివరాలు తీసుకొని, దాని ఆధారంగా వాహనరేటు, వయసు నిర్ణయించి పన్నులు వసూలు చేయాలని అన్నారు. రవాణాశాఖ సాఫ్ట్‌వేర్ దుర్వినియోగం చేసి అవకతవకలకు పాల్పడకుండా బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని చెప్పారు. ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల ప్రమేయం ఉండరాదని, అలాంటి ఘటనలు దృష్టికి వస్తే అధికారులపై తక్షణం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రవాణాశాఖ కార్యాలయాల్లో కంప్యూటర్లు, కార్డ్ ప్రింటర్లు ఇతర సామాగ్రిని తక్షణం కొనుగోలు చేయాలని ఆదేశించారు.

ఆర్ఎస్ఎస్ కీలుబొమ్మ కేసీఆర్

- ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ఆర్ఎస్ఎస్ చేతిలో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలుబొమ్మ అని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నాగపూర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే కేసీఆర్ 'థర్డ్‌ఫ్రంట్' అంటూ హడావుడి చేస్తున్నారని వెల్లడించారు. కేసీఆర్ ఏర్పాటు చేస్తానన్న ఈ ఫ్రంట్ బీజేపీకి మేలు చేయడం కోసమేనని విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పక్కన పెట్టి.. థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని కేసీఆర్ హడావుడి చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ పొత్తు వద్దంటోందని ఇటీవల చంద్రబాబు చేసిన కీలక ప్రకటనే.. ఈ ఫ్రంట్ హడావుడికి కారణమని వివరించారు. ఇప్పటికే బీజేపీపై కోపంగా ఉన్న చంద్రబాబు, కాంగ్రెస్‌తో కలిసి రాజకీయ కూటమి ఏర్పాటు చేసే అవకాశాలున్నాయన్న నిఘా వ్యవస్థ అందించిన సమాచారంతో.. బీజేపీ భయానికి గురయ్యిందన్నారు. కాంగ్రెస్, టీడీపీ కూటమిగా ఏర్పడితే.. దక్షిణాదిలో బీజేపీకి సీట్లు తగ్గుతాయన్న అంచనాకు వచ్చిన ఆర్ఎస్ఎస్.. కేసీఆర్‌ను రంగంలోకి దింపిందని వెల్లడించారు. కేసీఆర్ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉండగా.. జరిగిన ఈఎస్ఐ ఆస్పత్రుల్లో కుంభకోణం, సహారా ఇండియా కుంభకోణంపై సీబీఐ విచారణ వేగంగా జరుగుతున్నదన్నారు. ఈ భయంతోనే.. చికిత్స పేరుతో కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి.. కేంద్ర పెద్దలను కలుస్తున్నారని వెల్లడించారు. ఈ ఫ్రంట్ ప్రకటన చేయడానికి కుంభకోణం, కుటుంబకోణం కూడా ఉందన్నారు. ముఖ్యమంత్రి పదవి అంశంపై కేసీఆర్ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని, కుటుంబంలో చీలిక కూడా వచ్చిందని రేవంత్ వెల్లడించారు.

పోటీ తత్వాన్ని డ్యూటీమీట్‌లు పెంచుతాయి

చెన్నై డ్యూటీ మీట్‌లో పతకాలు పొందిన పోలీసులకు డీజీపీ అభినందనలు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

పోలీసులలో పోటీ తత్వాన్ని, ఏదైనా సాధించాలనే తపనను పోలీసు డ్యూటీమీట్‌లు పెంపొందిస్తాయని రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. చెన్నైలో ఇటీవలన జరిగిన 51వ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో వివిధ పోటీలో పతకాలు గెలుపొందిన రాష్ట్ర పోలీసు బృందం సోమవారం ఆయనను కలిసింది. వారిని పేరు పేరున అభినందించిన డీజీపీ మాట్లాడుతు పోటీ తత్వం ద్వారానే ఏదైనా సాధించగలమని అన్నారు.

ముఖ్యంగా డ్యూటీమీట్‌లలో పాల్గొనే ప్రతి ఒక్క పోలీసు తాము పాల్గొనే అంశంలో కచ్చితంగా పతకాన్ని సాధించేలా తయారు కావలని కోరారు. ఈ మారు డ్యూటీమీట్ లో సాధించిన పతకాలను వచ్చే పోటీ నాటికి రెండంతలు చేసుకోవాలని తెలిపారు. అందుకు అవ సరమైన సౌకర్యాలు, అవకాశాలను కల్పించడానికి తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు.

మనకన్నా మూడు రెట్లు పెద్దది

- చైనా రక్షణ బడ్జెట్ రూ.11.39 లక్షల కోట్లు



బీజింగ్: గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రక్షణ బడ్జెట్‌ను 8.1శాతం పెంచినట్టు చైనా ప్రకటించింది. 175బిలియన్ డాలర్లను (సుమారుగా రూ.11.39 లక్షల కోట్లు) రక్షణ రంగానికి కేటాయించినట్టు తెలిపింది. భారత రక్షణ బడ్జెట్‌తో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. సోమవారం చైనా సమర్పించిన 2018 బడ్జెట్ నివేదిక ప్రకారం ఈ విషయం వెల్లడైంది. గత ఏడాది రక్షణ బడ్జెట్‌ను ఏడు శాతం పెంచిన చైనా ఈ ఏడాది ఇంకాస్త ఎక్కువగా 8.1శాతం పెంచింది. ప్రపంచంలో అమెరికా తర్వాత రక్షణ రంగానికి అత్యధికంగా నిధులు కేటాయిస్తున్న దేశం చైనానే. అమెరికా రక్షణ బడ్జెట్ 602.8 బిలియన్ డాలర్లు. భారత్‌లో రక్షణ రంగానికి 52.5బిలియన్ డాలర్లు కేటాయించగా.. చైనా మన కన్నా దాదాపు మూడు రెట్లు ఎక్కువ కేటాయించింది.

చైనా రెండు కొత్త విమాన వాహక నౌకలను రూపొందిస్తోంది. ఇప్పటికే ఒక విమాన వాహక నౌక సేవలు అందిస్తోంది. అలాగే కొత్త జే-20 యుద్ధ విమానాలు సహా మరికొన్ని కొత్త జెట్‌లను తయారుచేస్తోంది. చైనా నావికదళ సేవలనూ విస్తరించుకుంటోంది. ఇతర ప్రధాన దేశాలతో పోలిస్తే చైనా జీడీపీలో రక్షణ బడ్జెట్ ప్రభావం తక్కువగా ఉందని, జాతీయ ఆర్థిక వ్యయం కూడా తక్కువగా ఉందని నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మీడియాకు తెలిపారు. మిలిటరీ ఎక్విప్‌మెంట్ అప్‌గ్రేడ్ చేయడానికి, సైనికుల సంక్షేమం, కిందిస్థాయి దళాల నివాస, శిక్షణ పరిస్థితులను మరింత మెరుగుపరిచేందుకు బడ్జెట్‌ను పెంచినట్టు చెప్పారు.

ట్రంప్‌పై మండిపడుతున్న చమురు పరిశ్రమ



వాషింగ్టన్ : దేశీయ స్టీల్ పరిశ్రమను ప్రోత్సహించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు మరో రూపంలో ఇబ్బంది కరంగా మారింది. అమెరికాలో అత్యంత కీలకమైన షెల్ ఇంధన పరిశ్రమకు గుదిబండగా మారనుంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్టీల్‌పై 25శాతం సుంకం విధించాలని ఆయన నిర్ణయించారు. కానీ ఈ నిర్ణయం ఒపెక్, రష్యాలకు ఉపయోగపడు తుంది కానీ దేశానికి ఏమాత్రం ఉపయోగపడదని షెల్ పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

ప్రపంచంలో అమెరికాను అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా తీర్చిదిద్దాలనే కల ఈ నిర్ణయంతో సాధ్యంకాకపోవచ్చని భావిస్తున్నారు. ఆయిల్ సరఫరాకు అమెరికాలో భారీ ఎత్తున పైప్‌లైన్లను నిర్మించాల్సి ఉంది. అమెరికాలోని ఐదు పైప్‌లైన్ సంస్థలు వాడే స్టీల్‌లో 77శాతం దిగుమతి చేసుకుందే. ముఖ్యంగా 'డకోటా' పైప్‌లైన్ ప్రాజెక్టు దీని నుంచి తీవ్రంగా ప్రభావితం కానుంది. ఈ నిర్ణయంతో అమెరికాలోని పలు ప్రాజెక్టుల వ్యయం కూడా పెరగనుంది. దీంతో ప్రాజెక్టులను మధ్యలోనే ఆపివేయడమో లేకపోతే.. నిలిపివేయడమో చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మహానగరానికి మంచినీటి కష్టాలు

- నీటి కరువుతో విలవిల్లాడుతున్న కేప్‌టౌన్
- మరికొన్ని వారాల్లో నిలిచిపోనున్న నీటి సరఫరా



దక్షిణాఫ్రికా నగరం కేప్‌టౌన్‌కు నీటి కష్టాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. రెండు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఇళ్లల్లో షవర్లు పనిచేయడంలేదు. కార్లను కడగడానికి, గార్డెన్లకు నీరు ఇవ్వడంలేదు. స్నానం చేసిన నీటిని రీసైకిల్ చేసి గిన్నెలు కడగడానికి, దుస్తులు ఉతకడానికి వినియోగిస్తున్నారు. తల స్నానం చేయనివారిని ప్రత్యేకంగా ప్రశంసించే పరిస్థితి నెలకొన్నది.

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలోని అత్యాధునిక నగరాల్లో ఒకటి కేప్‌టౌన్ మరికొన్ని వారాల్లో ఎడారిగా మారిపోనుంది. గత 384 ఏండ్లలో ఎన్నడూ లేనంత నీటి కరవును చవిచూడబోతోంది. చాలా మంది నీటిని కొనుగోలు చేయలేక బోరు నీటినే తాగుతున్నారు. మరో పది వారాల్లో ఇక్కడి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతోందని అంచనావేస్తున్నారు. జులై 9వ తేదీ నుంచి ఇక్కడ మంచినీటి సరఫరా ఉండకపోవచ్చు. ఫలితంగా ప్రపంచలోనే మంచినీరు సరఫరాలేని మహానగరంగా కేప్‌టౌన్ నిలవనుంది. కేప్‌టౌన్ ఎప్పుడు చూడనంత కరవును చూస్తోంది. మూడేండ్లుగా సరైన వర్షాలు లేవు. ఇక్కడ ఉన్న నీటి సరఫరా వ్యవస్థకు రెండేళ్ల కరవును మాత్రమే ఎదుర్కొనే సామర్థ్యం ఉంది. కానీ ఇప్పుడు వచ్చిన కరవు 384ఏండ్లలో ఎప్పుడూ రాలేదు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

చుట్టుపక్కల పట్టణాల్లో కూడా ఇదే పరిస్థితి . ఈ నగరానికి నీటి సరఫరా చేసే థీవాటర్ స్క్లూఫ్ డ్యామ్‌లో కేవలం 11శాతం మాత్రమే నీరు ఉంది. అది పదిశాతానికి పడిపోతే ఆ నీరు వినియోగానికి ఉపయోగపడదు. 2015లోనే ఇక్కడ నీటి సరఫరా 1,200 మిలియన్ లీటర్ల నుంచి 566 మిలియన్ లీటర్లకు కుదించారు. నగరంలోని ప్రతిపౌరుడికి 50లీటర్లకు మించి నీరు ఇవ్వడంలేదు. నగరంలో జనాభా ఏమాత్రం తగ్గలేదు. ఇంకా చెప్పాలంటే 20ఏండ్లలో దాదాపు రెట్టింపైంది. 1995 లో 24 లక్షలు ఉన్న జనాభా.. 2018 నాటికి దాదాపు 43 లక్షలకు చేరింది. ఈ నగరానికి నీటిని అందజేసే వెస్ట్రన్ కేప్ వాటర్ సప్లై సిస్టమ్‌లోని ఆరు ప్రాజెక్టులు ఎండిపోయాయి. 2009లో పట్టణం కోసం బెర్గ్ రివర్ డ్యామ్ సామర్థ్యాన్ని 17శాతం పెంచారు. కానీ పెరుగుతున్న జనాభా దెబ్బకు అది ఏమాత్రం సరిపోలేదు.

భారతఎంబసీ పేరుతో మోసాలు..!

వాషింగ్టన్: అమెరికాలోని భారత రాయబార కార్యాలయానికి చెందిన టెలిఫోన్ లైన్లను అనుకరించి కొందరు మోసగాళ్లు దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఫోన్ లైన్ల ద్వారా అమెరికాలోని ప్రవాస భారతీయులను డబ్బు కోసం డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇతర మోసాలు చేస్తున్నారని భారత ఎంబసీ కార్యాలయం వెల్లడించింది. ఈ విషయంపై భారత ఎంబసీ అమెరికా ప్రభుత్వానికి సమాచారం అందించింది. అలాగే రాయబార కార్యాలయం అంతర్గత విచారణ ప్రారంభించింది. దీనిపై జాగ్రత్తగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. డబ్బు కోసం దుండగులు ఇలాంటి పనిచేస్తున్నారని తెలిపారు.

లక్కీడ్రాలో.. భారతీయులకు జాక్‌పాట్



దుబాయి: అబుదాబి 'బిగ్ టికెట్ లక్కీ డ్రా'లో భారతీయులకు జాక్‌పాట్ తగిలింది. ఈ లక్కీ డ్రా వరించిన 8 మంది విజేతల్లో ఏడుగురు భారతీయులు భారీ మొత్తం గెల్చుకున్నారు. సోమవారం అబుదాబి అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో భారతీయుల పంట పండింది. కేరళకు చెందిన థాన్సిలాస్ బాబు మాథ్యూస్ 7 మిలియన్ల దినార్‌లు (దాదాపు 12.5 కోట్లు) గెలుచుకున్నాడు. ఈ లాటరీ తగలటం నమ్మలేకపోతున్నానని థాన్సిలాస్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. గత నెలలో రాఫెల్ బొనాంజా బిగ్ లక్కీ మిలియనీర్ లాటరీ టికెట్ నెంబర్ 030202 కొనుగోలు చేయగా, డ్రాలో పెద్ద మొత్తమైన 12.5 కోట్లు గెలుచుకున్నాడు.

ఇదే డ్రాలో మరో ఆరుగురు భారతీయులు ఒక్కొక్కరు దాదాపు రూ.18 లక్షలు గెలుపొందారు. బిగ్ టికెట్ లక్కీ డ్రా విజేతల్లో ఏడుగురు భారతీయులు కాగా, బహ్రెయిన్‌కు చెందిన మరో వ్యక్తి ఉన్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు చేతులకు రావడంతో విజేతలు అమితాశ్చర్యానికి గురయ్యారు. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

విమానంలో అసభ్యంగా..

కౌలాలంపూర్: విమానం ఎక్కి బుద్ధిగా కూర్చోకుండా తోటి ప్రయాణికులు, ఎయిర్ హోస్టెస్‌లతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ప్రబుద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు మలేషియా ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. మీడియాలో వచ్చిన కథనం ప్రకారం..మలేషియా విశ్వవిద్యాలయంలో చదువుకుంటోన్న బంగ్లాదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి శనివారం కౌలాలంపూర్ నుంచి విమానం ఎక్కాడు. అప్పటి నుంచి వింతగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. అతడి ల్యాప్‌ట్యాప్‌లో అశ్లీల దృశ్యాలు చూడటంతో పాటు ఎయిర్ హోస్టెస్‌లతో అసభ్యంగా ప్రవర్తించ సాగాడు. అతడి ప్రవర్తనను వారు అడ్డుకోవడంతో ఇంకా దురుసుగా ప్రవర్తించడంతో పాటు దాడి కూడా చేశాడు. దాంతో ప్రయాణికులు అతడ్ని బంధించి కట్టివేశారు. అతడి ప్రవర్తనకు కారణాలు వెల్లడికాలేదని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు వెల్లడించడానికి మలేషియా ఎయిర్‌లైన్స్ సుముఖత చూపించలేదు. కానీ ప్రయాణికుడిని ఉద్దేశించి 'అసాధారణ ప్రయాణికుడు' అని ఒక ప్రకటనలో

ఉ.కొరియాకు చేరుకున్న ద.కొరియా ప్రతినిధులు

- అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో కీలక చర్చలు
- త్వరలో అమెరికా-ఉ.కొరియా మధ్య కూడా..



సియోల్: రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉత్తర కొరియాకు సీనియర్ భద్రతా అధికారుల నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని పంపించామని దక్షిణ కొరియా అధ్యక్ష భవనం బ్లూ హౌస్ ప్రకటించింది. ఈ పర్యటన సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఉంటుందని బ్లూ హౌస్ వెల్లడించింది. దక్షిణ కొరియా జాతీయ భద్రతా అధికారి చంగ్-యాంగ్, జాతీయ ఇంటిలిజెన్స్ విభాగం చీఫ్ షూ హూన్‌తో పాటు మరో పది మంది సభ్యులతో కూడిన అధికార బృందం ఈ పర్యటనలో పాల్గొననున్నట్టు వెల్లడించారు. ఇప్పటి వరకూ కొరియన్ ద్వీపకల్పాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల గురించి సామరస్యపూర్వక చర్చలు జరపడం కోసం, అనంతరం ఉత్తర కొరియా, అమెరికా మధ్య చర్చలు సాధ్యపడేలా పరిస్థితులను చక్కబెట్టడానికే ఈ పర్యటన అని తెలిసింది. పర్యటన అనంతరం దక్షిణ కొరియా ప్రతినిధులు నేరుగా అమెరికాకు పయనమై వారి పర్యటన విశేషాలను అమెరికాతో పంచుకోనున్నారు. ఈ క్రమంలో చైనా, జపాన్‌లను కూడా సమన్వయ పరచనున్నట్టు సియోల్ ప్రకటించింది.

ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం శనివారం వాషింగ్టన్‌లో విలేకర్ల సమావేశంలో ఉత్తరకొరియాతో చర్చలకు అమెరికా ఎల్లప్పుడూ సిద్ధమే అని పేర్కొన్నారు. కానీ చర్చలు జరగాలంటే ముందు ఉత్తరకొరియా అణు ఆయుధాలను విస్మరిస్తేనే సాధ్యపడుతుందంటూ చమత్కరించారు. ఈ ఇరు దేశాల చర్చల మధ్య చైనా కూడా తన మనసులో అంతరంగాన్ని వెల్లడించింది. ఆదివారం చైనా పార్లమెంట్‌లో ఉప విదేశీ వ్యవహారాల మంత్రి ఝూంగ్ కూడా ఉత్తరకొరియా, అమెరికాల మధ్య త్వరలోనే చర్చలు జరుగుతాయని ప్రకటించారు.

గతనెలలో దక్షిణ కొరియాలో శీతాకాల ఒలింపిక్స్‌లో భాగంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్ ఉత్తర కొరియా ప్రతినిధులతో మాట్లాడేందుకు షెడ్యూల్ కూడా ఖరారైంది. కానీ ఉత్తరకొరియా తరఫున హాజరైన కిమ్ జోంగ్ ఉన్ సోదరి చివరి నిమిషంలో తమ ప్రతినిధితో చర్చలు రద్దు చేయడంతో ఇది సాధ్యపడలేదంటూ అమెరికా అధికారులు ఫిబ్రవరిలోనే ప్రకటించారు.


మరోవైపు అమెరికాతో చర్చలు జరిపేందుకు ఉత్తరకొరియా సుముఖంగానే ఉందంటూ శనివారం పునరుద్ఘాటించింది. అయితే చర్చలకు ముందు తమపై ఎలాంటి ఆంక్షలు విధించకుంటేనే ఇది సాధ్యపడుతుందని తెలిపింది. అంతకుముందు దక్షిణ కొరియాతో కలిసి అమెరికా సైనిక విన్యాసాలకు పాల్పడితే ఊరుకునేది లేదని ఉ.కొరియా అధికారి తమ మీడియా ద్వారా వెల్లడించారు.

అమెరికా, దక్షిణ కొరియాకి మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాలు ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నాయి. అమెరికా దక్షిణ కొరియాతో కలిసి సైనిక విన్యాసాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులలో ద.కొరియా ప్రతినిధుల ఉ.కొరియా పర్యటన ఎలాంటి ఫలితాలనిస్తుందో చూడాల్సిందే.

ప్రభుత్వ వేతనం.. ప్రయివేటు కొలువు

జాబ్ గ్యారెంటీ లేని 108 ఉద్యోగులు

- సమస్యల పరిష్కారం కోసం 18 నుంచి సమ్మె



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వంద శాతం ప్రభుత్వ నిధులతో నడుస్తున్న 108 ఉద్యోగులను విచిత్ర సమస్య వెంటాడుతున్నది. సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక ప్రాతిపదికగా పనిచేస్తున్న వారు కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణింపబడతారు. అయితే, వైద్యఆరోగ్యశాఖలో అత్యవసర సర్వీసుల్లో 13 ఏండ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను మాత్రం జీవీకే-ఈఎంఆర్‌ఐ ప్రయివేటుగానే గుర్తిస్తున్నది. వేతనం ప్రభుత్వం చెల్లిస్తున్నప్పుడు ప్రయివేటు ఉద్యోగులం ఎలా అవుతామని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. తమను కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ గుర్తించాలని ఉద్యోగులు అనేక సార్లు మంత్రి లక్ష్మారెడ్డి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో ఎనిమిది గంటల పని విధానాన్ని వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వ అధికారితో గ్రీనియెన్స్ సెల్ ఏర్పాటు చేయాలనే ఇతరత్ర డిమాండ్లతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 10న ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేస్తామని, డిమాండ్లపై స్పందించకపోతే 18 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ 108 ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె అశోక్ తెలిపారు. 'ఏండ్లుగా పనిచేస్తున్నా మాకు ఎలాంటి గుర్తింపు లేదు. మమ్మల్ని కేవలం ప్రయివేటు ఉద్యోగులుగా చూస్తున్నారు. ఆరోగ్య శ్రీ, 104 వంటి పథకాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తున్నారు. అత్యవసర సర్వీసుల నిర్వహణకు ఏ సంస్థ వచ్చినా దానిని ఒక ఏజెన్సీగా గుర్తించి ఉద్యోగులను ప్రయివేటు నుంచి మినహాయించాలి' అని డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మరోవైపు, అత్యవసర సేవలను పర్యవేక్షించే జీవీకే-ఈఎంఆర్‌ఐ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలున్నాయి. సర్వీసులను ప్రారంభించిన కొత్తలో ఒక కార్మికుడు నెలలో 216 గంటలు పనిచేస్తే..మూడు రోజులకు ఒక సెలవు వచ్చేది. కానీ జీవీకేతో ఒప్పందం కుదిరాక సెలవు నాలుగు రోజులకు మారిపోయింది. అంటే ఒక నెలలో 288 గంటలు పనిచేయిస్తూ సంస్థ శ్రమదోపిడికీ పాల్పడుతున్నదని ఉద్యోగులు మండిపడుతున్నారు. కార్మికుడు నెలలో 208 గంటలు మాత్రమే విధులు నిర్వర్తించాలని కార్మిక చట్టాలు చెబుతుంటే..తాము 80 గంటలు అదనంగా పనిచేస్తున్నామని చెబుతున్నారు.

ఈ విధంగా 12 గంటలు పనిచేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని..ఏదైనా ప్రమాదం జరిగితే జీవీకే యాజమాన్యం లేదా ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి అంతే మొత్తంలో వేతనాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఉద్యోగులు ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. జీతాలు పెంచుకోవాలంటే ఏ ధర్నానో..రాస్తారోకోనో చేయాల్సిన పరిస్థితి. దీనిని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇతర ఉద్యోగుల మాదిరే తమకు కూడా ఒక జీఓను వర్తింపజేయాలని దాని ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతున్నారు.

జీఓ ఎంఎస్ నెం.14ను అమలు చేయాలన్నారు. ఏండ్లుగా పనిచేస్తున్నా చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి జీవీకే యాజమాన్యం ఉద్యోగం నుండి తొలగించడం దారుణమని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అత్యవసర సర్వీసు ఉద్యోగులను కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి ఇతరత్ర సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సభ్యుల ప్రశ్నలకు సమాధానాలను అప్‌లోడ్ చేయండి

అధికారులకు సీఎస్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



గత అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలలో వివిధ శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను లెజిస్లేచర్ సెక్రెటేరియేట్ వెబ్‌సైట్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి అధికారులను అదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో శాసనమండలి, శాసనసభలోని పెండింగ్ ప్రశ్నలు, కేంద్ర ప్రాయోజిక పథకాలు, ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్ల నిర్వహణ, వివిధ శాఖల మధ్య సయోధ్య లాంటి అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గతంలో జరిగిన అసెంబ్లీ 2వ సెషన్ నుంచి 8వ సెషన్ వరకు పెండింగ్‌లో ఉనన ఎల్‌సీక్యూ, ఎల్‌ఏక్యూ, రూల్ 74, రూల్ 344, జీరో హవర్ మెన్షన్, స్పెషల్ మెన్షన్లకు సంబంధించిన సమాధానాలను సంబంధిత నోడల్ అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వివిధ శాఖలకు లాగిన్ ఐడీ. పాస్‌వర్డ్‌లను అందజేశామని, ఆయా శాఖలు తమ సమాధానాలను పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. ఈ నెలలో ప్రారంభమయ్యే సమావేశాలకు సంబంధించి బిల్లులు, అమెండ్‌మెంట్స్, క్యాబినెట్ మెమోరాండంకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అచీవ్‌మెంట్స్, వివిధ ప్యారామీటర్స్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను శాఖల వారీగా క్లుప్తంగా రూపొందించాలన్నారు. వీటికి సంబంధించి నోడల్ అధికారిని నియమించుకొని శాసనసభ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, చిత్రా రామచంద్రన్, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, అరవింద్ కుమార్, శశాంక్ గోయల్, రాజీవ్ త్రివేది, వికాస్ రాజ్, శివశంకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లకు దండిగా దరఖాస్తులు

- ఆరో తరగతిలో 19,400 సీట్లకు 55,281 మంది పోటీ
- ఖాళీలు తెలియని తరగతులకూ 56,816 దరఖాస్తులు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలల్లో సీట్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. గడిచిన రెండేండ్లలో వందల సంఖ్యలో కొత్త గురుకులాలు వచ్చినా..మోడల్ స్కూళ్లకు మాత్రం ఆదరణ తగ్గలేదు. 2018-19 విద్యాసంవత్సరానికి గానూ ఖాళీ సీట్ల కోసం ఏకంగా 1,12,097 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. తెలంగాణలో మొత్తం 194 ఆదర్శ పాఠశాలలున్నాయి. వీటిలో వంద పాఠశాలల్లో కేవలం బాలికలకు మాత్రమే వసతి సౌకర్యం ఉంది. మిగిలిన పాఠశాలలు డే స్కాలర్స్‌గానే కొనసాగుతున్నాయి. 2018-19 విద్యాసంవత్సరానికి గానూ జనవరి 23నుంచి ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదట్లో ఫిబ్రవరి 16వరకు గడువు ఉండగా, దాన్ని ఫిబ్రవరి 28 వరకు పొడగించారు. ఆడ్మిషన్లను ప్రధానంగా ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తుండగా, ఏడోతరగతి నుంచి పదోతరగతి వరకూ 2018-19లో ఖాళీ అయ్యే సీట్లకు కూడా దరఖాస్తులు స్వీకరించారు. ఆరో తరగతిలో 19,400 సీట్లకు గానూ 55,281 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో రెండు ఆదర్శ పాఠశాలలుంటే, వాటిలో ఓ స్కూలుకు ఏకంగా వెయ్యి దరఖాస్తులు రావడం గమనార్హం. రాష్ట్రంలో కొత్తగా సుమారు 450 గురుకులాలు ఏర్పడటంతో పాటు సర్కారు బడుల్లోనూ డిజిటల్, ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రారంభించారు. అయినా మోడల్ స్కూళ్లలో గతేడాది కంటే కేవలం రెండువేల దరఖాస్తులు మాత్రమే తక్కువగా వచ్చాయని ఆదర్శ పాఠశాలల విభాగం అధికారొకరు తెలిపారు. అన్ని ఆదర్శ పాఠశాలల్లో బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉంటే, దరఖాస్తుల సంఖ్య రెట్టింపు అవుతుందని చెప్పారు.

సీట్లు ఎన్నో తెలియకున్నా...

ఏడు నుంచి పదో తరగతి వరకూ 2018-19 విద్యాసంవత్సరంలో ఎన్ని సీట్లు ఖాళీగా ఉంటాయో ఇప్పటికీ స్పష్టత లేదు. అయినా ఈనాలుగు తరగతులకు (సుమారు 300 సీట్లు) 56,816 దరఖాస్తులు అందాయి. ఏడోతరగతిలో 21,331 దరఖాస్తులు, ఎనిమిదో తరగతిలో 18,112 దరఖాస్తులు, తొమ్మిదో తరగతిలో 13,220, పదో తరగతిలో 4,183 దరఖాస్తులు వచ్చాయి. ఖాళీ సీట్లు తెలియకుండా ఇంత పెద్దమొత్తంలో దరఖాస్తులు రావడం ఆదర్శ పాఠశాలల్లో విద్యానాణ్యతకు అద్దం పడుతోంది.

వచ్చేనెల 15న ప్రవేశపరీక్ష

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఏప్రిల్ 15న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఆరో తరగతి విద్యార్థులకు, ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఏప్రిల్ మొదటివారంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని అధికారులు ప్రకటించారు.

విభజన హామీలపై సుప్రీంలో పిటిషన్

- రెండు వారాలకు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

విభజన చట్టంలో తెలంగాణకు పొందుపరిచిన హామీలను అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం... విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది. విభజన హామీలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి సుప్రీంకోర్టులో ఓ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అశోక్‌భూషణ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది.

పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రవణ్‌కుమార్ వాదించారు. అయితే విభజన చట్టంపై ఇప్పటికే పలు వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి కదా అని ధర్మాసనం ఆరా తీసింది. కాగా గత వ్యాజ్యాలు విభజన చట్టాన్ని సవాల్ చేశాయని, కానీ తాము అమలు చేసేలా ఆదేశించాలని కోరుతున్నామని న్యాయవాది శ్రవణ్ వివరించారు. అయితే చట్టం అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిది కదా అని ధర్మాసనం ప్రశ్నించింది.

ఒకవేళ ప్రభుత్వం తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోతే అందుకు అనుగుణంగా ఆదేశించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుందని శ్రవణ్ తెలిపారు. ఈ సందర్భంగా గతంలోని పలు తీర్పులను చదివి వినిపించారు. దీంతో పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం... వ్యాజ్యం కాపీలను ప్రతివాదులకు అందజేయాలని ఆదేశించింది. కాగా పిటిషన్‌లో విభజన హామీలతో పాటు పోలవరం నిర్మాణంతో భద్రాచలంలో ఏర్పడుతున్న ముంపును సైతం పేర్కొన్నారు.

ది షేప్ ఆఫ్ వాటర్‌కు ఆస్కార్ అవార్డుల పంట



ఉత్తమ దర్శకుడు : గల్లిర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్)



ఉత్తమ నటుడు : గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్)







ఉత్తమ సహాయ నటుడు : సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ)
ఉత్తమ సహాయ నటి: ఆల్లీసన్ జెన్నీ (ఐ, టోన్యా)



ఉత్తమ నటి : ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ)

ఉత్తమ చిత్రం : ది షేప్ ఆఫ్ వాటర్

ప్రపంచ వ్యాప్తంగా సినీ వర్గాలు, సినీ ప్రేమికులు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే 90వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ అవార్డుల వేడుకకు లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా నిలిచింది. మెస్మరైజ్ చేసే రీతిలో రూపొందిన ఆస్కార్ వేదికకు గ్లోబల్ సెలబ్రిటీల అందాలు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ప్రపంచ సినీ తారల సందడితో ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఆద్యంతం అద్భుతంగా జరిగింది. ఉత్తమ చిత్రాల విభాగంలో 9 చిత్రాలు పోటీ పడగా అందులో 'ది షేప్ ఆఫ్ వాటర్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్) ఉత్తమ నటుడిగా, ఫ్రాన్సిస్ మెక్ డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ) ఉత్తమ నటిగా, గల్లిర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్) ఉత్తమ దర్శకుడిగా ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఉత్తమ చిత్రం 'ది షేప్ ఆఫ్ వాటర్'కి ఆస్కార్‌ల పంట పండింది. ఏకంగా నాలుగు పురస్కారాలను దక్కించుకుని ప్రథమ స్థానంలో నిలవగా, 'డన్‌కిర్క్' మూడు అవార్డులతో రెండో స్థానంలో, 'బ్లేడ్ రన్నర్ 2049', 'కో కో', 'డార్కెస్ట్ అవర్', 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' చిత్రాలు రెండు పురస్కారాలతో మూడవస్థానాన్ని సొంతం చేసుకున్నాయి.
ఈ యేడాది కూడా వ్యాఖ్యాతగా జిమ్మీ కిమ్మెల్ వ్యవహరించారు. వరుసగా రెండుసార్లు ఆస్కార్ వేడుకలకు హోస్ట్‌గా నిలిచిన ఘనత జిమ్మీకే దక్కటం విశేషం. తనదైన హాస్య చతురతతో ఆహుతులను ఉత్సాహపరిచారు అంతేకాదు ఆస్కార్ విజేతల పేర్లు ప్రకటించగానే సెలబ్రిటీలు ఎవ్వరూ గబగబా సీట్ల నుంచి లేవకూడదనే సున్నితమైన హెచ్చరిక కూడా చేశాడు. గతేడాది ఆస్కార్ అవార్డుల కార్యక్రమంలో పొరపాటుగా 'లా లా ల్యాండ్'ను ఉత్తమ చిత్రంగా ప్రకటించారు. ఆ తర్వాత 'మూన్‌లైట్' అని సవరించుకున్నారు. ఈ పొరపాటు పునరావృతం కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్టు హోస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు అందాల కథానాయికలు ఆస్కార్ రెడ్ కార్పెట్‌పై భిన్న వస్త్రాలంకరణతో హల్‌చల్ చేస్తూ ఆహుతులను అలరించారు.



ఆస్కార్ వేడుకల్లో ఘన నివాళి పొందిన శ్రీదేవి, శశికపూర్

ఇదిలా ఉంటే, ప్రపంచ వ్యాప్తంగా విశేష అభిమాన గణాన్ని సొంతం చేసుకున్న దివంగత సినీ ప్రముఖులకు ఆస్కార్ వేడుకల్లో నివాళ్ళర్పించే సంప్రదాయం ఉంది. 'ఇన్ మెమొరియం' పేరుతో ఎడ్డీ వెడ్డెర్(పెరల్ జామ్ ఫేమ్) నిర్వహించిన ప్రదర్శనలో దివంగత అంతర్జాతీయ నటీనటులు 'జేమ్స్‌బాండ్' స్టార్ రోజర్ మూరే, మేరీ గోల్డ్‌బెర్గ్, జోహాన్ జోహోన్సన్, జాన్ హెర్డ్, శామ్ షెఫర్డ్‌లకు కూడా ఆస్కార్ వేదికగా నివాళ్ళర్పించడం ఓ విశేషమైతే, ఇందులో భాగంగా మన దేశానికి చెందిన లెజెండ్స్ శ్రీదేవి, శశి కపూర్‌ను కూడా గుర్తు చేసుకోవడం మరో విశేషం. 13 నామినేషన్లతో ఆస్కార్ బరిలో అమీతుమీ తేల్చుకునేందుకు దిగిన 'ది షేప్ ఆఫ్ వాటర్' చిత్రం నాలుగు అవార్డులతో విజయకేతనం ఎగురవేయగా, 8 నామినేషన్లతో 'డన్‌కిర్క్' సినిమా 3, 7 నామినేషన్లతో 'త్రి బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' 6 నామినేషన్లతో 'డార్కెస్ట్ అవర్' చిత్రాలు 2 రెండు పురస్కారాలకు మాత్రమే పరిమితమైపోయాయి. రెండు నామినేషన్లతో ఆస్కార్ బరిలో దిగిన 'ది పోస్ట్' ఒక్క ఆస్కార్‌నూ దక్కించుకోకుండా విశ్లేషకుల అంచనాలను తారుమారు చేసింది.



మనసు పొరల్ని స్పృశించే ది షేప్ ఆఫ్ వాటర్..

1962లో అమెరికాలోని కోల్డ్‌వార్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది. అత్యంత సెక్యూరిటీ కలిగిన బయోలాజికల్ ల్యాబ్‌లో ఎలిసా అనే అనాథ యువతి పనిచేస్తుంటుంది. ఆమె మాట్లాడలేని మూగ. కానీ అమితమైన ప్రతిభ ఆమె సొంతం. ఆ ల్యాబ్‌లో ఓ వింత జీవిపై ప్రయోగాలు చేస్తుంటారు. ఆ జీవి శాస్త్రవేత్త మాట వినదు, కానీ ఎలిసాకు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరి అనుబంధం విడదీయలేనంతగా పెరుగుతుంది. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర, భయానక సన్నివేశాల సమాహారమే ఈ చిత్రం. ఈ ఫాంటసీ డ్రామా చిత్రాన్ని దర్శకులు గుల్లెర్మో డెల్ టోరో రూపొందించారు. గత డిసెంబర్‌లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల అభినందనలతోపాటు విమర్శకుల ప్రశంసలందుకుంది. అంతేకాకుండా కమర్షియల్‌గానూ వరల్డ్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. మనిషికి, మూగ జీవికి మధ్య వైరాన్ని, మనిషిలోని క్రూరత్వాన్ని, మూగజీవిలోని అమాయకత్వాన్ని ఆద్యంతం కళ్లకు కట్టినట్టు ఆవిష్కరించిందీ చిత్రం. ఇందులో వింత జీవి, ఎలీసాల అనుబంధం మనసు పొరల్ని సుతిమెత్తగా స్పృశిస్తుంది. వింత జీవి ప్రేమలో ఎలిసానే కాదు ప్రేక్షకులూ పడిపోతారంటే అతిశయోక్తి లేదు. అంత అద్భుతంగా, హృద్యంగా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించిన వైనానికి నాలుగు ఆస్కార్ అవార్డులు వరించాయి. ఇందులో ఎలీసాగా సాలీ హాకిన్స్ నటన అత్యద్భుతం. ఆమె పడే మానసిక వేదనకు ఎవ్వరైనా సరే కంట తడిపెట్టాల్సిందే. 20 మిలియన్ డాలర్లతో తెరకెక్కి ఏకంగా 114 మిలియన్ డాలర్లను వసూలు చేసిందీ చిత్రం.

నూతన శక్తినిచ్చింది : గ్యారీ ఓల్డ్ మ్యాన్

నాలుగు దశాబ్దాలుగా రాణిస్తున్నప్పటికీ గ్యారీ ఓల్డ్ మ్యాన్ ఉత్తమ నటుడిగా తొలిసారి అవార్డు అందుకోవడం విశేషం. 'డార్కెస్ట్ అవర్'లో మాజీ బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించారు. ఈ అవార్డు అందుకోగానే తన తల్లిని గుర్తు చేసుకుంటూ, ఆస్కార్ అవార్డును ఇంటికి తెస్తానని మా అమ్మ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తోందన్నారు. 'నాకు ఇంతటి గిఫ్ట్‌ను ఇచ్చిన అమెరికాకు థ్యాంక్స్. నేను అమెరికాలో ఎంతో కాలంగా నివసిస్తున్నా. నాకు ప్రేమ, ఉండటానికి ఇల్లు, ఫ్రెండ్స్‌ను ఇచ్చింది. ఇప్పుడు అంతకు మించిన వండర్‌ఫుల్ గిఫ్ట్‌ను ఇచ్చింది. ఈ సినిమా ఓ నూతన శక్తినిచ్చింది. సౌత్ లండన్ నుంచి వచ్చిన యువకుడికి కల నెరవేరింది' అని గ్యారీ ఉద్వేగభరితంగా చెప్పారు.

ప్రతిభను తెలియజేసే అద్భుత అవకాశం : ఫ్రాన్సెస్ మెక్ డోర్మండ్

ఉత్తమ నటి విభాగంలో ఆస్కార్‌ను కైవసం చేసుకున్న ఫ్రాన్సెస్ మెక్ డోర్మండ్ ఈ చిత్రంలో ఓ హత్య కేసులో కూతుర్ని పోగొట్టుకుని న్యాయం కోసం పోరాడుతున్న తల్లి పాత్రలో నటించారు. ఇందులో ఆమె పలికించిన భావోద్వేగాలు, సెంటిమెంట్, సంఘర్షణలు ఆద్యంతం ఆకట్టుకుంటుంది. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా రాణిస్తున్న ఈ అమెరికన్ నటికిది రెండో ఆస్కార్ అవార్డు. గతంలో 1997లో వచ్చిన 'ఫార్గో' చిత్రానికి ఆస్కార్‌నందుకుంది. 'మన ప్రతిభ ఏంటో తెలియజేసే అద్భుత అవకాశమిది. రాబోయే తరానికి నూతనోత్సాహాన్నిస్తుంది' అని ఫ్రాన్సెస్ పేర్కొన్నారు.

కళకి ఏ బేధం లేదు : గల్లీర్మో డెల్ టోరో

ఉత్తమ చిత్రం 'ది షేప్ ఆఫ్ వాటర్'కి గానూ ఉత్తమ దర్శకుడిగా మెక్సికన్ దర్శకుడు గల్లీర్మో డెల్ టోరో ఆస్కార్‌ను అందుకున్నారు. 'ఫిల్మ్ మేకర్ అలెజాండ్రో ఇన్నారిటు, ఆల్ఫోన్సోలాగా నేను కూడా వలస వచ్చిన వాడిని. కానీ కళకి ప్రాంతం, భాష, ఇండస్ట్రీ అన్న భేదం లేదు. ఎక్కడైనా ఆదరణ, మనుగడ సాధిస్తుంది. ఇదొక గొప్ప అంశం. నన్ను, నా సినిమా కథను నమ్మిన ఫాక్స్‌కు, సపోర్ట్ చేసిన టీమ్‌కు, ఫ్యామిలీకి థ్యాంక్స్' అని గల్లీర్మో డెల్ తెలిపారు.

ఆస్కార్ విజేతల వివరాలు..

ఉత్తమ చిత్రం: 'ది షేప్ ఆఫ్ వాటర్'
ఉత్తమ దర్శకుడు: గల్లిర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్)
ఉత్తమ నటుడు: గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్)
ఉత్తమ నటి: ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ)
ఉత్తమ సహాయ నటుడు: సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ)
ఉత్తమ సహాయ నటి: ఆల్లీసన్ జెన్నీ (ఐ, టోన్యా)
ఉత్తమ విదేశీ చిత్రం: 'ఎ ఫెంటాస్టిక్ ఉమెన్' (చిలీ)
ఉత్తమ యానిమేటెడ్ చిత్రం : 'కోకో'
ఉత్తమ యానిమేటెడ్ లఘు చిత్రం : 'డియర్ బాస్కెట్‌బాల్'
ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం : 'ఐకారస్'
ఉత్తమ లఘు చిత్రం: 'హెవెన్ ఈజ్ ఏ ట్రాఫిక్ జామ్ ఆన్ ది 405'
ఉత్తమ లైవ్ యాక్షన్ లఘు చిత్రం: 'ది సెలెంట్ చైల్డ్'
ఉత్తమ ఫొటోగ్రఫీ చిత్రం: 'బ్లేడ్ రన్నర్ 2049'
ఉత్తమ ఎడిటర్ : లీ స్మిత్ (డన్‌కిర్క్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ : మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్)
ఉత్తమ ఒరిజినల్ స్కోర్ : 'ది షేప్ ఆఫ్ వాటర్' (అలెగ్జాండ్రె డెసప్లాట్)
ఉత్తమ ఒరిజినల్ సాంగ్ : 'రిమెంబర్ మీ..' (కో కో)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ : పాల్ డెన్‌హామ్, ఆస్టర్‌బెర్రీ (ది షేప్ ఆఫ్ వాటర్)
ఉత్తమ సౌండ్ మిక్సింగ్ : మార్క్ వీన్‌గార్డెన్, గ్రెడ్ ల్యాన్‌డార్కర్, గ్యారీ ఎ.రిజ్జో (డన్‌కిర్క్)
ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ : అలెక్స్ గిబ్సన్, రిచర్డ్ కింగ్ (డన్‌కిర్క్)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ : జాన్ నీల్సన్, గెర్డ్ నెఫ్జర్, పాల్ లాంబర్ట్, రిచర్డ్ ఆర్.హూవం (బ్లేడ్ రన్నర్ 2049)
ఉత్తమ మేకప్, హెయిర్ ఆర్టిస్ట్ : కజుహిరో సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లైసీ సిబ్లెక్ (డార్కెస్ట్ అవర్)
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే : జేమ్స్ ఐవరీ (కాల్ మి బై యువర్ నేమ్)
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే : జోర్డన్ పీలే (గెటౌట్)

నవచిత్రం

శ్రీదేవిలా మరెవ్వరూ నటించలేరు



జయసుధ, జయప్రద, జీవిత, బాబూమోహన్, కృష్ణంరాజు, రాజశేఖర్, సుబ్బరామిరెడ్డి

'శ్రీదేవి మహానటి. కొన్ని పాత్రలు ఆమె తప్ప మరెవ్వరూ చేయలేరు. నటించిన అన్ని భాషల్లోనూ స్టార్ హీరోయిన్‌గా నిలిచారు. ఆమె మళ్ళీపుట్టాలి' అంటూ తెలుగు సినీ ప్రముఖులు శ్రీదేవి గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు. ఆదివారం టి.సుబ్బరామిరెడ్డి కళా పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శ్రీదేవి సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణంరాజు మాట్లాడుతూ, 'శ్రీదేవి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆమెతో నాలుగైదు సినిమాలు చేశా. నేను ఫోన్ చేయగానే 'బొబ్బిలి బ్రహ్మన్న'లో నటించేందుకు ఒప్పుకుంది. బాగా సపోర్ట్ చేసింది. నన్నెప్పుడూ 'సార్' అని పిలిచేది. పెద్దలంటే అంత గౌరవం. ఆ మధ్య కలిసినప్పుడు 'చిత్ర సీమకొచ్చి నాకు యాభై ఏండ్లు, మీకు యాభై ఏండ్లయ్యాయి, దీన్ని ఓ వేడుకగా జరుపుకోవాలి. నేను తప్పకుండా వస్తా' అంది. అంతలోనే అకాల మరణం..బాధాకరం' అని అన్నారు. 'శ్రీదేవితో నలభై ఏండ్లుగా పరిచయం ఉంది. అలాంటి వ్యక్తి చనిపోయిందని తెలిసి, నాతోపాటు యావత్ భారతదేశం షాక్ అయ్యింది. మంచి నటే కాదు, మంచి హ్యూమన్ బీయింగ్ కూడా. సంప్రదాయంగా ఉండేది. ఆమెతో నేను, యశ్‌చోప్రా కలిసి 'లమ్హే', 'చాందినీ' చిత్రాలు నిర్మించాం. శ్రీదేవికి ఆర్థిక సమస్యలు లేవు. శ్రీదేవి కెరీర్‌లో పుంజుకుంటున్న దశలోనే ఆమె తల్లి చెన్నైలో స్థలాలు కొన్నారు' అని సుబ్బరామిరెడ్డి తెలిపారు. పి.సుశీల చెబుతూ, 'దేవలోకం నుంచి వచ్చిన సుందరిలా మన కళ్ల ముందు కదిలి, మళ్ళీ తన లోకానికి వెళ్లిపోయింది. తన ఎనిమిదేండ్ల వయసులో తనకు నేనొక పాట పాడినందుకు గర్వంగా ఉంది. హీరోయిన్ అయిన తొలి సినిమాకు కూడా నేనే పాట పాడాను' అని చెప్పారు. 'ఓసారి బోనీ కపూర్ ఇంటికెళ్ళితే, ఓ కుర్రాడు టీ తీసుకొచ్చాడు. శ్రీదేవి ఆ కప్పు తీసుకుని నా చేతుల్లో పెడుతుంటే ఆశ్చర్యపోయా, నా మనసులో ఆమెకున్న స్థాయి వేరు. అలాంటిది ఆమె నాకు టీ కప్పు అందించడం ఒప్పుకోలేకపోయా. ఆ విషయం నాతో పాటు వచ్చిన అశ్వనీదత్‌తో చెప్పి కుమిలిపోయా' అని అల్లు అరవింద్ తెలిపారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, మన కళ్ల ముందు నుంచి శ్రీదేవి వెళ్ళిపోవడం అన్యాయం. ఆమెతో రామానాయుడు 'దేవత' సినిమా చేశారు, ఎన్టీఆర్ 'అనురాగ దేవత' చేశారు. అలాంటి దేవత స్వర్ణోత్సవం జరుపుకోవాల్సిన సమయంలో కన్నీటి వీడ్కోలు ఇవ్వాల్సి రావడం బాధాకరం' అని అన్నారు. 'శ్రీదేవితో కలిసి చేసిన దాదాపు పదిహేను సినిమాల్లో మేమిద్దరం పోటా పోటీగా నటించాం. మా మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండేది' అని జయప్రద తెలిపారు. జయసుధ చెబుతూ, 'బాలనటిగా ఉన్నప్పుడు నేను చూసిన మొదటి నటి ఆమె. శ్రీదేవి ప్రతి పుట్టిన రోజుకు చెన్నైకి వెళ్లే వాళ్ళం. ఆమె మరణ వార్త కలచివేసింది. నాకేదో అయిపోతోందన్న భయం వేసి ముంబయికి కూడా వెళ్ళలేదు. టీవీలో ఆమె పార్థివ దేహం చూస్తుంటే చిన్నప్పుడు శ్రీదేవిలా కనిపించింది' అని అన్నారు. 'శ్రీదేవి ప్రతి భారతీయ కుటుంబంలో భాగమైన నటి' అని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగపతిబాబు, శ్రీకాంత్, అలీ, బాబు మోహన్, అమల, జీవిత, నివేదా థామస్, శివాజీ రాజా, సి.కళ్యాణ్ తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.



పూజా హెగ్డే

ఎన్టీఆర్ సరసన..

ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం విదితమే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ(చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఇందులో నటించే కథానాయికగా పూజా హెగ్డేను ఖరారు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, "ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చే సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ కాంబినేషన్‌లో రూపొందే చిత్రాన్ని మా బ్యానర్‌లో నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది. ఎన్టీఆర్ నటించే 28వ చిత్రంగా రూపొందే ఈ సినిమాలో పూజాహెగ్డేను కథానాయికగా ఫైనల్ చేశాం. ఈ చిత్రానికి ఎస్.ఎస్.థమన్ సంగీతం సమకూరుస్తుండగా, పి.ఎస్.వినోద్ కెమెరామెన్‌గా వర్క్ చేస్తున్నారు. ఏప్రిల్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.

ఇవ్వాల్సింది రూ.11 వేల కోట్లు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిధులు, విధులు, అధికారాల విషయంలో రాష్ట్రాలపై పెత్తనం సాగిస్తున్న మోడీ సర్కారు.. నాలుగేండ్లలో తెలంగాణకు అనేకాంశాల్లో మొండి చేయి చూపింది. ముఖ్యంగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో సైతం కోతలు విధించింది. కేంద్ర అమ్మకపు పన్ను (సీఎస్టీ) పరిహారం కింద తెలంగాణకు నాలుగేండ్లలో విడుదల చేసిన నిధుల లెక్కలను పరిశీలిస్తే ఇదే విషయం విదితమవుతున్నది. నాలుగు బడ్జెట్లలో కలిపి మొత్తం రూ.11,443 కోట్లను విడుదల చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ కేంద్రం కేవలం రూ.1,253 కోట్లనే విడుదల చేయటం గమనార్హం. ఇందుకు సంబంధించి 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.919 కోట్లు, 2016-17లో 334 కోట్లను విడుదల చేశారు. ఇవి కాకుండా 2014-15తోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పరిహారాన్ని కేంద్రం ప్రకటించకపోవటం గమనార్హం. మరోవైపు స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి అవసరమైన నిధులు, గ్రాంట్ల విడుదలపై కూడా కేంద్రం శీత కన్నేసింది. తెలంగాణ ఏర్పాటైన తొలి ఏడాది (2014)లో ఈ నిధుల కింద రూ.2,090 కోట్లను ఇచ్చిన కేంద్రం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.1,168 కోట్లనే విడుదల చేసింది. ఇదే విధంగా జాతీయ విపత్తుల నిర్వహణ నిధి (ఎన్డీఆర్ఎఫ్) కింద రాష్ట్రానికి నాలుగేండ్లలో కలిపి రూ.858 కోట్లనే చెల్లించారు.

- ఇచ్చింది వెయ్యి కోట్లు... ●సీఎస్టీ పరిహారం కింద రాష్ట్రానికి కేంద్రం విదిలింపుల తీరిది
- నాలుగేండ్లలో తగ్గుతూ వచ్చిన స్థానిక సంస్థల నిధులు

నాలుగేండ్లలో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు.. వాటి వివరాలు...(రూ.కోట్లలో)

	2014-15	2015-16	2016-17	2017-18 (ఫిబ్రవరి వరకు)	మొత్తం
కేంద్ర పన్నుల్లో వాటా	8,189	12,353	14,876	12,929	48,346
ఎన్డీఆర్ఎఫ్ నిధులు	-	472	328	58	858
స్థానిక సంస్థలకు గ్రాంట్లు	2,090	1,078	1,992	1,168	6,328
విభజన చట్టం ప్రకారం వచ్చిన నిధులు..					
ప్రత్యేక సాయం	-	450	450	450	1,350
కేంద్ర ప్రాయోజిత పథకాలు	5,028	6,047	6,579	5,463	23,116
సీఎస్టీ పరిహారం	-	919	334	-	1,253
పుష్కరాలకు సహాయం	-	111	-	-	111
మొత్తం నిధులు	15,307	21,429	24,560	20,067	81,362

ఓబీ కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి ఓబీ (ఓవర్ బర్డెన్)లో పని చేస్తున్న కార్మికులు వేతనాలు, కార్మిక చట్టాల అమలుకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.మధు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభ ముగింపు సభ సందర్భంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రామికభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణికి లాభాలు రావడానికి ప్రధాన కారణం ఓబీలు అని యాజమాన్యం స్వయంగా ప్రకటించిందని గుర్తుచేశారు. అలాంటి ఓబీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని ఆరు నెలల కిందట నిర్ణయించినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. సీఎంపీఎఫ్, వైద్య సదుపాయం కల్పించకుండా వెట్టిచాకిరీ చేయించడం సరైంది కాదన్నారు. శ్రమ దోపిడీ చేస్తూ అత్యధిక లాభాలు గడిస్తూ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మస్టర్ల ఆధారంగా మెస్, బోనస్‌లను లింకు పెట్టి, క్యాంపుల నిర్వహణలో లోపాలను సవరించకుండా చట్టాలను అమలు చేయకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం సదస్సులో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సభలో కోల్‌బెల్ట్ అన్ని ఏరియాల ఓబీ కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి ఓబీ ఆపరేటర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి

సింగరేణి ఓబీల కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర మహాసభలో సింగరేణి ఓబీ ఆపరేటర్స్ హెల్పర్స్ అండ్ ఆల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బీ.మధు, అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా కలవేణ మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తుల శ్రీనివాస్, మచ్చు కనుకయ్య, మొగిళి, మధూకర్‌రెడ్డి, బీ.క్రాంతి, ఏ.నాగయ్య, సహాయ కార్యదర్శిగా యూ.సదానందం, చందు, రమేష్, కే.శ్రీనుతో పాటు 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎస్‌సీకేఎస్-సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి తెలిపారు.

శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి

- మాజీ మంత్రి బోడ జనార్ధన్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు జైపూర్ పవర్ ప్లాంట్ భూనిర్వాసిలకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి పవర్ ప్లాంట్ ఎదుట ఒప్పంద కార్మికులు, భూ నిర్వాసితులు సోమవారం ఆందోళన చేశారు. వీరికి సీఐటీయూతోపాటు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడ జనార్ధన్ మాట్లాడుతూ.. ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత, భూనిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, సింగరేణి కార్మికులకు చెల్లించే ఇతర అలవెన్స్‌లు కూడా వీరికి చెల్లించాలన్నారు. తెలుగుయువత పార్టీ కార్యదర్శి సంజయ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణురావు, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రిక్కుల మధూకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మంథెన లక్ష్మణ్, భూనిర్వాసితుల కమిటీ అధ్యక్షుడు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-దౌల్తాబాద్ రూరల్

పంట చేతికి రాక, అప్పుల వారి ఒత్తిడి భరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చెల్లాపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాయల చెన్నప్ప(38) తన మూడెకరాల పొలంలో ఉన్న బోరును నమ్ముకొని కంది, వేరుశనగ సాగు చేశాడు. వేసవి మొదట్లోనే బోరులో నీరు అడుగంటి పోయింది. దాంతో పంట పెట్టుబడి కూడా రాని పరిస్థితి. రూ.లక్షకుపైగానే ప్రయివేటు అప్పులున్నాయి. ఐదేండ్ల నుంచి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చెన్నప్ప పొలంలోనే ఉరేసుకున్నాడు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే ఫ్రంట్ డ్రామా

మొదట సీఎం పనితీరుపై చర్చ జరగాలి

- రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు పరామర్శించలేదు? : టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- జైలుకెళ్లకుండా తప్పించుకునేందుకే: షబ్బీర్ అలీ



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న బస్సుయాత్ర నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు, నాలుగేండ్ల తన పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు అంటూ సీఎం కేసీఆర్ కొత్త డ్రామా మొదలుపెట్టారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజాచైతన్య యాత్ర సోమవారం నిజామాబాద్ జిల్లాలో కొనసాగింది. ఆర్మూర్, బాల్కొండ, భీంగల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఉత్తమ్ ప్రసంగించారు. అంతకుముందు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలోనూ మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటును తెలంగాణకు బద్ధవ్యతిరేకి అయిన అసదుద్దీన్ స్వాగితిస్తే, ఓటు ఉందో లేదో తెలియని పవన్ కళ్యాణ్ మద్దతు పలికారని ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్‌కు ఆదివారం తండోపతండాలుగా తరలివచ్చింది జనం కాదని టీఆర్ఎస్ కార్యకర్తలని అన్నారు. నాలుడేండ్లుగా రాష్ట్రంలో అన్నివర్గాలను మోసం చేసిన పెద్ద మనిషి అకస్మాత్తుగా దేశ రాజకీయాల గురించి మాట్లాడటం విచిత్రమ న్నారు. ముందు సీఎం పని విధానంపై చర్చ జరగాలన్నారు. పోడు సాగు చేస్తున్నారని గిరిజనులపై లాఠీచార్జి చేయించి, మిర్చి రైతులకు బేడీలు వేయించిన ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యం గురించి మాటాడటం విడ్డూరంగా ఉందన్నారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.5లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే.. అందులో వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ ఇచ్చేందుకు రూ.5 కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.

రాష్ట్రంలో నాలుగు వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకు ంటే, ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించని కేసీఆర్ ఇప్పుడు దేశంలోని రైతుల ఆర్థిక స్థితి గురించి ఏ అర్హతతో మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్‌తో ఏం ఒరగదని, ఎంపీ సీట్లు కూడా రావని అన్నారు. కేసీఆర్‌ది బోగస్ సర్వే అని, వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు 10సీట్లు కూడా రావని చెప్పారు. రాహుల్ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంద న్నారు. డిసెంబర్‌లో ఎన్నికలు రాబోతున్నా యని చెప్పారు.

జైలును తప్పించుకునేందుకే థర్డ్‌ఫ్రంట్: షబ్బీర్ అలీ

జైలుకెళ్లకుండా తప్పించుకునేందుకే సీఎం కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ ముందుకు తీసుకొచ్చారని కాంగ్రెస్ శాసన మండలిపక్ష నేత షబ్బీర్ అలీ అన్నారు. తెలంగాణలోని వాటర్ గ్రిడ్, ఏపీలోని పోలవరం పనుల్లో జరిగిన అవినీతి చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉందని అన్నారు. దాంతో ఇద్దరు ముఖ్యమంత్రులకు జైలు భయం పట్టుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ చీఫ్ తాహెర్‌బిన్ హందాన్, నాయకులు మహేష్‌కుమార్ గౌడ్, నరాల రత్నాకర్, గడుగు గంగాధర్ పాల్గొన్నారు.

ఆధార్‌కు పెద్దలు 'నో'

(మొదటిపేజీ తరువాయి)

పూర్తయింది. అధికారిక లెక్కల ప్రకారం 73.98 శాతం సీడింగ్ జరిగింది. ఇంకా 26.02 శాతం మేర చేయాల్సి ఉంది. ఈ సంగతిని ప్రధాన భూపరి పాలన కమిషనర్(సీసీఎల్ఏ) కార్యాలయం డైరెక్టర్ వాకాటి కరుణ సైతం ఈ అంశాన్ని ధృవీకరించారు. అయితే అసలు సంగతి ఇక్కడే బయటపడుతున్నది. ఇంకా అనుసంధానం కావాల్సిన 26.02 శాతంలో మరో 10 శాతం మేర సీడింగ్ జరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తు న్నారు. మిగతా 16 శాతం మంది ఆధార్ నెంబరును సీడింగ్ చేయడానికి ముందుకు రాకపోవచ్చని అధికారులు అభిప్రాయపడు తున్నారు. దీనికి కారణం బినామీ భయమేనని తెలిసింది. ఆధార్ నెంబరు ఆధారంగా తమకున్న అక్రమ ఆస్తులు, ఇతరాల బండారం అంతా బయటపడు తుందనే ఆలోచనతోనే సీడింగ్‌కు ఒప్పుకోవడం లేదని తెలిసింది. ఇదిలావుం డగా సీఎం కేసీఆర్ సైతం ఆధార్ నెంబరుతో బినామీలను గుర్తించి, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో పెద్దలంతా వెనక్కి తగ్గారనే ప్రచార మూ చోటుచేసుకుంటున్నది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో రైతు పాసుపుస్తకాల కోసం ఆధార్ సీడింగ్ జరుగు తున్నది. ఆధార్ అనుసంధానం చేసుకోవ డానికి నిరాకరిస్తున్న వారిలో ప్రధానంగా బడా వ్యాపారవేత్తలు, బాబాలు, స్వాములు, అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, విదేశీ యులు, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల ప్రతినిధులు ఉన్నట్టుగా తెలిసింది. ధనిక రైతులు, యంత్రా లతో భారీగా వ్యవసాయం చేసేవారు కూడా ఇందులో ఉన్నారు. వీరంతా ఇబ్బడిముబ్బడిగా రకరకాల మార్గాల ద్వారా సంపాదించిన అక్రమ సొమ్ముతో వ్యవసాయ భూములను కొనడం, వాటిని సాగుచే యడం, ఇతర అవసరాలకు వినియోగించడం చేస్తున్న విషయం విదితమే. దీంతో తమకు రైతు పెట్టుబడి సాయం అవసరం లేదని చెబుతున్నట్టు తెలిసింది. ఆ పేరుతో ఆధార్ నెంబరును ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఈనేపథ్యంలో సీఎం చెప్పినట్టుగా బినామీలను గుర్తించడం సాధ్యం కాదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సీడింగ్ ప్రక్రియను పూర్తిచేసి ఈనెల 7వ తేదీలోగా ఖాతాలపై డిజిటల్ సంతకాలు చేయాలని తహశీల్దార్లకు సీసీఎల్ఏ కార్యా లయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఈనేప థ్యంలో బినామీలు తప్పించుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని సమాచారం.

ఖరారు కాని టెండర్లు

మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పాసు పుస్తకాల పంపిణీ చేస్తామని ముఖ్య మంత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇది ఇప్పుడు జరిగే అవకాశం లేదు. వాయిదాపడే పరిస్థితి కనిపిస్తున్నది. టెండర్ల దాఖలుకు సోమవారం చివరి రోజు కావడం గమనార్హం. కాగా ఒక్క టెండరు కూడా దాఖలు కాలేదు. దీంతో ఈనెల 11న పంపిణీ సంగతి ప్రశ్నార్థకమైంది. ఇప్పటికే పలుమార్లు టెండర్లు వాయిదా పడ్డాయి. రెండు వారాల క్రితం కేంద్ర ప్రభుత్వ సంస్థ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు ముద్రణ బాధ్యతలు అప్పగించారు. దాదాపు 75 లక్షల పాసు పుస్తకాలను ప్రింట్ చేసి ఇవ్వాలని చెప్పారు. అయితే మధ్యలోనే ఆ సంస్థ చేతులెత్తేసింది. బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో ఆ టెండర్లను సీఎం రద్దు చేశారు. కొత్త టెండర్లకు సోమవారం నాటికి తుది గడువు పెట్టారు. అయినా మళ్లీ పాత పరిస్థితి ముందుకొచ్చింది. ముద్రణకు ఏ సంస్థా ముందుకు రాలేదు. ఈనేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో ఏ సంగతి తేలుతుందని అధికారులు చెబుతున్నారు.

దక్షిణ జెగ

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించాయి. ఫలితంగా పెద్దల సభ మొదట రెండు సార్లు వాయిదా పడి.. చివరకు మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం లోక్‌సభ ప్రారంభమైన తరువాత ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీ ఎంపీలకు స్పీకర్ సుమిత్రా మహాజన్ సంతాపం ప్రకటించారు. అనంతరం ప్రశ్నోత్తరాలను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, కవిత, కొండా విశ్వేశ్వరరెడ్డి, నగేష్, బాల్క సుమన్ వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. ముస్లిం రిజర్వేషన్ కోటా పెంచాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఇదే సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలంటూ ఏపీ టీడీపీ ఎంపీలు తోట నరసింహం, శివప్రసాద్, గల్లా జయదేవ్, రవీంద్రబాబు తదితరులు వెల్‌లో నినాదాలు చేశారు. టీడీపీ ఎంపీలు గీత, ఖురాన్, బైబిల్ చేతపట్టి నిరసన తెలిపారు. అదే సమయంలో కావేరీ జల వివాదంపై తమిళనాడు ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో ఐదు నిమిషాల వ్యవధిలోనే సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. అనంతరం ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ ఇదే తంతు...

రాజ్యసభ ప్రారంభమైన తరువాత ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీలకు ఛైర్మన్ వెంకయ్యనాయుడు సంతాపం ప్రకటించారు. అనంతరం ప్రశ్నోత్తరాలు ప్రారంభించగానే అన్నాడీఎంకే ఎంపీలు, టీడీపీ ఎంపీలు, కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు రాజ్యసభ పోడియంలోకి వెళ్లి నినాదాలు చేశారు. ఏపీకి న్యాయం చేయాలంటూ కేవీపీ ప్లకార్డు పట్టుకుని ఛైర్మన్ పోడియం వద్ద నిల్చున్నారు. అయితే ఇదే సమయంలో పీఎన్‌బీ స్కాంపై చర్చ జరపాలని కాంగ్రెస్, ఎస్పీ, సీపీఐ(ఎం), సీపీఐ నోటీసులు ఇచ్చాయి. అయితే అన్ని విషయాలపై చర్చకు అనుమతిస్తానని, నోటీసులు 267 నిబంధనలో కాకుండా మరో విధంగా అందజేయాలని విపక్షాలకు వెంకయ్యనాయుడు సూచించారు. ఇదే సమయంలో మాజీ మంత్రుల బంధువుల అవినీతిపై చర్చ జరపాలంటూ పరోక్షంగా కార్తీ చిదంబరం వ్యవహారంపై బీజేపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. వెంకయ్యనాయుడు ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ టీడీపీ, అన్నాడీఎంకే, కాంగ్రెస్, ఇతర పక్షాల ఎంపీలు ఒక్కసారిగా నినాదాలు చేయడంతో సభను మొదట 11.20 నిమిషాలకు ఆపై మధ్యాహ్నం రెండు గంటలకు ఛైర్మన్ వాయిదా వేశారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశమైనప్పటికీ ఎంపీలు ఆందోళన కొనసాగించడంతో సభను డిప్యూటీ ఛైర్మన్ కురియన్ మంగళవారానికి వాయిదా వేశారు.

తెల్లధనం దేశం దాటిస్తున్నారు : మోడీపై కాంగ్రెస్ చురకలు

విదేశాల నుంచి నల్లధనం తీసుకొస్తానని ప్రధానమంత్రి హామీనిచ్చారని కానీ నేడు దేశం నుంచి తెల్లధనం విదేశాలకు పోతోందని రాజ్యసభా విపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఎద్దేవా చేశారు. మధ్యాహ్నం సభ ప్రారంభమైన తరువాత పీఎన్‌బీ స్కాంపై ఆయన మాట్లాడారు. ఈ అంశంపై చర్చకు అనుమతించాలని, ఇందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 'బ్యాంకుల్లో ఒకదాని తరువాత ఒకటి కోట్లాది రూపాయల మోసం జరుగుతోంది. ఒకరి తరువాత ఒకరు వ్యాపారవేత్తలు కోట్లాది డబ్బుతో విదేశాలకు పారిపోతున్నారు.

జతిన్ మెహతా నుంచి నీరవ్ మోడీ వరకు ఈ కుంభకోణాలు జరిగాయి. ఒక్కరూ తిరిగి దేశానికి రావడం లేదు. మొత్తం బ్యాంకులు ఖాళీ అవుతున్నాయి. కానీ కేంద్ర సర్కారు ఒక్కరిని కూడా పట్టుకోవడం లేదు. ఇది అసమర్థ ప్రభుత్వం. నియంత్రిత సర్కారు' అని విమర్శించారు.

జిమ్నాస్టిక్ అరుణారెడ్డికి ఛైర్మన్ అభినందనలు

2018 జిమ్నాస్టిక్ ప్రపంచకప్‌లో కాంస్య పతకం సాధించిన అరుణాబుద్ధారెడ్డికి రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు. రాజ్యసభ ఉదయం ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. ఈ టోర్నమెంట్‌లో పతకం సాధించిన మొదటి క్రీడాకారిణిగా ఖ్యాతి గడించారని కొనియాడారు. అరుణారెడ్డి సాధించిన విజయం దేశానికి గర్వకారణంగా ఛైర్మన్ కొనియాడారు. అలాగే ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు, వెండి పతకాలు సాధించిన నవజోత్‌కౌర్, వినేష్‌ఫోగట్‌కు ఛైర్మన్ అభినందనలు తెలిపారు.

రైతన్న కన్నెర్ర

నవతెలంగాణ-అచ్చంపేట/జగిత్యాల

ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నారు. మార్కెట్లలో పడిగాపులు కాయలేక...మార్కెట్ అధికారులు-కమీషన్ల ఏజెంట్లు కుమ్మక్కై రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటకు ధర తెగ్గోస్తుంటే తట్టుకోలేక రైతన్నలు ఆందోళన బాట పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల దోపిడీని ప్రశ్నిస్తూ 200 మందికిపైగా రైతులు శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై మూడుగంటల పాటు రాస్తారోకో చేశారు. వేరుశనగ పంటకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మార్క్‌ఫెడ్ అధికారులు, దళారులు కుమ్మక్కై అడ్డగోలు కొర్రీలు పెడుతుండటంతో కందిరైతులు ఆగ్రహించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తాళం వేసి అక్కడే బైటాయించారు. అచ్చంపేట మార్కెట్‌లో మార్కెట్ అధికారులు, కమీషన్ ఏజెంట్లు కలిసి వేరుశనగ పంటకు తక్కువ ధరను నిర్ణయిస్తున్నారు. పంట నాణ్యతను చూడకుండానే రూ.4 వేల క్వింటా అయితే కొంటాం? లేకపోతే లేదు అని చెబుతున్నారు. దీంతో200 మంది రైతులు స్వచ్ఛందంగా అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో మహబూబ్‌నగర్-శ్రీశైలం ప్రధాన రహదారిపై భైటాయించారు. వేరుశనగలకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. మార్కెట్‌లో రైతులను పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేరుశనగ దిగుబడికి క్వింటాలుకు రూ. 6వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నాయకులు మల్లేష్, శంకర్‌నాయక్ రైతుల ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెబుతూ మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన రుణాలు ఇవ్వకుండా.. పండించిన పంటలకు మద్దతు ధర కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నెల రోజుల్లో అచ్చంపేటలో మూడుసార్లు వేరుశనగ రైతులు ఆందోళన చేసినా...అధికారులు, వ్యాపారుల తీరులో ఏ మార్పు లేదన్నారు. మార్కెట్ కార్యదర్శి సరోజ, పోలీసులు రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పి ఆందోళన విరమించారు. దీంతో రైతులు మార్కెట్‌కు వెళ్లారు. అక్కడా సుమారు 2 గంటల పాటు ఆందోళన చేపట్టారు. సంబంధిత మార్కెట్ చైర్మెన్ పోషం జయంతి అందుబాటులో లేరు. దీంతో చైర్మెన్ భర్త పోషం గణేష్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు సోమవారం రాత్రి వరకు ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వం మార్కెట్ యార్డుల ద్వారా మార్క్‌ఫెడ్ గిట్టుబాటు ధర క్వింటాల్‌కు రూ.5,400 చొప్పున కొనుగోలు చేయడానికి జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన 6 కంది కొనుగోలు కేంద్రాలను గతనెల 28న మూసివేసింది. తరువాత మార్కెట్‌కు కందులు తీసుకొచ్చిన రైతుల వద్దనుంచి మార్క్‌ఫెడ్ అధికారులు, దళారులు కలిసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరకు రూ.2వేలు తక్కువగా అధికారులే దగ్గరుండి దళారులకు అమ్మిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరకే కందులు కొనుగోలు చేయాలని చెప్పినా మార్క్‌ఫెడ్ నాణ్యత లేవని సాకు చూపుతూ పరోక్షంగా దళారులకు అమ్మే విధంగా సహకరిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన కందిరైతులు మార్కెట్ యార్డుకు తాళం వేసి రోడ్డుపై బైటాయించారు. దాదాపు వంద మంది రైతులు నిజామాబాద్ జాతీయ రహదారిపై దాదాపు 2 గంటల పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కంది రైతులు మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు తేదీని పొడగించాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మార్కెట్‌ఫెడ్ అధికారులతో మాట్లాడించి ఆందోళన విరమింపజేశారు.

గత నెల 28నే కేంద్రాలు ఎత్తివేత : మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక

జగిత్యాల జిల్లాలో కంది రైతులు పెద్దగా లేరు. పక్క జిల్లాల నుంచి రైతులు జగిత్యాల మార్కెట్‌కు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో కంది కొనుగోలు కేంద్రాలను ఎత్తేశాం. చక్కదిద్ది కొనుగోలు చేసే అర్హత రాష్ట్ర పరిధిలో లేదు. ఇది తెలియకుండా జిల్లా బీజేపీ నాయకులు కంది రైతులను రెచ్చగొట్టి రోడ్డెక్కించారు. కేంద్ర ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రాలను ఇంకా నాలుగు నెలలు పొడిగించినా తమకేమీ అభ్యంతరం లేదు.

వ్యవసాయానికి 'ప్రత్యేకం' లేదు

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఇతరత్రా ప్రణాళికలు, వివరణలన్నీ పద్దుల కిందకే వస్తాయి కానీ ప్రత్యేక బడ్జెట్ కింద పరిగణించడానికి వీలులేదని అధికారులు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒకసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు వివాదాస్పదమైంది. కేంద్రంలో కూడా రైల్వే బడ్జెట్‌ను ప్రధాన బడ్జెట్‌లోనే కలిపి ప్రవేశపెడుతున్న విషయాన్ని సీఎంకు అధికారులు వివరించారు. దీంతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలన్న ఆలోచ నను విరమించుకున్నట్టు సీఎం ప్రకటించారు. బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగా నికి ఇస్తున్న ప్రాధాన్యతను, ప్రవేశపెడుతన్న పథకాలను, ఖర్చు చేస్తున్న నిధుల ను వివరించాలని సీఎం చెప్పారు. మంత్రులు టి. హరీశ్‌రావు, పోచారం శ్రీనివా స్‌రెడ్డి, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉభయ సభల్లో చీఫ్ విప్‌లు పి. సుధాకర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ ముఖ్య సలహా దారు రాజీవ్‌శర్మ, ఆర్థిక సలహాదారు జీఆర్. రెడ్డి, ముఖ్య కార్యదర్శులు ఎస్. నర్సింగ్‌రావు, రామకృష్ణారావు, పార్థసారధి, వ్యవసాయ, హార్టికల్చర్ కమిష నర్లు జగన్‌మోహన్, వెంకట్రామ్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

హస్తం వైపే కోదండరామ్

జి.వేణుమాధవరావు

టీజేఏసీ ఛైర్మెన్ కోదండరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటుకాబోతున్న తెలంగాణ జన సమితి(టీజేఎస్) పార్టీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీతో కలిసి వెళ్లడానికి రంగం సిద్ధం చేసుకున్నది. దీనికి సంబంధించి ఇరు పార్టీల మధ్య పొత్తులు కుదిరాయి. ఎన్నెన్ని సీట్లల్లో పోటీ చేయాలో కూడా ఒక అంచనాకు వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఢిల్లీ స్థాయిలోనే ఈ పొత్తులకు బీజం పడినట్టు ఆ పార్టీల నేతలు అంతర్గత చర్చల్లో వెల్లడైంది. ఇంకా తెలంగాణ ఇంటిపార్టీ, మరికొన్ని పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసేందుకు ఇప్పటికే అంగీకారం తెలిపినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలుంటే, అందులో కాంగ్రెస్‌పార్టీ 85 స్థానాలు, టీజేఎస్ 15 లేదా 20, తెలంగాణ ఇంటిపార్టీ ఒకటి లేదా రెండు, ఇతరులు మరికొన్ని స్థానాల్లో పోటీ చేయడానికి కూడా పొత్తులు కుదిరినట్టు తెలిసింది. మిగిలిన స్థానాలను సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది. అయితే ఇవి ప్రాథమిక చర్చలు మాత్రమేనని, ఇంకా సమయం ఉన్నందున చివరలో సీట్ల లెక్కల్లో కొన్ని మార్పులు జరగొచ్చని కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఒక నేత వ్యాఖ్యానించారు. పొత్తు దాదాపు ఖాయమైనట్టేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. ఎన్నికలకు ముందు కూటమి పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో కాంగ్రెస్‌పార్టీ ముందుకుపోతున్నది. దీనికోసం ఇప్పటికే ఆ పార్టీ తరపున అనేక కార్యక్రమాలు చేపట్టింది. కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం, ముఖ్యంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూచనలతో రాష్ట్ర నేతలు తమతమ స్థాయిల్లో అడుగులు వేసుకుంటూ పోతున్నారు. అదే సందర్భంలో ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లడానికి కాంగ్రెస్‌పార్టీ జాతీయ నాయకత్వం ఇష్టపడటం లేదు. మరికొన్ని పార్టీలను కలుపుకు పోవాలని ఆదేశించింది. తెలంగాణలో ఉన్న నేతల వల్లే అధికారంలోకి రాలేకపోయామన్న భావన కాంగ్రెస్ పార్టీ అధిష్టానంలో ఉంది. దీంతో ఢిల్లీ వేదికగానే రాష్ట్రం నిర్ణయాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న శక్తులనూ, తమతో కలిసివచ్చే వారిని కూడగట్టేపనిలో రాష్ట్రనేతలు సిద్ధమయ్యారు. మొదట కోదండరామ్‌ను కాంగ్రెస్‌పార్టీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా, ఆయన సున్నితంగా తిరస్కరించారు. పార్టీ పెట్టకుండా, కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ఇవ్వాలని అనేకమార్లు కోదండరామ్‌తో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి, మరికొందరు చర్చలు జరిపారు. కాంగ్రెస్‌పార్టీ హైకమాండ్ జోక్యం చేసుకుంది. అయితే టీజేఏసీలో సభ్యుల ఒత్తిడి మేరకు సొంతంగా పార్టీ పెట్టేందుకు కోదండరామ్ మొగ్గు చూపారు. పార్టీ పేరు, గుర్తు కోసం ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. అధికారికంగా ఈ నెల పదో తేదీన కోదండరామ్ తెలంగాణ జన సమితి(టీజేఎస్ పేరు) పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. పార్టీ పెట్టినా కాంగ్రెస్‌పార్టీతో కలిసిరావాలని కాంగ్రెస్ పార్టీ నేతలు కోదండరామ్‌కు ఆహ్వానం పంపారు. చర్చలూ జరిపారు. ఇటీవల తన అన్న కుమారుడు వివాహం కార్డు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి కోదండరామ్‌ను కలిశారు. ఒంటరిగా వెళ్లడం వల్ల ఓట్లు చీలి టీఆర్ఎస్‌పార్టీకి లాభం కలుగుతుందని, కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కలిసి రావాలని రేవంత్ చెప్పినట్టు తెలిసింది. దానికి ఆయన వెంటనే సుముఖత వ్యక్తం చేయకపోయినా సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిసింది. పార్టీ పెడితే చాలామంది వచ్చి కలుస్తారని కోదండరామ్ ఆశించారు. చాలామంది టచ్‌లో ఉన్నారని చెప్పినా, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్‌పార్టీల నుండి ముఖ్యనేతలు రావడానికి సుముఖత చూపలేదని తెలిసింది. సీట్లు రాకపోతే చివరి సమయంలో గోడ దూకుదాంలే అన్న రీతిలో కొంతమంది నేతలు ఉన్నారు. టచ్‌లో ఎవరున్నారనేది కూడా తమకు తెలియదని, చెప్పిన వారు కూడా బహిరంగంగా వచ్చేందుకు సిద్ధంగా లేరని టీజేఏసీలోని ఒక సభ్యుడు తెలిపారు. దీంతో కాంగ్రెస్‌తో కలిసి వెళ్లేందుకు కోదండరామ్ సిద్ధపడ్డారని ప్రచారం జరుగుతున్నది.

అమెరికా పర్యటనలో ఎన్‌ఆర్‌ఐలు కూడా కాంగ్రెస్‌పార్టీతో కలిసి వెళ్లాలని కోదండరామ్‌కు సూచించినట్టు తెలిసింది. సీట్ల విషయంలో కోదండరామ్ 25 స్థానాలు అడగగా, 15 స్థానాలకు ఇచ్చేందుకు కాంగ్రెస్‌పార్టీ మొగ్గు చూపింది. బలమైన నేతలు ఉంటే అదనంగా మరికొ న్ని స్థానాలు ఇవ్వడానికి కూడా సిద్ధమేనని కూడా ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఇప్పుడెన్ని చర్చలు జరిగినా, ఎవరెవరు ఎక్కడెక్కడ పోటీ చేయాలన్న దానిపైనే అసలు సమస్య ఉంటుందని, చివరిలో లెక్కలు కూడా తారుమారు కావొచ్చని, ఏదైనా జరగొ చ్చని కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఒక నేత తెలిపారు.

అలాంటి ఉద్దేశం లేదు

అధికారపార్టీలో అసంతృప్తిలో ఉన్న ఒక ఎమ్మెల్యేను ప్రశ్నించగా, అలాంటి ఉద్దేశం ఏమీ లేదని ఆయన వివరణ ఇచ్చారు. తనంటే గిట్టనివారు, వ్యతిరేకించేవారే తన గురించి అలాంటి ప్రచారం చేసి ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నాయకుడు కేసీఆరే అని, ఆయన ఎక్కడ పోటీ చేయమంటే అక్కడికి పోవాల్సిందేనని చెప్పారు.

బాలికపై సామూహిక లైంగిక దాడి

(మొదటిపేజీ తరువాయి)

తలపై మోదాడు. దీంతో మహిళ అపస్మారక స్థితి వెళ్లింది. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నర్సింహారెడ్డి ఘటనా వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని టీచర్స్ కాలనీకి చెందిన బాలిక(15) అదే కాలనీలో ఓ టైలరింగ్ షాపులో పని నేర్చుకుంటోంది. అక్కడే సనా అనే అమ్మాయి పరిచయమైంది. ఇంద్రవెల్లికి చెందిన రాథోడ్ సంజీవ్ బాలికకు ఆదివారం మధ్యాహ్నం ఫోన్‌చేసి సనా తమ వద్దనే ఉంది రమ్మని చెప్పాడు. అతని మాటలు నమ్మి రిమ్స్ ముందు స్టార్ మెడికల్ షాపు వద్దకెళ్లింది. అప్పటికే పథకం ప్రకారం ఆదిలాబాద్‌కు చెందిన గండ్రత్ సంతోష్ తన స్విఫ్ట్ కారుతో సిద్ధంగా ఉన్నాడు. ఆయనతో పాటు ఉట్నూర్‌కు చెందిన కల్లూరి విశాల్, ఇంద్రవెల్లికి చెందిన కాంద్రల్‌వార్ విజయ్‌ప్రకాష్ కారులో కూర్చున్నారు. బాలికకు మాయమాటలు చెప్పి గండ్రత్ సంతోష్‌కు చెందిన ఫాంహౌజ్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఆమెతో బలవంతంగా మద్యం తాగించారు. నలుగురు ఒకరి తర్వాత మరొకరు లైంగిక దాడి చేశారు. లేవలేని స్థితిలో ఉన్న బాలికను అక్కడే వదిలేసి వెళ్లారు. బాధితురాలు 100కు ఫోన్ చేసి విషయం చెప్పింది. వన్‌టౌన్ సీఐ సురేష్, ఎస్ఐ ఎంఏ బాకీ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. ఎస్పీ విష్ణు ఎస్.వారియర్ ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలి వాంగ్మూలం మేరకు ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో నిందితులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై నిర్భయ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చుతామని డీఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ, ఎస్ఐని ఎస్పీ అభినందించారు. అమీన్‌పూర్ ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన మహిళ (30) బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ప్రాంతానికి వచ్చి అడ్డా కూలీగా బతుకు వెళ్లదీస్తోంది. సోమవారం పని కోసం కూకట్‌పల్లి అడ్డాకు వచ్చింది. ఓ వ్యక్తి పని ఇప్పిస్తానని చెప్పి అమీన్‌పూర్ పరిధిలోని లాలాబాయి కాలనీలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు.

అనంతరం ఆమెపై లైంగిక దాడి చేసేందుకు యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో బండరాయితో తలపై మోదాడు. తీవ్రగాయాలపాలైన మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దుండగుడు పరారయ్యాడు. అటుగా వెళ్లిన కొందరు ఆమెను గమనించి పోలీసులకు సమాచారమివ్వగా వారు ఘటనాస్థలికి చేరుకుని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మహిళ నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సెన్సెక్స్ ▼ 300
33,746

నిఫ్టీ ▼ 99
10,358


డాలరుకు రూపాయి విలువ
65.11



బంగారం(10.గ్రా)
రూ. 31,208



వెండి (కేజీ)
రూ. 41,600



కోడిగుడ్లు			
హైదరాబాద్	345	విజయవాడ	340
ఒక్కగుడ్డుకు	4.5	చెన్నై	395
వరంగల్	347	ముంబయి	390



ఆధార్ పేరుతో మరింత ఒత్తిడి తేవొద్దు..

- ఖాతాల అనుసంధాన గడువు పెంచాలి: అసోచామ్

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలను ఆధార్ నంబరుతో అనుసంధానం చేసుకునే గడువును పెంచాలని పరిశ్రమ సమాఖ్య అసోచామ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో కుంభకోణం నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో ఆందోళనలు పెరిగాయని.. వరుస బ్యాంక్ మోసాల నేపథ్యంలో మరోవైపు బ్యాంకు ఉద్యోగులపై కూడా తీవ్ర ఒత్తిడి నెలకొన్నట్టుగా ఆసోచామ్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఆధార్ గడువు ముగింపు పేరుతో వారిని మరింత ఆందోళనకు గురి చేయడం సరికాదని పేర్కొంది. ఆధార్ అనుసంధానగడువు తేదీని పెంచితే బాగుంటుందని అసోచామ్ అభిప్రాయపడింది. పీఎన్‌బీ కుంభకోణం తర్వాత బ్యాంకులు తమ కార్యకలాపాలను పటిష్ట పరుచుకొనే పనిలో నిమగ్నమై ఉన్నాయని.. ఈ సమయంలో ఆధార్ అనుసంధానం వంటి ప్రక్రియలతో బ్యాంకులపై ఒత్తిడి పెంచడం సరికాదన్న అసోచామ్ అభిప్రాయపడింది.

'పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే బయట పడుతోందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకుల్లో ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మార్చి 31లోగా ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయడం అనేది కష్టతరమని పేర్కొంది. అందువల్ల గడువును పెంచితే మంచిది' అని అసోచామ్ ఓ ప్రకటనలో తెలిపింది.

యార్సెలర్ 'మిట్టల్'కు వారసుడొచ్చాడు

- ఆదిత్యకు యార్సెలర్ గ్రూపు అధ్యక్ష బాధ్యతలు



లక్సెంబర్గ్: ప్రపంచ ఉక్కు దిగ్గజం యార్సెలర్ మిట్టల్ అధ్యక్ష బాధ్యతలను కంపెనీ చైర్మెన్ లక్ష్మి మిట్టల్ కుమారుడు ఆదిత్య మిట్టల్(42) చేపట్టారు. ఆదిత్య మిట్టల్ ఇప్పటికే యూరప్ గ్రూప్ సీఈవో, సీఎఫ్‌వోగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. కొత్త బాధ్యతలు ఇందుకు అదనమని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నియామకం ద్వారా సంస్థ చైర్మెన్ అండ్ సీఈవో లక్ష్మి మిట్టల్‌కు భారీ మద్దతు లభించనుందని సంస్థ పేర్కొంది. యార్సెలర్ మిట్టల్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 దేశాల్లో తన కార్యకలాపాలను విస్తరించి ఉంది.. పారిశ్రామికంగా దాదాపు 18 దేశాల్లో తనదైన రీతిలో రాణిస్తూ వస్తోంది. యూరప్ కార్యకలాపాల సీఈవోగా మేటిగా రాణిస్తూ ఆదిత్య ఇప్పటికే గ్రూపు కార్యకలాపాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకోవడంతో ఆయనకు సంస్థ అధ్యక్ష పదవి చేరువైనట్టుగా సమాచారం. ఆదిత్య నియామకంపై లక్ష్మి మిట్టల్ స్పందిస్తూ గ్రూపు భవిష్యత్‌కు వ్యూహాత్మక దిశను రూపొందించడంలో తన కుమారుడు తనతో కలిసి పని చేస్తారని ప్రకటించారు.ప్రధాన ప్రపంచ ఉక్కు మార్కెట్లకు ఆటోమోటివ్, నిర్మాణ, గృహోపకరణం, ప్యాకేజింగ్ సహా నాణ్యమైన ఉక్కును సరఫరా చేయడంలో యార్సెలార్ మిట్టల్‌కు విశ్వ వ్యాప్తగా మంచి పేరుంది.

మార్కెట్‌లో ఆల్టోది అదే జోరు..



న్యూఢిల్లీ: సామాన్యుడి కారుగా మార్కెట్లో తన సత్తా చాటుతున్న మారుతీ ఆల్టో సరి కొత్త మైలురాయిని చేరింది. ఈ కారు మొత్తం ఏకీకృత అమ్మకాలు 35 లక్షల మైలు రాయిని దాటేశాయి. గత 14 ఏండ్లుగా దేశీయ మార్కెట్లో అత్యధికంగా అమ్ముడవుతున్న కారుగా ఆల్టో తన సత్తాను చాటుతూనే వస్తోంది. ఈ మోడల్ కార్ల విక్రయాల్లో 2017-18లో దాదాపు ఆరు శాతం వృద్ధి నమోదైనట్టుగా మారుతీ తెలిపింది. మారుతీ ఆల్టో కారు తన సెగ్మెంట్‌లో 33% వాటాను సొంతం చేసుకున్నట్టుగా కంపెనీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017-18లో) తొలిసారిగా కారును కొనుగోలు చేసిన వారిలో 55 శాతం మంది ఆల్టోనే ఎంపిక చేసుకోవడం విశేషమని ఆ సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆర్.ఎస్.ఖాల్సీ తెలిపారు. 25 శాతం మంది కొనుగోలుదారులు తమకు ఉన్న కారుకు అదనంగా ఆల్టోను జత కూర్చుకున్నారని ఆయన వివరించారు. 2006 నుంచి ఆల్టో ప్రతీ రెండేండ్లకు 5 లక్షల కొత్త వినియోగదారులను ఆకర్షిస్తోందని ఖాల్సీ వివరించారు.

మహీంద్రా నుంచి 'టూరర్'..



ముంబయి: యువతలో టూరింగ్ ఔత్సాహికుల విస్తృత రైడింగ్ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా మరో స్పెషల్ ఎడిషన్ బైక్‌ను సోమవారం మార్కెట్లోకి ఆవిష్కరించింది. టూరింగ్ ఔత్సాహికులకు దృష్టిలో ఉంచుకొని సంస్థ తమ పాపులర్ మోడల్ మోజో నందు ప్రీమియం స్పోర్ట్స్ టూరర్ స్పెషల్ ఎడిషన్ బైక్‌ను అందుబాటులోకి తెచ్చిది. 'మోజో యూటీ -300' పేరుతో ఈ 300 సీసీ బైక్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధరను కంపెనీ రూ.1.49 లక్షలు (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ)గా నిర్ణయించింది. దీనికి తోడు ఆకర్షణీయమైన లాంచింగ్ ఆఫర్ కూడా కంపెనీ ప్రకటించింది.300 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్, కాంపాక్ట్ డిజిటల్ ప్యానెల్, కార్బ్యురేటర్ ఫ్యూయల్ సిస్టం, 17 అంగుళాల ట్యూబ్‌లెస్ టైర్లు, 21 లీటర్ల సామర్థ్యంతో కూడిన ట్యాంక్ ఈ బైక్‌లోని ప్రధాన ఫీచర్లు. దేశవ్యాప్తంగా 60 నగరాల్లో విస్త తంగా ఈ స్పెషల్ ఎడిషన్‌ను అందుబాటులో ఉంచామని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది.

సరికొత్త రూపంలో శాంత్రో...!



న్యూఢిల్లీ: దేశ చిన్న కార్ల విభాగంలో రారాజుగా వెలుగొందిన హ్యుందాయ్ శాంత్రో కారు కొత్త రూపంలో మార్కెట్లోకి రానుంది. ఒకప్పుడు చిన్న కార్ల విభాగంలో మారుతీ ఆల్టో కారుకు గట్టి పోటీనిచ్చిన శాంత్రో పాపులర్ మోడల్‌ను.. తిరిగి మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు హ్యుందాయ్ సన్నద్ధమవుతోంది. వచ్చే దీపావళి పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఏడాది ఆగస్టు నాటికి కొత్త శాంత్రోను హ్యుందాయ్ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. 'ఏహెచ్2' సాంకేతిక నామంతో ఈ కొత్త శాంత్రోను హ్యుందాయ్ రూపొందిస్తోంది. దీని ధర సుమారు రూ.3 లక్షల లోపే ఉండే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఐ10 ప్లాట్‌ఫామ్ ఆధారితంగా ఇది మార్కెట్‌లోకి రానుంది. 860 సీసీ ఇంజన్ 70బీహెచ్‌పీ పవర్, 100 ఎన్ఎం టార్క్యూతో ఈ కొత్త శాంత్రో మార్కెట్లోకి రానుందని సమాచారం. ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ, 5 స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్ విధానంలో కారు అందుబాటులోకి రానున్నట్టుగా తెలుస్తోంది.

మార్కెట్లకు 'ట్రేడ్ వార్' భయాలు

- వెలవెలబోయిన లోహ రంగ షేర్లు
- ఇబ్బంది పెట్టిన ఇటలీ పరిణామాలు
- 300పాయింట్ల మేర కుంగిన సెన్సెక్స్
- 10,359కు పడిపోయిన ఎన్ఎస్ఈ నిఫ్టీ




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలలో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు చేసిన ట్రేడ్‌వార్ ప్రకటన భయాలకు తోడు ఇటలీలో అనిశ్చితి, ప్రపంచ దేశాల్లో స్టాక్స్ పడిపోవడం, దేశీయంగా సేవా రంగం కుంచించుకుపోనుందంటూ వచ్చిన వార్తలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. లోహ, చమురు, ఇంధన, ఆటోమొబైల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు నష్టాల్లో సాగడంతో సోమవారం స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. సోమవారం ఉదయం 200 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఆద్యంతం నష్టాల్లోనే కదలాడిన మార్కెట్లు ట్రేడింగ్ ముగిసే సమయానికి దాదాపు 1 శాతం నష్టపోయాయి. బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 300 పాయింట్ల మేర నష్టపోయి 33,747 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 99 పాయింట్లు కంగి 10,359 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాల్లో ముగిసినట్టయింది. అమెరికాలో కంపెనీలను కాపాడుకొనేందుకు ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాల్ని భారీగా పెంచనున్నట్టుగా అగ్రరాజ్యం ప్రకటించిన నేపథ్యంలో లోహ షేర్లు వెలవెల బోయాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ దాదాపు 3.28% మేర నష్టపోయింది. జిందాల్ స్టీల్ అండ్ పవర, జిందాల్ స్టెయిన్‌లెస్, సెయిల్ స్టాక్‌లు భారీగా నష్టపోయాయి. మరోవైపు ఆటో రంగపు షేర్లు కూడా భారీగానే పడిపోయాయి. ఈ రంపు సూచీ దాదాపు 1.57% మేర కుంగింది. టాటా మోటార్స్, మదర్సన్ సమీ సిస్టమ్స్ తదితర స్టాక్స్ నష్టాలను మూటగట్టుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేవనెత్తిన ట్రేడ్‌వార్ చర్చతో ప్రపంచ మార్కెట్లలో గుబులు నెలకొంది. ట్రేడ్ వార్‌పై చైనా సీరియస్ అవ్వడంతో ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనన్న భయం ప్రపంచ మార్కెట్లను వెంటాడింది. జపాన్ నిక్కీ 0.7 శాతం నష్టపోగా.. ఆసియా పసిఫిక్ జోన్‌లోని ఇతర మార్కెట్లు దాదాపు 0.8 శాతం వరకు కుంగాయి. దక్షిణ కొరయా సూచీ కోస్పీ 1.1 శాతం మేర కుంగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 65.09 దరిదాపుల్లో కొనసాగింది. ఎన్ఎస్ఈలో టెక్‌మహింద్రా, సన్‌ఫార్మా, టీసీఎస్, ఎన్టీపీసీ, యూపీఎల్ లిమిటెడ్ షేర్లు లాభపడగా.. టాటామోటార్స్, హిందాల్కో, అరబిందో ఫార్మా, టాటాస్టీల్, రిలయన్స్ షేర్లు నష్టపోయాయి. టాటామోటార్స్ ఒక్కో షేరు విలువ 5 శాతానికి పైగా పతనమైయ్యాయి.

విపణిలోకి టాటా జెస్ట్ ప్రీమియో



ముంబయి: ఆటోమొబైల్స్ తయారీ దిగ్గజం టాటా మోటార్స్ కాంపాక్ట్ సెడాన్ 'జెస్ట్'లో ప్రత్యేక ఎడిషన్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్ 'జెస్ట్ ప్రీమియో' పేరుతో లాంచ్ అయిన ఈ కొత్త కారులో 13 అదనపు ఫీచర్లను జోడించినట్టుగా కంపెనీ తెలిపింది. ఈ కొత్త ఎడిషన్ ప్రారంభ ధర రూ.7.53లక్షలు (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ). దేశంలోని అన్ని టాటా మోటార్స్ రిటైల్ షోరూమ్‌లలో మార్చి 1నుంచి ఈ కొత్త కారు అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. కస్టమర్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా తాము తీసుకొచ్చిన స్పెషల్ ఎడిషన్ ప్రీమియో తప్పక వినియోగదారులను ఆకట్టుకుంటుందని కంపెనీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. డ్యూయెల్ టోన్ రూఫ్, ఎక్స్‌టీరియర్ మిర్రర్స్, డాష్‌బోర్డ్ లాంటి కొత్త ప్రీమియం ఫీచర్లతో పాటు నాలుగు సిలిండర్ డీ 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్, 74 బీహెచ్‌పీ, 190 ఎన్ఎం టార్క్, 5-స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్ ప్రధాన ఫీచర్లుగా ప్రీమియో మార్కెట్లోకి వచ్చింది.

రెండు బ్యాంకులపై ఆర్‌బీఐ సీరియస్



న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకుల్లో పరిపాలనా లోపాల కారణంగా రోజుకో స్కామ్ వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో.. బ్యాంకుల పెద్దన్న భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) రెండు దిగ్గజ బ్యాంకులకు షాక్ ఇచ్చింది. నిర్ధిష్ట నిబంధనలు పాటించని కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ 'ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్' (ఐవోబీ), ప్రయివేటు బ్యాంకింగ్ దిగ్గజం 'యాక్సిస్ బ్యాంక్'లకు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఖాతాదారు గురించి తెలుసుకోవడం (కేవైసీ) సంబంధించిన నిబంధనలు పాటించని కారణంగా ఐవోబీకి రూ.2 కోట్ల జరిమానాను విధించింది. ప్రభుత్వ యాజమాన్యం లోని ఈ బ్యాంకు అంతర్గత తనిఖీ నివేదిక సహా.. సంబంధిత పత్రాల పరిశీలన అనంతరం ఆర్‌బీఐ ఈ మేరకు ఉత్తర్వులను జారీచేసింది. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) అంచనాలకు సంబంధించిన విషయమై పారదర్శకత లోపం కారణంగా యాక్సిస్ బ్యాంక్‌కు ఆర్‌బీఐ రూ.3 కోట్ల పెనాల్టీని విధించింది.

15 నుంచి ఒంటిపూట బడులు

- సర్కారుకు ప్రతిపాదన పంపిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాలల్లో ఒంటిపూట బడుల నిర్వహణపై విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు కదిలారు. రాష్ట్రంలో ఈనెల 15 నుంచి ఒంటిపూట తరగతులను నిర్వహించాలనే ప్రాతిపాదనను ప్రభుత్వానికి పంపించారు. 'ఒంటిపూట బడులు ఉంటాయా..?' శీర్షికతో ఫిబ్రవరి 28న నవతెలంగాణ కథనాన్ని ప్రచురించింది. దీనిలో ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులను అధికారులు పక్కన పెడుతున్నారనీ, ఒంటిపూట బడుల నిర్వహణపై ఆలోచన కూడా చేయడం లేదని వివరించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం...ఎండల తీవ్రత నేపథ్యంలో ఒంటిపూట బడుల ప్రాతిపాదనలు పంపించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

హైస్కూల్ విద్యార్థినులకు సైకిళ్లు!

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్కారు బడుల్లో చదివే విద్యార్థినులకు సైకిళ్లు అందించాలని పాఠశాల విద్యాశాఖ సమాలోచనలు చేస్తున్నది. ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి పాఠశాలలకు నుంచి వస్తున్న 8,9,10 తరగతుల విద్యార్థినులకు వీటిని అందించాలని నిర్ణయం తీసుకున్నది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎంతమంది ఉంటారనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రాతిపాదననూ త్వరలో ఢిల్లీలో జరిగే ప్లానింగ్ అప్రూవల్ బోర్డు(పీఏబీ)లో పెట్టనున్నారు. బాలికల విద్య అభివృద్ధిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాన్ని కేంద్రం ఆమోదిస్తుందనే ఆశాభావం అధికారుల్లో ఉంది. అయితే కేంద్రం ఆమోదం తెలిపితేనే విద్యార్థినులకు సైకిళ్లు అందేది.

ప్రజలకు కేసీఆర్ మోసం : చంద్రకుమార్

నవతెలంగాణ-నల్లగొండ రూరల్

ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని తెలంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జస్టిస్(రిటైర్డ్) చంద్రకుమార్ విమర్శించారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 ఏండ్ల కాలంలో దొరల పార్టీలు, అవినీతి పార్టీలే పరిపాలన చేశాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తగిన టీచర్లు, వాటర్, టాయిలెట్లు లేవన్నారు. వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. సాంబశివగౌడ్, నల్లగొండ అంజి, వాసు, సైదులు, ఓర్సు వెంకన్న, శిరసవాడ నర్సింహ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిధుల్లేక వర్సిటీలు నీరసం

- నెల రోజుల్లో రూ.279 కోట్లు ఖర్చయ్యేనా...
- కేటాయించినవీ విడుదల చేయని సర్కారు
- రూ.420 కోట్లలో రూ.141 కోట్లే ఖర్చు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల ఉనికి దిగజారుతున్నది. సర్కారు చిన్నచూపుతో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నిధుల కొరతతో విశ్వవిద్యాలయాలు విలవిల్లాడుతున్నాయి. 2017-18 బడ్జెట్‌లో విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.420.85 కోట్లు కేటాయించింది. ఆ నిధులు కాగితాలకే పరిమితమయ్యాయి. 2017, ఏప్రిల్ 1 నుంచి 2018, ఫిబ్రవరి నాటికి 11 నెలల్లో 141.26 (33.57 శాతం) కోట్ల నిధులే ఖర్చయ్యాయి. కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.279.59 (66.43 శాతం) కోట్లు విడుదల కావాల్సి ఉంది. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.420 కోట్లు కేటాయించిన గొప్పగా చెప్పే ప్రభుత్వ పెద్దలు వాటిని విడుదల చేయించడంలో శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. 11 నెలల్లో విడుదల కాని నిధులు రూ.279 కోట్లు నెలరోజుల్లో ఖర్చవుతాయా?అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కేటాయించిన వాటిలో సగం నిధులూ ఖర్చయ్యే అవకాశం కనిపించడం లేదు. విశ్వవిద్యాలయాల్లో జీతాలు ఒకటో తారీఖు ఇవ్వకుండా ఆలస్యంగా ఇవ్వడమే నిధుల కొరతకు తార్కాణం. వర్సిటీల్లో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా ఒకటో తారీఖున జీతాలు అందుతాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల విశ్వవిద్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి జనవరి వేతనాలు ఫిబ్రవరి 8న అందడం గమనార్హం. ఇక విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, ల్యాబ్‌ల ఆధునీకరణ, తరగతి గదులు, హాస్టళ్ల మరమ్మతుల పనులూ, కొత్త పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్లు కొన్ని పనులు పూర్తి చేసినా సకాలంలో నిధులు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఓయూలో రూ.50 కోట్లే ఖర్చు



విశ్వవిద్యాలయాలకు సంబంధించి బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో) ఇచ్చినా ట్రెజరీ శాఖ ఫ్రీజింగ్ విధిస్తున్నది. దీంతో విశ్వవిద్యాలయాల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే సాగుతున్నది. విశ్వవిద్యాలయాలకు రూ.420.85 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. వాటిలో రూ.171.74 (40.81 శాతం) కోట్లకు బీఆర్‌వోలు ఇచ్చింది. రూ.249.11 కోట్లకు ఇంకా బీఆర్‌వోలు విడుదల చేయాల్సి ఉంది. బీఆర్‌వోలలో రూ.141.26 కోట్లు మాత్రమే వర్సిటీలకు విడుదలయ్యాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. కానీ రూ.80 కోట్లకు బీఆర్‌వోలు ఇచ్చినా, రూ.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఓయూ పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నదో అర్థమవుతున్నది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి రూ.40 కోట్లు కేటాయించినా, రూ.12 కోట్లకు బీఆర్‌వోలు వచ్చాయి. కానీ ఆ వర్సిటీ అభివృద్ధికి ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం గమనార్హం. శాతవాహన విశ్వవిద్యాలయానికి రూ.20.85 కోట్లు కేటాయించినా, రూ.7.57 కోట్లకు బీఆర్‌వో వచ్చింది. కానీ రూ.5.46 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి.



విశ్వవిద్యాలయాలకు కేటాయించిన నిధులు, ఖర్చు వివరాలు (కోట్లలో)

విశ్వవిద్యాలయం	కేటాయింపు	ఖర్చు
ఓయూ	రూ.200	రూ.50
కేయూ	రూ.50	రూ.20
ఎస్‌యూ	రూ.20	రూ.5.46
ఎంజీయూ	రూ.40	రూ.0
టీయూ	రూ.30	రూ.28.09
పీయూ	రూ.40	రూ.15
జేఎన్టీయూహెచ్	రూ.-	రూ.-
జేఎన్ఏఎఫ్ఏయూ	రూ.-	రూ.-
ఆర్జీయూకేటీ	రూ.-	రూ.-
బీఆర్ఏఓయూ	రూ.20	రూ.10
పీఎస్‌టీయూ	రూ.20	రూ.12.71
మొత్తం	420.85	రూ.141.26


ఇలా అన్ని వర్సిటీలదీ ఇదే పరిస్థితి. నిధుల కొరత సమస్య తీవ్రంగా వేధిస్తున్నది.

సాంకేతిక వర్సిటీలకు నిధులేవీ?

రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాలున్నాయి. అందులో మూడు సాంకేతిక విశ్వవిద్యాలయాలు. వాటికి ప్రస్తుత బడ్జెట్‌లో అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కేటాయించలేదు. జేఎన్టీయూ హైదరాబాద్, ఆర్జీయూకేటీ, జేఎన్ఏఎఫ్ఏయూలకు అభివృద్ధి నిధుల్లేకపోవడంతో కునారిల్లుతున్నాయి. సాంకేతిక విశ్వవిద్యాలయాలకు వచ్చే బడ్జెట్‌లోనైనా అభివృద్ధి నిధులు కేటాయిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇతర సాధారణ విశ్వవిద్యాలయాలకు కేటాయించిన నిధులు సకాలంలో విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని అధ్యాపక, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రగతిభవన్ ముట్టడి ఉద్రిక్తం

- బీజేపీ నేతల అరెస్టు
- లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, రాజాసింగ్ హౌస్‌అరెస్ట్
- సీఎం ఎక్కడికెళ్లినా అడ్డుకుంటాం : లక్ష్మణ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఇచ్చిన 'ప్రగతి భవన్ ముట్టడి' ఆందోళనా కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆపార్టీ రాష్ట్ర అధ్య క్షులు డాక్టర్ కె లక్ష్మణ్, శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్‌లను ఉదయం 8 గంటలకే హౌస్ అరెస్ట్ చేశారు. మరో ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి ఆటోలో ప్రగతి భవన్ వద్దకు వెళ్తుండగా పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకొని అరెస్టు చేసి, గోషామహల్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి తదితరుల్ని పంజాగుట్టలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద అడ్డుకొని అరెస్టులు చేశారు. ఎమ్మెల్సీ ఎన్ రాచంద్రరావును ముందస్తుగా అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేవైఎంకు కార్యకర్తలు కొందరు ఆర్టీసీ బస్సుల్లో వచ్చి, అకస్మాత్తుగా ప్రగతిభవన్ గేట్లను దూకి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అలర్ట్ అయ్యారు. వారందరినీ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రగతి భవన్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. చిక్కడపల్లిలోని తన కార్యాలయంలో ఉన్న ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌ను పోలీసులు బలవంతంగా ఆయన ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నిరంకుశ, నియంతృత్వ నిజాం నవాబుకు... సీఎం కేసీఆర్‌కు ఎలాంటి తేడా లేదని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తున్న తమను, కార్యకర్తల్ని అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ క్షమాపణలు చెప్పే వరకు తమ పోరాటం ఆగదని, సీఎం ఎక్కడికి వెళ్లినా బిజెపి కార్యకర్తలు అడ్డుకుంటారని లక్ష్మణ్ హెచ్చరించారు.

కేసీఆర్‌ను వదిలేద్దాం..

ప్రధాని మోడీని అవమానిస్తూ తానేమి మాట్లాడలేదని సీఎం కేసీఆర్ పదేపదే చెబుతున్నందున..ఇకపై ఆవిషయాన్ని వదిలేయాలని బీజేపీ రాష్ట్ర కోర్‌కమిటీ సమావేశం నిర్ణయించింది. సోమవారం జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో తాజా రాజకీయపరిస్థితులను సమీక్షించారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేయటానికే సీఎం కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ డ్రామా ఆడుతున్నట్టు సమావేశం అభిప్రాయపడింది. దీంతోపాటు పలు అంశాలను చర్చించింది.

టీఆర్ఎస్ హయాంలోనే రైతుల ఆత్మహత్యలు : టీడీపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎల్.రమణ విమర్శించారు. వారి సమస్యలను పరిష్కరించి ఆత్మహత్యల నివారణలో సీఎం కేసీఆర్ ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ సంగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. తాజా రాజకీయాలు, రైతుల ఆత్మహత్యలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జిలను నియమించాలని అధినేత చంద్రబాబు చెప్పారని అన్నారు. రెండు, మూడు నెలల్లో పార్టీ నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించినట్టు వివరించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు సమదూరం పాటించనున్నట్టు చెప్పారు. ఎన్నికల సమయంలోనే పొత్తుల గురించి ఆలోచిస్తానన్నారు.

సార్వత్రిక సంస్కృతి అనేది ఉంటుందా?

ప్రవర్తన, సాంఘిక సంబంధాలు, మానవ నిర్మితాలైన భౌతిక వస్తువులు సంస్కృతి విషయాలు కావు. వీటికి సంబంధించిన ఆకృతులు, సూత్రాలు, నియమాలు, ప్రమాణాలు, విలువలు మాత్రమే సంస్కృతికి ఇటు కలవుతున్నాయి. అంతేకాక ఆకృతుల సమగ్రాకృతులు (గోస్టల్ట్) సంస్కృతి విషయం అవుతున్నాయి. ఉదాహరణకు వివిధ సమాజాలు స్వాగతం పలికే తీరు చూడండి. ఫ్రెంచి దేశీయుడు బుగ్గపై ముద్దుపెట్టి, ఆంగ్లేయుడు కరచాలనం చేసి, భారతీయుడు తలను వంచి నమస్కరిస్తూ స్వాగతం పలుకుతారు. సన్నివేశం ఒక్కటే. లక్ష్యం ఒక్కటే. కానీ ప్రవర్తనా రీతులు వేరు. కాబట్టి సంస్కృతి విషయాల సమగ్రాకృతినే గ్రమించాలి.

ఇక్కడ ఆకృతికి, ఆ ఆకృతిని నింపే పదార్థానికి ఉన్న సంబంధాన్ని వివరించడం అవసరం. ప్రపంచంలో ప్రతి వస్తువుకు పదార్థమూ ఉంది; ఆకృతీ ఉంది. ఈ రెండు లేని వస్తువే లేదు. ఉదాహరణకు ఖడ్గాన్ని తీసుకొంటే ఉక్కు దాని పదార్థం అవుతుంది. దాని ప్రత్యేక రూపం దాని ఆకృతి అవుతుంది. అదే ఆకృతి తో అంటే ఆకారం మారిపోకుండా రాగి, ఇత్తడి వంటి లోహాలతో, పదార్థాలతో ఖడ్గాన్ని మలచవచ్చు. ఇక్కడ ఖడ్గం చేయబడిన పదార్థం మారినా, దాని ఆకారం మారలేదు. అయితే ఖడ్గం ఉదాహరణను చివరికంటా సాగదీయరాదు. అట్లాగే సాంస్కృతిక ఆకృతులకు కూడా పదార్థం ఉంది. సమాజాల్లో మానవుల మధ్య 'వాస్తవంగా' అంటే వస్తుగత ప్రవర్తనా రీతులు మనకు ఆచార వ్యవహారాల్లో, వేష భాషల్లో, స్వాగత సత్కారాల్లో, ఆహార విహారాల్లో దర్శనమిస్తాయి. ఇవి సరళ రీతులు. ఇంతకంటే సంక్లిష్ట వస్తుగత రీతులు మనకు ఆర్థిక, రాజకీయ విధానాల్లో, మతం, తత్వం, చట్టం వంటి వాటిలో కనిపిస్తాయి.

పదార్థం మారినా ఖడ్గాకృతి ఎట్లా మారలేదో, సంస్కృతి విషయం (పదార్థం) మారినా, సాంస్కృతిక ఆకృతి అదేవిధంగా మారదు. అయితే ఈ మారకపోవడం శాశ్వతం అని భ్రమించరాదు. ఇదెట్లా సాధ్యమవుతున్నది? సంస్కృతికి సంబంధించిన వైయక్తిక విషయాలలో (పదార్థంలో) మార్పులు వచ్చినప్పుడు ఆ మార్పుల్లో తనకనుగుణమైన వాటిని అనుమతించి మిగతావాటిని వదిలివేస్తుంది సాంస్కృతికాకృతి.



మానవుని సృజనాత్మకత మన చుట్టూ ఉన్న పరిసరాన్ని, జీవ పదార్థ పరిమితులను అధిగమించడం వల్లనే సాంస్కృతికాకృతులు సాధ్యమయ్యాయి. అయితే ఈ సందర్భంలో మానవులు, మానవ సమూహాలు జరిపిన ప్రతి చర్య వల్లనే సంస్కృతి ఏర్పడిందని, జీవ, మనోవిజ్ఞాన, భూగోళ శాస్త్రాలు దీని ప్రారంభాలని మరిచిపోరాదు. ఇవి సంస్కృతి ప్రారంభాలే కాని నిర్ణాయకాలు కావు. వివిధ సంస్కృతుల సామాన్య లక్షణాలతో 'సార్వత్రిక సంస్కృతి (యూనివర్సల్ కల్చర్) జనించింది. ప్రతి సమాజానికి ఏదో ఒక నీతి అంటూ ఉంటుంది. మంచి చెడులను గురించిన అభిప్రాయాలు ఉంటాయి. సంఘం మనుగడ వ్యక్తి ప్రాణం కంటే ముఖ్యం. అందుకే ఏ సమాజమూ హత్య, లైంగికదాడి అగమ్య గమనాన్ని అనుమతించదు. ఇట్లా జన్మించిన సార్వత్రిక సంస్కృతి తన ముడిపదార్థాలైన మానవ సంబంధాల, ప్రవర్తనల, ఆకృతుల, నిర్మితుల నుంచి దూరంగా జరిగి వేరే అస్తిత్వాన్ని ఏర్పరచుకొంది. సంస్కృతి శాస్త్రం (కల్చరాలజీ) దీనిని వేరే సత్వం (ఎంటిటీ)గా పరిగణిస్తున్నది. ఈ సత్వం తనను తాను క్రమబద్ధం చేసుకొంటుందని, తన అంతర్గత గతిశీలత ప్రకారం అధిగమిస్తుందని, తనపై ఆధిపత్యం తనే వహిస్తుందనీ, తన నిర్ణయాలను తనే తీసుకొంటుందనీ, దాని పరిణామ సూత్రాలు దానికి ఉన్నాయని, అలాంటిది ఒక్కటేననీ, మరొకటి లేదనీ, అది "స్వయంభువు" అని సంస్కృతి శాస్త్రం అంటున్నది. దీనిని అరవింద్ ఘోష్ ప్రతిపాదించిన "జ్యాత్యాత్మ" (నేషన్ సోల్) లాగ, మెక్‌డొవల్ "సమూహ మనస్సు" (గ్రూప్ మైండ్)లాగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఈ సార్వత్రిక సంస్కృతిలో ఏవైనా మార్పులు జరిగితే ఆ మార్పులను అంతర్గత కారణాలతో వివరించవలసిందే తప్ప, జైవ, మానసిక, భౌగోళిక కారణాలతో వివరించడానికి వీలులేదు. ప్రస్తుత పరివర్తనం అతడు ముందున్న (తన) లక్షణాలమీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత లక్షణం తరువాత మార్పుకు కారణమవుతుంది. ప్రస్తుత భాషారూపం ఇంతకు ముందరి రూపం నుంచి ఎలా జనించిందో, ప్రస్తుత భాషా రూపం తరువాతి భాషారూపానికి ఎలా కారణమవుతుందో సంస్కృతి విషయంలోను అంతే. మానవ ప్రవర్తనను సంస్కృతి క్రమబద్ధం చేస్తే మరి సంస్కృతిని ఎవరు క్రమబద్ధం చేస్తారు? తనను తానే క్రమబద్ధం చేసుకొంటుందని సంస్కృతి శాస్త్రం అంటున్నది.

-ఎ.వి.రెడ్డి





కొనసాగుతున్న ప్రాచీన సంస్కృతి

ప్రకృతి శక్తులను దేవుళ్లు, దేవతలుగా భావించడం ప్రారంభించిన దగ్గరి నుంచి మనిషి తన దైనందిన జీవితంలోని అనేక సందర్భాలలో వాటిని పూజించడం ఆనవాయితీ అయింది. మానవుడు వ్యవసాయం చేయడం ప్రారంభించిన తర్వాత, అంతకు ముందు కూడా చెట్లు మొక్కల నుంచి లభించే కాయలు, పండ్లు, గింజలు దేవుడు తమకిచ్చిన ఆహారంగా భావించేవాడు. అందుకే అడవుల్లో రుతువుల ప్రకారం కాసే కాయలు, పండ్లు, కూరగాయలను ఒక పండుగ లేక జాతర నిర్వహించి దేవునికి అర్పించిన తరువాతే మానవులు వినియోగించుకోవడం ఒక ఆచారంగా మొదలు పెట్టారు. అదేవిధంగా గింజలు, మొక్కలు నాటేటప్పడు, పంటను కోసేటప్పుడు కూడా దేవతలను కొలిచికానీ పని ప్రారంభించేవారు కాదు. పైన పేర్కొన్న ఈ ఆచారాలు ఇప్పటికీ ఆదివాసీల్లో చూడవచ్చు. అయితే ఆదివాసీల్లో ఉన్నంత పెద్ద ఎత్తున ఇటువంటి ఆచారాలు మైదాన ప్రాంతాల్లో లేనప్పటికీ కొంతమేర తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రాచీన ఆచార సంప్రదాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. అందుకు మచ్చుకు కొన్ని వ్యవసాయ సంబంధిత బోనాలెత్తడం సాక్ష్యంగా చూపవచ్చు.



విత్తనాలు చల్లి నారుమడులు తయారు చేయడానికి నాందిగా అలుకుడు బోనమెత్తడం తెలంగాణ పల్లెల్లో సాధారణ దృశ్యంగా కనిపిస్తుంది. పొలంలో పని ప్రారంభించాలనుకున్న రోజు ఇంటిదగ్గర ఒక కుండలో అన్నం వండి దాన్ని ఒక తట్టలో పెట్టుకొని పొలం తీసుకువస్తారు. తరువాత ఎండిపోయిన ముండ్లు ఉన్న ఊడుగు కొమ్మను తెచ్చి దాని ముండ్లకు బంతిపూలు చెక్కుతారు. ఆ కొమ్మను రొప్పిన మడి ఒడ్డుకు దగ్గరగా సాయను ఆనుకొని ఉండేలా పాతుతారు. అయిదు పలుగు రాళ్లను ఏరుకొచ్చి కడిగి నూనెరాసి పసుపు, కుంకుమ అద్ది ఆ పాతిన కొమ్మ మొదట్లో పెడతారు. మొలక ధాన్యాన్ని తీసి పూదిచ్చిన పలుగురాళ్ల దగ్గర అయిదు కుప్పలు, పోత లింగనివద్ద అయిదు కుప్పలు, మైసమ్మ దగ్గర అయిదు కుప్పలు పోసి దండం పెడతారు. నెయ్యి, పెరుగు కలిపిన అన్నాన్ని పూదించిన పలుగురాళ్లకు నైవేద్యం పెడతారు. గొంగట్లో విప్పిన మొలకలను పోసుకొని రైతు మొలకలు చల్లుతాడు. నైవేద్యంగా పెట్టిన అన్నాన్ని అలుకుడు చెయ్యడానికి వచ్చిన స్త్రీలు తింటారు. మొలక అలికిన రైతు మాత్రం ఆ అన్నాన్ని తినకూడదని అంటారు.

ఇక నారుమడి నుంచి నారును పీకి చేలో నాటిన రెండు నెలల్లోనే పంట బాగా దుబ్బుచేయడం ప్రారంభమవుతుంది. పంట మొక్కలతో పాటు కలుపు మొక్కలు కూడా పెరుగుతాయి. ఈ కలుపును తీస్తే తప్ప పంటలు బాగా పండవు. కాబట్టి కలుపు తీయడానికి పూనుకుంటారు. ఇట్లా కలుపు తీసే రోజున కూడా బోనం వండుతారు. సున్నంతో పూదిచ్చిన కుండలో అన్నం వండి తెచ్చి, ఆ అన్నంలో పెరుగు, నెయ్యి కలిపి చేనుదగ్గర నైవేద్యం పెడతారు. కలుపు తీయడానికి వచ్చిన స్త్రీలు ఆ అన్నాన్ని తిని పనికి ఉపక్రమిస్తారు.

ఇక రేపో మాపో పంట చేతికి వస్తుందనగా గానీ, లేక చేను ఇంకా పచ్చగానే ఉన్నప్పుడు కాని రైతులు 'పొలి' చేస్తారు. అంటే గొర్రెను మైసమ్మకు బలివ్వడమన్నమాట. ఈ ఆచారం ప్రకారం ముందుగా రజకుణ్ణి (చాకలిని) తీసుకొని రైతు గొల్ల లేక కురుమవారి దగ్గరికి పోయి ఒక గొర్రెను ఎంచుకుంటాడు. ఆ గొర్రెను ఇంటికి చేర్చే బాధ్యత చాకలివానిదే. పొలిరోజునాడు చాకలి స్త్రీ తన ఇంటి నుంచి పచ్చి సున్నం ముద్దను రైతు ఇంటికి తీసుకువస్తుంది. రైతు ఇంటి నుంచి బోనం వండటానికి కావలసిన బియ్యం, నూనె, పసుపు, కుంకుమ తీసుకొని మైసమ్మ గుడికి పోతుంది. అక్కడ సున్నం పూసిన బోనంలో అన్నం వండుతుంది. మిగిలిన సున్నాన్ని మైసమ్మగుడికి పూదిచ్చి పసుపు కుంకుమలతో బొట్లు పెడతారు. మైసమ్మ విగ్రహం ఉండకపోవడం విశేషం. రాయినే దేవతగా పూజిస్తారు. మంద నుంచి తెచ్చిన గొర్రె ముఖాన్ని కల్లుతో కడిగి పసుపు, కుంకుమలు బొట్లుగా పెట్టి, మెడలో వేప మండల దండ వేస్తారు. పచ్చిమోదుగు ఆకులపై నిప్పులు వేసి వాటిపై నూనె వేసి గొర్రెకు పొగపడతారు. ఆ తరువాత చాకలి వ్యక్తి గొర్రె తలను కోస్తాడు. యాట తలను గుడి ముందు కొద్దిసేపు ఉంచుతాడు. అట్లాగే బోనం పెట్టి నైవేద్యం సమర్పిస్తారు. యాట కార్జాన్ని నిప్పులపై కాల్చి మైసమ్మకు నైవేద్యంగా పెడతారు. కొంత రక్తాన్ని అన్నంలో కలిపి దాన్ని తట్టలో పెట్టుకొని పొలం తీసుకుపోతాడు ఆ చాకలి వ్యక్తి. ఈ అన్నాన్నే 'సర్వు' అంటారు. పొలం చుట్టూను, పొలంలోను సర్వు వేస్తాడు. ఇట్లా చేయడం వల్ల పంట ఎక్కువవుతుందని రైతుల నమ్మకం.

అదే రోజు రైతు పనిపాటలవారిని పిలిచి 'బొట్టు' పంచుతాడు. పొలి చేసుకున్న రైతుల్లో కొందరు యాట మాంసాన్ని ఇంటిదగ్గర వండుకుంటే మరికొందరు బాయిదగ్గరనే వంట చేసి , మైసమ్మకు, పోతలింగనికి నైవేద్యం పెడతారు. అట్లాగే పనివారినందరినీ భోజనాలకు పిలుస్తారు. ఈ పొలి కార్యక్రమం వల్ల దేవత దీవెనార్తి లభిస్తుందని రైతులు నమ్ముతారు.

ఇట్లా తెలంగాణలో ప్రాచీన కాలపు ఆచార సంప్రదాయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ విధంగా మన సంస్కృతి అతి ప్రాచీనతను కలిగి ఉందని చెప్పవచ్చు.

-శివ



ప్రకృతి-కళ



కళ బాహ్యప్రకృతికి ప్రతికృతి కాదు. అట్లాగని అంతర్జగత్తుకూ ప్రతికృతి కాదు. ఈ రెండింటి సమ్మేళనమే కళ. కళలో కల్పన, వాస్తవం ఏ మేరకు ఉండాలనేది కళాకారుని అభిరుచిమీద ఆధారపడి ఉంటుంది. కళ ప్రారంభించుట వాస్తవ వాదం (రియలిజం)లో; వికసించుట ఆదర్శవాదం (ఐడియలిజం)లో; పరిణతి చెందుట కల్పనావాదంలో. మొదటి దశలో ప్రకృతికిని, కళకును విరోధం లేదు. రెండోదశలో సగం విరోధము. మూడవ దశలో ప్రకృతికిని, కళకును పూర్ణ విరోధము. ప్రకృతి అనునునది సంస్కారం లేని అస్తవ్యస్థమైన ముడి పదార్థం. కాబట్టి దాని అనుకరణ కళకు హానికరం. అయినప్పటికీ ప్రకృతి అసంఖ్యాక రూపములను ప్రతిపాదించునది కనుక కళాకారునికి ప్రకృతిని పూర్తిగా పక్కన పెట్టడం కూడా హానికరమే. కళాకారుడు ఈ విషయంలో మధ్యేమార్గమును అనుసరించడం శ్రేయస్కరం.

నిజానికి సకల రూపములకు, వర్ణములకు, నాదములకును, గతులకును కూడా మూలం ప్రకృతియే. ఇందులో సందేహం లేదు. నిజానికి ఇవన్నీ కళలో సృష్టిస్తున్నారు. కళాకారుడు సృష్టించినవాటిని కాస్త జాగరూకతతో పరిశీలించినప్పుడు ప్రకృతిలోనే వీటి మూలం ఉన్నట్లు అర్థమవుతుంది. అయితే ప్రకృతిలోని వివిధ అంశాలకు కళాకారుడు సృష్టించినవి ప్రతిబింబాలు కాదు. ఇవి స్వతంత్ర అస్తిత్వాలను కలిగి ఉంటాయి. కళ తన స్వతంత్ర రూపములను రచించుకుంటున్నది. కనుక ప్రకృతిలో లేని పూర్ణత కళలో లభిస్తున్నది. దేనిని ప్రకృతి చేయలేదో దానిని కళ నెరవేరుస్తుంది.

ప్రాచీన కాలం నుంచి మానవుడు ప్రకృతిని జయించవలెనని విశ్వ ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. కానీ ఆ ప్రయత్నంలో పూర్తిగా విజయం సాధించాడని మాత్రం చెప్పలేం. ప్రకృతి శక్తులకు మానవుడు తలవంచక తప్పదు. ఎండ, వాన, ఉరుములు, మెరుపులు, భూకంపాలు, సునామీలకు మనిషి వణికిపోతూనే ఉన్నాడు. అయితే కళాకారుడు ప్రకృతిలోని రూపముల మీదను, వర్ణముల మీదను, నాదముల మీదను, గతుల మీదను ఆధారపడకుండా, తన సొంతమైన వానిని సృజిస్తూనే ఉన్నాడు. కానీ అవి ప్రకృతిలోని ఏదో ఒక చోట దానితో సారూప్యతను కలిగే ఉంటున్నాయి. ఈ సారూప్యం రూపంలోను, నాదంలోను అంతగా లేకపోయినను, వర్ణములలో ఉండక తప్పటంలేదు. ప్రకృతి అంతా అన్ని దేశాల్లో, అన్ని ప్రాంతాలలో ముడిపదార్థంగానే ఉండదు. ఒక్కొక చోట, ఒక్కొక్క వేళ నిర్మిత కళారూపమున గూడా అది గోచరించును. ఇటువంటి ప్రకృతిని అనుకరించి రచించిన కళాకృతి కూడా అందంగానే ఉంటుంది.



అక్కడ భాగస్వాములను మార్చుకుంటారు!

మెండీ ప్రజలు పపువా న్యూగినియాలోని మెండీ లోయలో నివసిస్తారు. హంగల్ హెనెన్గ్ అనే భాషను ఎక్కువమంది మాట్లాడుతారు. తమ తెగ లేక వంశానికి సంబంధించినవారినే కాక బయటి వారినీ వివాహమాడతారు. పెండ్లిలో పెద్ద మొత్తంలో వధూవరుల కుటుంబాల మధ్య బహుమతులను ఇచ్చి పుచ్చుకుంటారు. ముఖ్యంగా పెండ్లి కుమార్తె వైపువారికి పెండ్లికొడుకు తరఫు నుండి ఎక్కువగా బహుమతులు అందుతాయి. మెండీ ప్రజల్లో బహు భార్యత్వం అసాధారణ విషయం కాదు. అట్లాగే భాగస్వాములను మార్చుకునే ఆచారమూ కనిపిస్తుంది. స్త్రీ పురుషుల్లో ఎవరైనా విడాకులు కోరుకోవచ్చు. విడాకులు తీసుకున్నప్పుడు ఎదుటివారి నుంచి తీసుకున్న బహుమతులను తిరిగి ఇచ్చి వేయవలసి ఉంటుంది. తంద్రులు తమ సంతానానికి తమకున్న తోటలను పంచుతారు. తల్లిదండ్రులు మత పరమైన క్రియలకు సంబంధించిన సమాచారాన్ని అందించి వారిని ఆ విషయంలో జ్ఞానవంతులను చేస్తారు.



పిల్లల పెంపకంలో స్త్రీపురుషులిరువురూ పాల్గొంటారు. అయితే తల్లులు, ఇంట్లో ఉన్న పెద్ద ఆడపిల్లలే ఎక్కువగా ఈ బాధ్యతను తీసుకుంటారు. హైలాండ్‌లో ఉండే మెండీలు తమ మగపిల్లలకు 'ఇనిషియేషన్' కార్యక్రమం జరిపించరు. కానీ మిగతా ప్రాంతాలలో ఈ కార్యక్రమం జరిపించే ఆచారం ఉంది. పిల్లలు ఒకరికొకరు బహు మతులు ఇచ్చుకొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తారు.

దేహాన్ని రంగులతో డిజైన్లు వేసుకోవడం, పక్షి ఈకలతో అలంకరించిన విగ్గులను ధరించడం పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. పబ్లిక్ ఈవెంట్స్ సందర్భంగా సామూహిక ప్రదర్శనలు ఉంటాయి. ఈ సందర్భంలో అనేక మంత్రాలు లాంటివి ఉచ్ఛరిస్తారు. స్త్రీపురుషులు ఇరువురూ వీటిని పాటల్లా గానం చేస్తారు.

ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబంవారికి బహుమతుల ద్వారా సహాయం చేసే ఆచారం ఉంది. మరణ కారణంపై చర్చ జరుగుతుంది. చనిపోయినవారిని స్థానిక స్మశానంలో మాత్రమే పూడ్చిపెడతారు. అట్లా చేస్తే స్థానికంగా ఉండే బంధుమిత్రులను ఆత్మలు కాపాడుతాయని భావిస్తారు.

-మౌక్తిక్

పసిడి మను

- 10 మీ పిస్టోల్‌లో స్వర్ణం కైవసం
- రవికుమార్‌కు కాంస్య పతకం
- ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచకప్



మెక్సికో : షూటింగ్ ప్రపంచకప్‌లో మనోళ్ల పసిడి గురి అదురుతోంది. మహిళల విభాగంలో మను భాకర్ స్వర్ణ గురితో భారత్ పతకాల జోరు పెంచింది. ఈ అక్టోబర్‌లో యూత్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న మను భాకర్.. ప్రపంచకప్‌లోనే సత్తా చాటింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకున్నది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రవికుమార్ కాంస్య పతకం సాధించాడు. దీంతో షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ పతకాల సంఖ్య రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలకు చేరుకున్నది. 24 రౌండ్ల ఫైనల్లో 237.5 పాయింట్లతో మను భాకర్ గోల్డ్ కొట్టేయగా.. లోకల్ స్టార్ జావెలా 237.1తో సిల్వర్‌తో సరిపెట్టుకున్నది. ఫ్రాన్స్ అమ్మాయి గొబెర్‌విల్లె 217.0తో కాంస్యం దక్కించుకున్నది. ఫైనల్స్‌కు చేరిన మరో భారత షూటర్ యషశ్విని సింగ్ 196.1తో తృటిలో పతకం చేజార్చుకున్నది. ఆఖరు రౌండ్‌లో 10.8 పాయింట్లు సాధించిన మను భాకర్ సమీప ప్రత్యర్థిని వెనక్కి నెట్టేసి పసిడి సాధించింది. 'స్వర్ణ పతకం సాధించటం ఎంతో ఆనందంగా ఉంది. ఇది నాకు తొలి ప్రపంచకప్. ఇక్కడే గోల్డ్ కొట్టాను. రానున్న టోర్నీల్లోనూ సత్తా చాటేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని మను భాకర్ ఆనందం వ్యక్తం చేసింది.



కుర్రాళ్లకు ఓ అవకాశం!

1998... శ్రీలంక 50 ఏండ్ల స్వాతంత్ర్య వేడుక. నిదాస్ ట్రోఫీ పోరు. న్యూజిలాండ్, శ్రీలంకలు పోటీపడిన ఆ టోర్నీ ఫైనల్లో ఆతిథ్య లంకపై మనోళ్లు గర్జించారు. గంగూలీ, సచిన్‌లు తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 252 పరుగులు జోడించగా.. నిదాస్ ట్రోఫీ టీమ్ ఇండియా సొంతమైంది.

2018.. శ్రీలంక 70 ఏండ్ల స్వాతంత్ర్య సంబురం. మళ్లీ నిదాస్ ట్రోఫీ పోరాటం. ఈసారి ప్రత్యర్థులు ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్. అప్పుడు దిగ్గజాలతో లంక కెళ్లగా.. ఇప్పుడు సీనియర్లకు విశ్రాంతినివ్వగా కుర్ర జట్టు ద్వీపదేశంలో అడుగుపెట్టింది. అయినా, మనోళ్లే ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నారు. నేడు తొలి పోరులో శ్రీలంకతో తలపడనున్నారు. యువ జోరుకు మరో నిదాస్ ట్రోఫీ మనదయ్యేనా!?

- శ్రీలంకతో తొలి పోరు నేడు
- ఫేవరేట్‌గా టీమ్ ఇండియా
- ముక్కోణపు టీ20 సిరీస్
- సా॥ 7 గంటలకు డీ స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-కొలంబో

ఇటువైపు పరుగుల యంత్రం విరాట్ కోహ్లి లేడు. మిస్టర్ కూల్ ఎం.ఎస్ ధోని కనిపించడు. ఆల్‌రౌండర్ పాండ్య అందుబాటులో లేడు. బౌలింగ్ మెరుపులు భువి, బుమ్రాలు సైతం లేరు. అటు వైపు ఎంజెలో మాథ్యూస్ సహా గుణరత్నె, మధుశంక సేవలు లంకకు లేవు. రెండు వైపులా కీలక ఆటగాళ్లు కొందరు లేకపోయినా.. నిదాస్ ట్రోఫీ తొలి పోరుపై ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. సీనియర్లు లేని భారత్‌పై పంజా విసిరేందుకు ఇదే సరైన అదనుగా లంకేయులు భావిస్తుండగా.. సత్తా చాటేందుకు ఇదే సరైన సమయమని భారత కుర్రాళ్లు ఎదురుచూస్తున్నారు. దీంతో ముక్కోణపు టీ20 తొలి పోరు ఆసక్తికరంగా మారింది. శ్రీలంకపై విరుచుకుపడే అలవాటున్న రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ ఇండియా సమరానికి సిద్ధమైంది.

అటు ఇటు ఆశలు : శ్రీలంకపై మన ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ఆకాశమే హద్దుగా చెలరేగిన రికార్డు ఉంది. తాజా సిరీస్‌లోనూ వీరిద్దరి విధ్వంసాన్ని నిలువరించటమే లంకేయుల ప్రథమ కర్తవ్యం. చాలా కాలంగా తుది జట్టులో లేని కెఎల్ రాహుల్ ఇక్కడ అవకాశం కోసం చూస్తున్నాడు. మిడిల్ ఆర్డర్‌లో సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నాడు. పొట్టి ఫార్మాట్ చిచ్చరపిడుగు సురేశ్ రైనా వన్డే జట్టుపై కన్నేసి భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని భావిస్తున్నాడు. వాషింగ్టన్ సుందర్, దీపక్ హుడాతో పాటు రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్‌లు తుది జట్టులో కోసం పోటీపడుతున్నారు.

శ్రీలంక జట్టులో కుశాల్ మెండిస్ కీలకంగా కనిపిస్తున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్ పర్యటనలో వరుస అర్థ సెంచరీలు బాదిన మెండిస్.. దేశవాళీ క్లబ్ తరఫున అద్భుత ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు. దీంతో తాజా సిరీస్‌లో కుశాల్‌పై లంకేయులు భారీ ఆశలు పెట్టుకున్నారు. గుణతిలక, కుశాల్ పెరీరా, ఉపుల్ తరంగతో పాటు దినేశ్ చండిమాల్ రాణిస్తే విజయావకాశాలు మెండుగా ఉంటాయని లంక భావన.

వర్షం ముప్పు : కొలంబో ప్రేమదాస సహజంగా నెమ్మదైన పిచ్. ఆరంభంలో ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుంది. తక్కువ ఎత్తులో బంతి వచ్చే వికెట్ బ్యాట్స్‌మెన్‌కూ అనుకూలమే. సాయంత్రం వేళ భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది.

తుది జట్లు (అంచనా) : శ్రీలంక : కుశాల్ మెండిస్, ధనుష్క గుణతిలక, కుశాల్ పెరీరా, ఉపుల్ తరంగ, దసున్ శనక, తిశార పెరీరా, దినేశ్ చండిమాల్ (కెప్టెన్), అఖిల ధనంజయ, అమిలా, సురంగ లక్మల్, దుష్మంత చమీరా

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, సురేశ్ రైనా, కెఎల్ రాహుల్, మనీశ్ పాండే, రిషబ్ పంత్/దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్, దీపక్ హుడా, యుజ్వేంద్ర చాహల్, శార్దుల్ ఠాకూర్, అక్షర్ పటేల్, జైదేవ్ ఉనద్కత్.



విజయం, వివాదం

డర్బన్ : సఫారీ గడ్డపై విజయవంతమైన రికార్డును కొనసాగిస్తూ ఆస్ట్రేలియా తొలి టెస్టులో గెలుపొందింది. 417 పరుగుల ఛేదనలో దక్షిణాఫ్రికాను 298కే కుప్పకూల్చిన కంగారూలు 118 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. అయితే, డర్బన్ టెస్టు విజయంపై గురించి కాకుండా, వివాదం చుట్టూ తిరుగుతోంది. మ్యాచ్‌లో పలు మార్లు ఆస్ట్రేలియా ఆటగాళ్లు దురుసుగా ప్రవర్తించటం, తాజాగా (నాల్గోరోజు టీ సెషన్) డెవిడ్ వార్నర్, క్వింటన్ డికాక్‌లు డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళుతూ మెట్లపై గొడవ పడిన వీడియో బయటికొచ్చింది. ఈ విషయమై రెండు దేశాల బోర్డులు ఒకరిపై ఒకరు వేలెత్తి చూపుకుంటున్నారు. డికాక్ గీత దాటి నోరు పారేసుకున్నాడని ఆస్ట్రేలియా బోర్డు వాదిస్తుండగా, డెవిడ్ వార్నర్ వ్యక్తిగతంగా తీసుకోవటంతోనే సమస్య వచ్చిందని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు అంటోంది. రెండో ఇన్నింగ్స్‌లో ఏబీ డివిలియర్స్ రనౌట్ అయిన సందర్భంలోనూ ఆస్ట్రేలియా ఆటగాళ్లు (డెవిడ్ వార్నర్, నాథన్ లియాన్) హద్దు మీరిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో లియాన్‌కు మ్యాచ్ ఫీజులో కొత పడే అవకాశం ఉంది. ఇక నాల్గు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ముందంజ వేసింది. సఫారీ పతనాన్ని శాసించిన మిచెల్ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.